వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక తెలుగు మాస పత్రిక

సంపుటి : 6 సంచిక : 6 హైదరాబాద్ 83 జూన్ 2008 పేజీలు : 48 రు. 10



- ఫోకస్ : మండుతున్న నిత్యావసర వస్తువుల ధరలు
- ఉప ఎన్నికలు - తెలంగాణ
- రాజస్థాన్‌లో గుజ్జర్ల ఆందోళన
- ఐ.టి. పరిశ్రమ - పూర్వాపరాలు
- కాన్షీరాం రాజకీయ వ్యక్తిత్వం
- భాష - ఉచ్చారణల చరిత్ర

వీక్షణం 83 రాజకీయార్థిక, సామాజిక తెలుగు మాసపత్రిక

జూన్ 2008
సంపుటి : 6
సంచిక : 6

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు.	120
3 సంవత్సరాల చందా	రు.	350
5 సంవత్సరాల చందా	రు.	550
10 సంవత్సరాల చందా	రు.	1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక తెలుగు మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
ఇమెయిల్ : reachcdrc@yahoo.com

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
98482 49695

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

ఉప ఎన్నికలు

ఈ సంచిక మీ చేతులకు చేరేటప్పటికి ఉపఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి. ఆ ఫలితాలు ఎలా ఉండబోతాయోగాని ప్రస్తుతం నడుస్తున్న ప్రచార సరళి, ప్రచారం సందర్భంగా ఆయా పార్టీల, అభ్యర్థులు ప్రవర్తిస్తున్న తీరు, వెల్లువలా ప్రవహిస్తున్న వాగ్దానాలు, ఆకర్షణలు, ఆయా రాజకీయ పక్షాల నాయకుల రెండు నాల్కల ధోరణి పార్లమెంటరీ ఎన్నికల వ్యవస్థలోని అస్తవ్యస్త పద్ధతులకు అద్దం పడుతున్నాయి. రానున్న సార్వత్రిక ఎన్నికలు మరెంత దిగజారనున్నాయో చూపుతున్నాయి. నిజానికి నిండా తొమ్మిదినెలల వ్యవధిలేని స్థానం కోసమే ఇంత భారీస్థాయి ప్రచారం, నిధుల ఖర్చు, అక్రమాలు, దూషణలు, దుర్భాషలు సాగుతూ ఉంటే, ఇక సార్వత్రిక ఎన్నికలు ఎంత దారుణంగా జరగబోతాయో ఎవరయినా ఊహించగలరు. ప్రచారంలో పార్టీల అభ్యర్థులు, వారి గుణగణాలు, పార్టీల ఎన్నికల వాగ్దానాలు, ఆ వాగ్దానాల అమలుకు ఉన్న అవకాశాలు, పరిమితులు, సామాజిక అవసరాలు వంటి లోతయిన అంశాలపై చర్చకన్న పార్టీల నాయకుల వాచాలత్వం, చిల్లరతనం, ఆత్మస్తుతి, పరనింద, హింసాపూరితమైన మాటలు, తిట్లు, బూతులు, సభ్యసమాజం అంగీకరించలేని మాటలు, హింసా ఇష్టారాజ్యాంగా చెలరేగుతున్నాయి. ఎన్నికల రాజకీయాలు ఏవో పవిత్రమైనవన్నట్టు, ఇప్పుడు కొందరు వ్యక్తులు, నాయకుల ప్రవర్తనాసరళి వల్లనే అవి ఇంతగా చెడిపోయినట్టు కొందరు భావిస్తున్నారు. ప్రస్తుతం కొందరు వ్యక్తుల, నాయకుల ప్రవర్తనవల్ల ఎన్నికల రాజకీయాల స్థాయి ఇంకా లోతుకు పడిపోయి ఉండవచ్చుగాని, ఈ అపసవ్య ప్రవర్తలన్నీ పార్లమెంటరీ రాజకీయాలలో చాల సహజమైనవే. మన దేశంలోకి పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అంటుకట్టినతీరులోనే ఈ వికృతప్రవర్తన అంతా అంతర్గర్భితంగా ఉంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మూలధాతువులైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సమాజంలో సక్రమంగా లేనప్పుడు వయోజన వోటింగ్ హక్కుకు గాని, ప్రాతినిధ్య వోటుకు గాని అర్థంలేదు. సమానత్వం లేకుండా, వ్యక్తి వ్యక్తిగా ఎదగకుండా ప్రజాస్వామ్యం అనేది, రాజకీయ భాగస్వామ్యం అనేది సాధ్యంకాదు. అసమసమాజంలో అందరు వ్యక్తులకూ సమానమైన వోటు హక్కు రూపంలో ఉండవచ్చు గాని సారంలో ఉండదు. అందరికీ సమాన వోటు హక్కు ఇవ్వాలంటే మొదట ఆ సమాజంలో సమానత్వం ఉండాలి. పాశ్చాత్య పెట్టుబడిదారీ సమాజాలలోనే సమానత్వం లేనందువల్ల ప్రాతినిధ్య ప్రజాస్వామ్య భావన బోలు సరుకుగా మారి చివరికి ఒక అత్యల్ప సంఖ్యాక వర్గపు నియంతృత్వంగా, ధనస్వామ్యంగా పరిణమించింది. ఇక భారత సమాజం వంటి సమాజంలో ధనస్వామ్యం మాత్రమే కాక, తీవ్రమైన కుల, మత, ప్రాంత అసమానతలు ఉన్నచోట ప్రజాస్వామ్యం ప్రవేశించడమే సాధ్యంకాదు. అందువల్లనే, నిర్ణీత కాలవ్యవధిలో ఎన్నికలు జరగడాన్నే ప్రజాస్వామ్యంగా భ్రమ పడుతూ మన ప్రజాస్వామ్యం నడుస్తోంది. ఇది ప్రజాస్వామ్యమేనా అనే అనుమానం ప్రజలకు కలగకుండా ఉండడానికి అప్పుడప్పుడు ప్రజాస్వామిక ఆభాస కలిగించే ఈ ఎన్నికలను, కొన్ని ప్రజాస్వామిక రూపాలను కొనసాగిస్తూ ఉండడం మన పాలకవర్గాలు చేస్తున్నపని. సారంలో ప్రజాస్వామ్యంతో సంబంధంలేనప్పుడు, కేవలం రూపపరంగా మాత్రమే ప్రజాస్వామ్యం కొనసాగుతున్నప్పుడు, ప్రజలను ఆ భ్రమల్లో ముంచి ఉంచడానికి, అసలు సమస్యలనుంచి ప్రజల దృష్టి మరల్చడానికి ఎప్పుడూ ఏదో ఒక అనవసరపు వివాదంతో ప్రజలకు ఆలోచించే ఖాళీలేకుండా ఉండాలి. ప్రస్తుత ఉప ఎన్నికలలో అసలు సమస్యలు పక్కకుపోయి, చంపుతా, నరుకుతా, జనం కోస్తారు లాంటి హింసాపూరితమైన మాటలూ, నువ్వు తినలేదా అంటే నువ్వు తినలేదా అనీ, నువ్వు దొంగవూ అవకాశవాదివీ అంటే నిన్ను మించిన దొంగ ఉన్నాడా అనే పరస్పర వాస్తవ ప్రకటనలూ, ప్రేమించి పెళ్ళి చేసుకోకుండా ఉండడం, ఆడదీ మగాడూ కాకపోవడం, వ్యభిచారం వంటి అసభ్యకరమైన మాటలూ విచ్చలవిడిగా చెలరేగుతున్నాయి. ఎన్నికల క్రమంలో నిజంగా కర్తలూ నిర్మాతలూ సృష్టికర్తలూ భాగస్వాములూ కావలసిన ప్రజలు మౌనసాక్షులుగా, ప్రేక్షకులుగా, సరుకులుగా, అచ్చుగుద్దే యంత్రాలుగా మారిపోతున్నారు. తమ అభిమతాన్ని నిజంగా, సంపూర్ణంగా వ్యక్తం చేసే శక్తి ప్రజల చేతికి అందేదాకా ఎన్నికలు ఇంత రొచ్చుగానే ఉండకతప్పదు. ◆

ప్రత్యర్థుల హత్యలు

రాష్ట్రంలో గత మూడు నాలుగు దశాబ్దాలుగా రాజకీయ ప్రత్యర్థులను, భిన్నాభిప్రాయాలు కలవాళ్లను భౌతికంగా నిర్మూలించడం అనే ప్రక్రియ వేగంగా, పెద్ద ఎత్తున, నిరాటంకంగా సాగిపోతోంది. గత తెలుగుదేశం పాలనాకాలంలో పెరిగిపోయిన ఈ ప్రక్రియ ప్రస్తుత ప్రభుత్వకాలంలో మరింత విచ్చలవిడిగా జరిగిపోతోంది. ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామని ప్రగల్భాలు పలికే పాలకవర్గ పార్టీలన్నీ భిన్నాభిప్రాయపు పీకనొక్కే ఈ ఫాసిజపు వ్యక్తీకరణను నిర్భయంగా, నిర్విచారణగా కొనసాగిస్తున్నాయి. అధికారంలో ఉన్న పార్టీ ఆ పనిని మరింత ఎక్కువగా, భద్రతా బలగాల సాయంతో, దాదూ ఫిర్యాదూ లేకుండా సాగించడంలో ఆశ్చర్యంలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిటాల రవి హత్యతో మొదలయి కొద్దిరోజులకింద మాఫియా నాయకుడు అజీజ్ రెడ్డి, పరిటాల రవి అనుచరుడు రామమోహన్, కర్నూలు జిల్లా ఫాక్షన్ నేత కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు హత్యల దాకా ఈ హత్యల పర్వం నిరాటంకంగా భయంకరంగా సాగిపోతూనే ఉంది. ఈ హత్యాకాండలో హతులలో చాలమంది పార్లమెంటరీ ప్రతిపక్షాలకు చెందినవారే. కేవలం రాయలసీమ జిల్లాలలోనే కొన్ని వందలమందిని ఇలా హత్యచేయడం జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఆ హతులలో చాలమంది ముఠారాజకీయాలలో, హత్యారాజకీయాలలో, నేరవ్యవస్థలో మునిగితేలుతున్న వారే కావచ్చు. ఐనా వారిని భౌతికంగా నిర్మూలించడమే మార్గమని అనుకోనక్కరలేదు. చట్టబద్ధపాలన సక్రమంగా, అందరిపట్లా సమానంగా పనిచేస్తే ఇటువంటి నేరప్రవృత్తి తలెత్తే అవకాశమే తక్కువ. ప్రస్తుత పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు ప్రధానస్రవంతిలో భిన్నాభిప్రాయాలతో వ్యవహరించడం శాంతియుతంగా సాధ్యంకాదనీ, పైకి ఎన్ని శాంతి ప్రవచనాలు పలికినా అట్టడుగున హింసా దౌర్జన్యాలే రాజమార్గమనీ అధికారపక్షం భావిస్తున్నదనడానికి ప్రస్తుతం జరుగుతున్న హత్యలు ఒక సూచిక. ఇక పార్లమెంటరీయేతర మార్గంలో భిన్నాభిప్రాయాలు ఉన్న విప్లవోద్యమ కార్యకర్తలతోనయితే చర్చలు జరుపుతామని ప్రారంభించిన ప్రభుత్వం, తక్కువ కాలంలోనే దమనకాండకు దిగింది. వందలాది మంది కార్యకర్తలను చంపివేసింది. భిన్నాభిప్రాయాలతో వ్యవహరించడంలో ఇటువంటి హింసా దౌర్జన్య పద్ధతులు సరయినవీ, ప్రజాస్వామికమైనవీ కావని గుర్తించి, ప్రతిఘటించవలసిన బాధ్యత ప్రజలదే.


ఎట్టకేలకు మహిళా రిజర్వేషన్లు

కేంద్ర, రాష్ట్ర శాసన నిర్మాణ సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడానికి ఉద్దేశిస్తూ చేయదలచిన చట్టపు ముసాయిదా పన్నెండు సంవత్సరాల తర్వాత ఎట్టకేలకు పార్లమెంట్‌లో రాజ్యసభలో ప్రవేశానికి నోచుకుంది. మహిళల ఇతోధిక రాజకీయ భాగస్వామ్యం కోసం తయారయిన ఈ చట్టపు ముసాయిదాకు చట్టసభ మెట్లు ఎక్కడానికే ఇంతకాలం పట్టిందంటే ఇంక అది చట్టరూపం ధరించడానికి మరెంతకాలం పడుతుందో ఎవరయినా ఊహించవచ్చు. తొలిసారి యునైటెడ్ ఫ్రంట్ పాలనాకాలంలో 1996లో మొదలయిన ఈ బిల్లు ప్రస్తావన, నాలుగుసార్లు ప్రవేశానికి దగ్గరిదాకా వచ్చి అనేక సమంజస, అసమంజస కారణాలతో ఆగిపోతూ వచ్చింది. చివరికి ఇప్పుడు ఆ ఆటంకాలన్నీ తొలగిపోయి అధికార యు.పి.ఎ. మహిళా రిజర్వేషన్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టింది. మహిళా రిజర్వేషన్‌ను చట్టబద్ధం చేస్తామని కనీస ఉమ్మడి ప్రణాళికలో చేసిన వాగ్దానాన్ని నిజం చేయడంలో తొలి అడుగు యు.పి.ఎ. తన పదవీకాలం మరొక పదినెలలలో, అంటే మరొక రెండు పార్లమెంటరీ సమావేశాలలో ముగిసిపోతున్నదనగా వేసిందన్నమాట. ఈ ఆలస్యం అధికారపక్షపు చిత్తశుద్ధి లేమికి అద్దం పడుతున్నది. నిజానికి అధికార యు.పి.ఎ.కు మద్దతు ఇస్తున్న వామపక్షాలు, ప్రతిపక్ష ఎన్.డి.ఎ. అందరూ సమర్థిస్తున్నామనే చెపుతున్నప్పటికీ, ఎన్.డి.ఎ. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష కాంగ్రెస్ మద్దతు ఇస్తానని చెప్పినప్పటికీ ఆ బిల్లు ఇంతకాలం కనీసం ప్రవేశానికి కూడా నోచుకోలేదంటే, ఆ తర్వాత పది సంవత్సరాలకు మొదలయిన ప్రత్యేక ఆర్థిక మండలాల బిల్లు మాత్రం ఒక్కపూటలో ఆమోదం పొందిందంటే ఈ దేశ పాలకవర్గాలు మనసు ఎక్కడ ఉందో అర్థమవుతుంది. మహిళల సాధికారతలో ఈ రిజర్వేషన్ బిల్లు ఒకానొక చిన్న అడుగు మాత్రమే. ఆ అడుగు వేయడానికి కూడ మన పాలకవర్గాలకు ఆసక్తి లేదని గత పన్నెండు సంవత్సరాల చరిత్ర చూపుతున్నది. అయితే ఈ బిల్లు తాత్సారం కావడంలో ప్రధాన కారణంగా వెనుకబడిన కులాల, బలహీనవర్గాల ప్రతినిధులు కనబడడం విషాదకరం. ఈ రిజర్వేషన్ లోపల మళ్ళీ కులాలవారీ రిజర్వేషన్ ఉండకపోతే మొత్తం మహిళా రిజర్వేషన్‌ను అగ్రవర్ణ మహిళలు తన్నుకుపోతారంటూ వాళ్ళు లేవనెత్తిన అభ్యంతరం సరయినదే. అందుకు తగిన సవరణలు చేయడానికి కూడా ఇంత ఆలస్యం అక్కరలేదు. ఆ సాకుతో పితృస్వామిక పాలకవర్గాలు మన సమాజానికి అవసరమయిన ఒక చిన్నపాటి రాజకీయ సంస్కరణలు విఫలం చేస్తూ వచ్చాయి. ఇప్పటికైనా ఈ సంస్కరణను తీసుకువచ్చేలా ఒత్తిడి తేవలసినది ప్రజలే.

తిండిబోతులెవరు?

అంతర్జాతీయ ధరల సంక్షోభానికి, ఆహార కొరతకు కారణం చైనా, భారతదేశాల లోని మధ్యతరగతి ఎక్కువ తినడమేనని అమెరికా పాలకవర్గాలు నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నాయి. ప్రపంచీకరణ క్రమంలో తమ సామ్రాజ్యవాద రాజకీయార్థిక విధానాల వల్ల ఏర్పడిన సంక్షోభాలకు అసలు కారణాలను ప్రజల నుంచి దాచడానికి, ప్రజలను మోసగించడానికి సాగుతున్న ఎత్తుగడ ఇది. అమెరికన్ ఆర్థిక వ్యవస్థలోని వినియోగదారీ సంస్కృతివల్ల, మానవసమాజ అవసరాలకన్న మించి ఎన్నో రెట్లు ఎక్కువ వినియోగం సాగిస్తుండడం వల్ల ఇతర దేశాలలో ఆహార కొరత ఏర్పడుతోంది. సామాజిక వ్యవస్థను సంపూర్ణంగా సొంత వాహనాలమీద ఆధారపడేట్టు చేసి, ఆ వాహనాలకు అవసరమైన ఇంధనం కోసం యుద్ధాలు చేసి లక్షలకోట్ల డాలర్లు భస్మీపటలం చేయడం ఒకవంక, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అన్వేషణ పేరుతో ఆహారపదార్థాల నుంచి ఇంధనం తయారు చేస్తూ కోట్ల టన్ను ఆహారధాన్యాలను అందుకు వినియోగించడం మరోవంక సాగిస్తున్నది అమెరికన్ రాజకీయార్థిక వ్యవస్థ. అంటే ఇవాళ ప్రపంచంలో వనరుల వినియోగంలో దుబారాకు పాల్పడుతున్నది అమెరికన్ పాలకవర్గ విధానాలు. అందువల్ల వందలాది దేశాలలో ఆహార కొరతకు, నిధుల లేమికి, వనరుల దోపిడీకి కారణమవుతున్నది. అమెరికన్ రాజకీయార్థిక విధానాలు, హంతక సామ్రాజ్యవాదం ఎట్లా అబద్ధాలమీద, నిందల మీద బతుకుతుందో అధ్యక్షుడు జార్జి బుష్, విదేశాంగ శాఖ కార్యదర్శి కాండోలిజా రైస్ వ్యాఖ్యలు చూపుతున్నాయి. ◆

లోపలి పేజీల్లో...



'ది హిందు' సౌజన్యంతో

మండుతున్న నిత్యావసర వస్తువుల ధరలు

సేవారంగంలో ముఖ్యంగా పెరుగుతున్నవి రియల్ ఎస్టేట్, సినిమాలు, ఐ.టి. సెక్టర్. ఈ రంగం పెరుగుతోంది అన్నపుడు ఈ రంగంలో పెట్టుబడులు పెరుగుతున్నాయని అర్థం. పెట్టుబడులు ఈ రంగంలో ఎంత పెరుగుతున్నాయో, అంతమేరకు పెట్టుబడులు వ్యవసాయరంగంలోను, పారిశ్రామిక రంగంలోనూ తగ్గుతాయి. అంటే వ్యవసాయం, పరిశ్రమలలో వృద్ధిజరగదు. ఇది ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఒక పరిక్రమ. ఒక రంగం ముందుకు వెళ్ళటం, మిగిలిన రంగాలు వెనుకబడిపోవటం ప్రస్తుత ప్రపంచ సమాజంలో కన్పిస్తున్న అసంబద్ధత. ఈ సంక్షోభం రూపం ఆహారధాన్యాల సంక్షోభంగానూ కన్పిస్తుంది, పరిశ్రమల ఉత్పత్తులలో సంక్షోభంగానూ కనిపిస్తోంది.

ఫోకస్ : మండుతున్న నిత్యావసర వస్తువుల ధరలు

ధరల పెరుగుదల వ్యవస్థాగత సంక్షోభం	*- ఆర్.ఎస్. రావు*	*19*
ధరలతో సామాన్యుల బతుకు భారం	*- టి. లక్ష్మీనారాయణ*	*22*
ధరలెందుకు పెరుగుతున్నాయి ?	*- వి. హనుమంతరావు*	*25*

కొత్త పుస్తకాలు / సి.డి.లు			*6*
పాఠకుల వీక్షణం			*7*
ప్రాంతీయం			*8*
వర్తమానం	*: రాజకీయ ఉద్యమంగా స్థిరపడిన తెలంగాణ*	*- నాగోబా*	*9*
వర్తమానం	*: రాజస్థాన్‌లో గుజ్జర్ల ఆందోళన*	*- ఎన్. యాకయ్య*	*11*
కంప్యూటర్ రంగం	*: ఐ.టి. పరిశ్రమ పరిణామం*	*- అరవింద*	*13*
సంస్మరణ	*: దాసరి నాగభూషణ రావు*		*15*
సామాజిక న్యాయం	*: ఒ.బి.సి. రిజర్వేషన్‌ల చట్టబద్ధత*	*- డా. బండి సాంబయ్య, డా. వంగరి భూమయ్య*	*16*
సంస్మరణ	*: భీమిరెడ్డి నర్సింహారెడ్డి*		*18*
సంస్మరణ	*: విజయ్ టెండూల్కర్*		*24*
ప్రభుత్వం-ఆదివాసులు	*: వాకపల్లి బాధితులకు కోర్టు నోటీసులు*	*- ఎం. నాగరత్నం*	*28*
వ్యక్తిత్వం-పరిచయం	*: బహుజనుల బాంధవుడు - కాన్షీరాం*	*- బి.వీరయ్య, బి. సుధాకర్*	*31*
చేనేత రంగం	*: చేనేత రంగం : సవాళ్లు - పరిష్కారాలు*	*- బండారు జ్వాలానరసింహం*	*34*
శాస్త్రవిజ్ఞానం	*: రాసినది చదవడం*	*- కొడవటిగంటి రోహిణీప్రసాద్*	*39*
విధానవిమర్శ	*: బలహీనపడుతున్న ప్రజాపంపిణీ వ్యవస్థ*	*- రేండ్ల రాజేశం*	*42*
దేశీయం			*45*
అసహజ మరణాల సూచి		*- రాంకి, వై. రామచంద్రం*	*46*

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.


– సంపాదకులు


చందాదారులకు విజ్ఞప్తి!


ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.

మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.


– సర్క్యులేషన్ మేనేజర్
9949391028













- **కవిత 2007** – సంపాదకులు : డా. పాపినేని శివశంకర్, దర్భశయనం శ్రీనివాసాచార్య – సాహితీ మిత్రులు ప్రచురణ – 185 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు : సాహితీ మిత్రులు, 28-10-26/1, మజీద్ ఎదురుగా, అరండల్‌పేట, కార్లమార్క్స్ రోడ్, విజయవాడ – 520 002. ఫోన్ : 0866-2433359, సెల్ : 9490634849; నవోదయ పబ్లిషర్స్, నవోదయ బుక్‌హౌస్, విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్
- **కమ్యూనిజమా? కోస్తావాదమా?** – సి.పి.ఎం. తెలంగాణ వ్యతిరేక వైఖరిపై వ్యాసాలు – సంపాదకులు : సుంకిరెడ్డి నారాయణరెడ్డి, జూపాక సుభద్ర, సంగిశెట్టి శ్రీనివాస్, శ్రీధర్ దేశ్‌పాండే, కాసుల ప్రతాపరెడ్డి – తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రచురణ – 141 పేజీలు, 1/8 డెమీ, రు. 40, ప్రతులకు : శ్రీధర్ దేశ్‌పాండే, జి-1, వరలక్ష్మి అపార్ట్‌మెంట్స్, రోడ్ నెం. 5, అలకాపూరి, హైదరాబాద్ – 500 035, సెల్ : 9949998912; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో
- **చేదుఫలం** – జీవన్ కథలు – ప్రతిభా ప్రచురణలు – 166 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు : జీవన్, ప్రతిభా కుటీరం, 4-1-19, రోటరీ నగర్, ఖమ్మం – 507 002; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో
- **శ్రీ భీమరాయ** – ఉదాహరణ కావ్యం – గుర్రం ధర్మోజీరావు, 25 పేజీలు, 1/8 డెమీ, ప్రతులకు : గుర్రం ధర్మోజీరావు, ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజోలు, తూర్పు గోదావరి జిల్లా, సెల్ : 99492 63267
- **ప్రపంచీకరణ-విద్య** – చుక్కా రామయ్య – రామయ్య విద్యాపీఠం ప్రచురణ, 146 పేజీలు, 1/8 డెమీ, రు. 70, ప్రతులకు : జూలూరు గౌరీశంకర్, 1-8-702/33/20ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్ – 500 044

సి.డి.లు

- **ఆడపిల్ల** – జన్మ జన్మల తల్లి – సహచర బుక్‌మార్క్ సమర్పణ, రచన : వై. వెంకన్న, కోదారి శ్రీను, పి. మధుప్రియ, పి. మల్లేష్ – గానం : బేబి మధుప్రియ; రు. 30
- **అరుణోదయ ప్రతిఘటన స్వరాలు – 1** – అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సమర్పణ, రచన : సుబ్బారావు పాణిగ్రాహి, కౌముది, మిత్ర, నారాయణస్వామి, పటాన్‌చెరు రాములు, సంపత్, సురేష్, గూడ అంజయ్య, అంగడి చెన్నయ్య, బి.ఎన్.బి., ప్రభుదాస్, గోరటి వెంకన్న, దివికుమార్, శీలంస్వామి, ఆర్వీరాజు, జలదేవి, వి. కోటేశ్వరరావు, బ్రిజ్‌మోహన్, గంగిరెడ్డి వెంకట కొండారెడ్డి, కానూరి, భూపాల్, శివసాగర్; గానం : రామారావు, మారోజు వీరన్న, విమల, పటాన్‌చెరు రాములు, సురేష్, సంపత్, అంజిబాబు, జానయ్య, చైతన్య, క్రిష్ణ, నర్సన్న; రు. 45
- **ఉద్యమ జలపాతం** – యశ్‌పాల్ పాటలు – అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సమర్పణ – గానం : నాగన్న, సాయిచంద్, అరుణ, యశ్‌పాల్, రాజమౌళి, శోభ, సృజన, కార్లాయి శ్రీను, విమల, సల్మాన్, రష్మి, లక్ష్మీ, జేసుదాస్, మల్లేష్, చిత్ర, వి. వెంకటరాములు, బాలసుబ్రహ్మణ్యం; రు. 40
- **అరుణోదయ పాటలు** – అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సమర్పణ – రచన : మిత్ర, గోపాల్, సంతోష్, పొద్దు, పృథ్వీ, నిషీధి, బైరాగి, పి. వీరయ్య, సుంకులు, వీరేశం, పోతన, అరుణ, ఈశ్వరయ్య, ఎల్లం; గానం : విమల, సంతోష్, మల్సూరు, వీరన్న, లలిత, మంగ, వెంకన్న, సోమన్న, ఉష, నిర్మల, పుష్ప, పోతన్న,గోపాల్ (అమరుడు), అంబిక, రామారావు, ప్రసాద్; రు. 45
- **తెలంగాణ** – రేలా ధూలా – అస్సోయి ధూలా; తెలంగాణ డప్పు దరువు; కాళోజి; తెలంగానం – సి.డి.లలోని పాటలు ఒక్క సి.డి.గా; రు. 45


పై ఐదు సి.డి.లకు : సహచర బుక్ మార్క్, ఎ.పి.ఎచ్.బి. ఎచ్.ఐ.జి. (ఒ.జి.) బ్లాక్ నెం. 5, షాప్ నెం. 29, సుందరయ్య పార్క్ దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500 044. సెల్ : 9848348173











పాఠకుల వీక్షణం

'వీక్షణం'లో ఇటీవల వస్తున్న వ్యాసాలు పల్చగా ఉంటున్నాయి. లోతైన విశ్లేషణలు ఉండడం లేదు. అంతర్జాతీయ పరిణామాల మీద వస్తున్న వ్యాసాలు సాధారణ రిపోర్టింగ్ స్థాయిలో ఉంటున్నాయే తప్ప దృష్టిని ఇచ్చేటట్టు ఉండడం లేవు. వ్యాసాలు సరిగా లేనప్పుడు పేజీల సంఖ్య తగ్గించడం మేలు కదా.

– పి. నాగభూషణం
హైదరాబాద్

'వీక్షణం'లో మే సంచికలో వచ్చిన 'కోటాపై సుప్రీం కోర్టు తీర్పు – బి.సి.ల పోరాట విజయం' జె. గౌతమ్ గారి వ్యాసం రిజర్వేషన్‌ల చరిత్ర చెబుతూ చాలా వివరంగా ఉంది. రచయిత వ్యక్తం చేసిన క్రీమీలేయర్ ఆందోళన సహేతుకమే. ఏదో ఒక కారణంతో రిజర్వేషన్ల ఫలితాలను అందవలసిన వారికి అందకుండా చేసే కుట్రలో భాగంగానే ఇలాంటి వాదనలు ముందుకు వస్తున్నాయి. జనాభాలో 80 శాతం పైగా ఉన్న దళిత బహుజన, గిరిజన కులాలకు చెందిన వారికి వర్తించే 'రిజర్వేషన్'లు 50 శాతం మాత్రమే. 15–20 శాతం ఉన్న అగ్రకులాలకు మిగతా 50 శాతంతో లబ్ది చేకూరేలాగ ఈ రిజర్వేషన్ల విధానం రూపొందింది. అందునా విద్య, వైద్యం, ఉద్యోగ రంగాలు ప్రైవేటీకరణకు గురైయ్యాక రిజర్వేషన్ల అర్థమే పల్చబడిపోయింది. ఇప్పుడు మళ్ళీ క్రీమీలేయర్ అంశం అలాంటి విధానాల కొనసాగింపు మాత్రమే. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా తరతరాలుగా వెనకబడిన సామాజిక వర్గాలకు అందుతున్న ఈ కొద్దిపాటి రిజర్వేషన్ల సౌకర్యానికి కూడా ఇన్ని మెలికలు పెట్టడంలో పాలకుల ఉద్దేశాలు ఏమిటో మళ్ళీ మళ్ళీ బహిర్గతమౌతూనే ఉన్నాయి. ప్రతిభ గురించి మాట్లాడుకున్నా సమాజంలో ఎవరికి ఎందులో ప్రతిభ ఉంటే అందులో అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తే నిజంగానే సమాజం అభివృద్ధి చెందుతుంది. వాస్తవానికి ప్రకృతి వనరులపైనా, ఆర్థిక, సామాజిక, రాజకీయ అధికారంలోనూ వందలాది సంవత్సరాలుగా రిజర్వేషన్లు అనుభవిస్తున్నది పై వర్గాలకు, కులాలకు చెందిన వారే. చారిత్రక కారణాలు దృష్టిలో ఉంచుకుంటే క్రీమీలేయర్ లాంటి సంకుచిత అడ్డంకులను పాలకులు సృష్టించడం అర్థంలేదు. రచయిత వ్యక్తం చేసిన ఆందోళన సహేతుకం.

– ఎం.ఎల్. ప్రసాద్
విశాఖపట్నం

'వీక్షణం' లాంటి సీరియస్ పత్రికలు వ్యాసరచన పై అన్ని విశ్వ విద్యాలయాల్లోనూ చర్చా గోష్ఠులు నిర్వహించడం వలన కొత్తతరం విద్యార్థులను వ్యాసరచనలోకి తీసుకురావచ్చును. తెలుగు భాషను పరిచయం చేయాల్సిన దుస్థితిలోకి అటు తెలుగు భాష, ఇటు వ్యాస రచన దిగజారిపోతున్నాయి. ఇంగ్లిష్ చదువుల మోజు పెరిగాక తెలుగు భాష చాలా నిర్లక్ష్యానికి గురవుతోంది. ఇప్పటితరం తెలుగు సాహిత్యం వైపుకి తొంగి చూడడం లేదు. ఇది చాలా విచారించదగ్గ పరిణామం. భావాలను సాధారణ పాఠకులకు కూడా తీసుకు వెళ్ళగలిగే, చర్చించగలిగే వాహికగా వ్యాస ప్రక్రియ ఎంతో తోడ్పడుతుంది. వీక్షణం, మార్పు కోరే పత్రికలన్నీ భాషా సాహిత్య ప్రచారం, అభివృద్ధిలకై నడుం బిగిస్తే తప్పక ఫలితాలు ఉంటాయి. అటు పత్రిక ప్రచారం, ఇటు రచయితలను తీర్చిదిద్దుకోవడం రెండూ జరుగుతాయి.

– ఎల్. మీనాకుమారి
అనంతపురం

'వీక్షణం' పత్రికను ఈ మధ్య చదువుతున్నాను. మీ పత్రిక సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలను ప్రస్తావించడమే కాకుండా మంచి చర్చా వేదికగా ఉంటోంది. నిజాలను నిగ్గుతేల్చడంలో, పాఠకులను ఆలోచింప జేయడంలో పత్రిక మరింత కృషి చేయాల్సి ఉందనీ నా అభిప్రాయం.

– సాగర్
కడప సెంట్రల్ జైల్

'వీక్షణం' మే నెల సంచికలోని 'మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం – ఒక పరిశీలన' వ్యాసం బాగుంది. ఎప్పుడో 53 ఏళ్ల క్రితం నిర్మితమైన జల విద్యుత్ కేంద్రం ఒరిస్సా, ఆంధ్ర రాష్ట్రాల మధ్య ఏరకంగా నిర్లక్ష్యానికి గురౌతుందో, అలనా పాలనా లేకున్నా ఈనాటికీ విద్యుత్ ఉత్పాదన లాభసాటిగా ఎలా జరుగుతుందో రచయిత వివరంగా తెలియజేశారు. పాలకులు ఇప్పటికైనా శ్రద్ధ వహించి ఈ అమూల్యమైన జలవిద్యుత్ కేంద్రానికి మరమ్మతులు చెపడితే అందరికీ మేలు.

– జి. యాదగిరి
శనిగరం

'వీక్షణం' ఈ మధ్యకాలంలో నెల మొదటి తేదీకల్లా అందడంలేదు. కారణాలు ఏవైనా ఆసక్తితో ఎదురు చూసే పాఠకులను నిరాశపర్చకుండా గతంలో లాగే మొదటి తేదీకల్లా పత్రిక అందేలా చూడగలరు.

– బి. నాగరాజు
హైదరాబాద్

అసహజ మరణాలు నమోదు చేద్దాం!

ఆగస్ట్ 2006 నుంచి వీక్షణంలో అసహజ మరణాల సూచి ప్రారంభించాం. మన చుట్టూ అసహజంగా చనిపోతున్న రైతులు, చేనేత కార్మికులు, వరకట్న మరణాలు, రకరకాల ప్రమాదాలలో చనిపోతున్నవారు, వైద్యం అందక, ప్రకృతి వైపరీత్యాలతో మరణిస్తున్నవారు, హత్యలు ఇలా అనేక సామాజిక రంగాలనుంచి మరణిస్తున్నవారి సంఖ్యను నమోదు చేయడమే ఈ శీర్షిక ఉద్దేశ్యం. ఏయే సామాజిక, రాజకీయార్థిక కారణాలతో చనిపోతున్నారో పరిశోధన చేయాల్సి ఉంది. ఇప్పటికే 15 జిల్లాల నుంచి మాకు ఈ సమాచారం అందుతోంది. ఇంకా **నల్లగొండ, ఖమ్మం, నిజామాబాద్, పశ్చిమ గోదావరి, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం** జిల్లాల నుంచి అసహజంగా చనిపోతున్న వారి సమాచారం అందాల్సి ఉంది. మేము చేస్తున్న ఈ ప్రయత్నంలో మీరూ పాలుపంచుకోవచ్చు. దీనికి పారితోషికంగా వీక్షణం ప్రతిని పంపిస్తాం.

ఆసక్తి గలవారు వివరాలకై సంప్రదించండి : **వై. రామచంద్రం** (సర్క్యులేషన్ మేనేజర్) ఫోన్ నెం. 9949391028

– సంపాదకులు

ఎస్.సి. రిజర్వేషన్ల వర్గీకరణ

ఎస్.సి.ల వర్గీకరణపై అధ్యయనానికి ఏర్పాటైన ఉషా మెహ్రా కమిషన్ తరఫున ఉషా మెహ్రా తన నివేదికను మే 1న కేంద్ర సామాజిక న్యాయ మంత్రి మీరాకుమార్‌కు అందచేశారు. ఎస్.సి.లను ఎ, బి, సి, డి లుగా వర్గీకరించాలన్న వాదనకు కమిషన్ నివేదిక స్థూలంగా సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. వర్గీకరణ అమలు చేయదలచుకున్న రాష్ట్రాలు శాసనసభలలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి పంపినప్పటికీ దానిపై నిర్ణయం తీసుకునే అధికారం కేంద్రానికే ఉండాలని కమిషన్ సిఫారసు చేసింది. ఆయా ప్రాంతాలలోని ప్రత్యేక పరిస్థితుల ఆధారంగా నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని మాత్రం రాష్ట్రాలకు ఇవ్వాలని నివేదిక పేర్కొంది. వర్గీకరణ ఫలాలు ఎలా ఉండాలన్న అంశంపై వ్యాఖ్యానిస్తూ 'రిజర్వేషన్ ఫలితాలను ఎస్.సి.లోని అన్ని కులాలు సమానంగా పొందలేకపోవడమే వర్గీకరణ డిమాండ్ రావడానికి ప్రధాన కారణమని, అయితే ఈ సమయంలో వర్గీకరణ చేసినా ఆ ఫలితాలను ఎస్.సి.లోని అరవై ఉపకులలాకు సమానంగా అందే చర్యలు తీసుకోకపోతే వర్గీకరణ ప్రయోజనం నెరవేరదని' ఉషా మెహ్రా పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల్లో నిర్లక్ష్యమెంత ?

మే 3న గుంటూరు మార్కెట్ యార్డ్‌లో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో లక్ష క్వింటాళ్ల మిర్చి బుగ్గిపాలయింది. వంద కోట్ల రూపాయల దాకా నష్టం వాటిల్లినట్లు అంచనా. రాష్ట్రంలో ఏడాదికి 21,249 అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఏడాది జరిగిన అగ్ని ప్రమాదాల్లో 1571 తీవ్రమైన, 6332 మధ్యతరహా, 12,882 సాధారణ అగ్నిప్రమాదాలు సంభవించాయి. 221 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆస్తినష్టం అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో రు. 160 కోట్లు, తరవాత మెదక్, గుంటూరులలో వరుసగా 35 కోట్లు, 17 కోట్ల రూపాయల నష్టం సంభవించింది. ప్రాణ నష్టం విషయంలో మెదక్ లో 56 మంది, వరంగల్‌లో 20 మంది, హైదరాబాద్‌లో 13, కడపలో 14 మంది, ప్రకాశం, ఉభయగోదావరి జిల్లాల్లో 12 మంది చొప్పున చనిపోయారు. అగ్నిమాపక శాఖలో సిబ్బంది కొరత, వాహనాల కొరతతో నష్టాల ఉధృతి ఈ రకంగా ఉంటోంది. 1993 తరువాత ఈ శాఖలో ఒక్క పోస్టుకూడా (ఖాళీలు–1100) భర్తీ కాలేదు.

నిషేధించాల్సింది సమ్మెలనా? సమస్యలనా?

రాష్ట్ర ప్రభుత్వం ఎకనామిక్ ప్రాసెసింగ్ జోన్స్, ప్రత్యేక ఆర్థిక మండలాలలో సమ్మెలను కొద్దికాలం క్రితం నిషేధించింది. ఇందుకుగాను పారిశ్రామిక వివాదాల చట్టానికి సవరణలు చేసింది. ఈ తరహా విధానాన్ని ప్రజా అవసరాల సంస్థలు ఆర్.టి.సి, విద్యుత్ విభాగం, సింగరేణి కాలరీస్, పాల ఉత్పత్తుల సంస్థలు, ఫార్మా పరిశ్రమలు, రవాణా రంగాలకు కూడా విస్తరించింది. మరో పదిహేను సంస్థలకు కూడా ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. దీని ప్రకారం ఈ రంగాలలోని కార్మికులు సమ్మెలు చేయాలంటే కనీసం 45 రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది.

రాజకీయ నాయకులు - భాష

'తెలంగాణ విషయంలో కాంగ్రెస్ పార్టీ అటు ఆడకాదూ – ఇటు మగా కాదూ' అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. నారాయణ అనడం భాషలో ఆయన వెనుకబాటుతనాన్ని సూచిస్తోంది. అలాంటి స్థితిలో పుట్టేవాళ్లు అలా కోరుకొని పుట్టరు. ఆ స్థితిని అవమానకరంగా భాషలో ఉపయోగించడం రాజకీయ వెనుకబాటుతనం. అలాగే మంత్రి జె.సి. దివాకర్ రెడ్డి ఇటీవల ఒక సమావేశంలో 'తల ఎత్తుకు తిరగేవాడే రెడ్డి' అని అనడం జనాభాలో రెడ్డి కులస్తులు కాక మిగిలి ఉన్న జనాభా అంతటినీ అవమానించడమే. ఒకపక్క పౌరులు అందరూ సమానమే అనే రాజ్యాంగం పై ప్రమాణం చేసి మరోపక్క ఆ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరించడం కులదురహంకారం మాత్రమే.

ఈ పరుగు బతుకు కోసమేనా

పోలీస్ ఉద్యోగాల అర్హత పరీక్షల్లో భాగంగా నిర్వహించే పరుగు కొందరు అభ్యర్థులకు మృత్యువుగా పరిణమిస్తోంది. రాష్ట్రంలో, దేశంలో పరిస్థితి తీవ్ర నిరుద్యోగ సమస్య ఒకవైపు, ఉద్యోగాల కొరత మరోవైపుగా ఉంది. ఉన్న విడికెడు ఉద్యోగాలకు ఎక్కువ మంది పోటీపడాల్సిరావడంతో ఉద్యోగార్థులను వడబోయడానికి రకరకాల అర్హత పరీక్షలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఇటీవల పదహారు వేలకు పైగా కానిస్టేబుల్ పోస్టులకు అభ్యర్థుల ఎంపికలో భాగంగా నిర్వహిస్తున్న పరుగులో ఇప్పటి వరకు ముగ్గురు – సి.ఎచ్. శ్రవణ్‌కుమార్ (విజయవాడ), రౌతు నరేందర్ (వరంగల్), జాలాది కాంతారావు (ఖమ్మం)లు అసువులు బాసారు. మండే ఎండల్లో నిర్వహిస్తున్న ఈ పరుగుపై సర్వత్రా విమర్శలు వెలువెత్తాయి.

నిన్న ఆమ్వే..... నేడు గోల్డ్‌క్వెస్ట్

సినితారలు, రాజకీయ నాయకులు, క్రికెటర్లు, ఇంకా పలు రంగాల ప్రముఖులు బ్రాండ్ అంబాసిడర్స్‌గా ప్రచారం నిర్వహిస్తుండడంతో ఆమ్వే, గోల్డ్‌క్వెస్ట్ లాంటి స్కీంల కోరల్లో సామాన్యులు మళ్ళీ మళ్ళీ ఇరుక్కుంటున్నారు. 'ఈజీ మనీ.... టేకిట్ ఈజీ' ఇదే నేటి పాలసీగా ఉత్పత్తి, శ్రమ లాంటి మాటలు అవసరంలేని వ్యాపార సంస్కృతి సర్వత్రా చలామణి అవుతోంది. స్కీంలూ, స్కాంలూ, ఇన్‌స్టాల్మెంట్లూ, ఎక్కువ వడ్డీ ఆశ ఇలా రకరకాల పద్ధతుల్లో ప్రజలు మోసపోతూనే ఉన్నారు. బతుకు జూదంగా మారిపోయి రకరకాల పేర్లతో సాగే లాటరీల్లో తమ అదృష్టం పరీక్షించుకోవడంగా పరిస్థితి దిగజారిపోయింది.

రోడ్డు ప్రమాదాలు నివారించలేమా?

గత మూడేళ్లలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. అనవసరంగా ప్రాణాలు గాలిలో కలుస్తునే ఉన్నాయి. 2005లో 38,339 రోడ్డు ప్రమాదాలు సంభవించగా, 11,076 మంది చనిపోయారు, 53,666 మంది గాయపడ్డారు. 2006లో 42,855 రోడ్డు ప్రమాదాలు జరగగా 12,397 మంది మరణించారు, 60,068 మంది గాయపడ్డారు. గత ఏడాది చూస్తే ఈ ప్రమాదాలు 43,912కు పెరగగా చనిపోయిన వారి సంఖ్య కూడా 13,548 మందిగా ఉంది. ఈ ప్రమాదాలు నివారించే దిశగా అందరూ ఆలోచించాల్సి ఉంది.

వడదెబ్బకు ఇలా రాలిపోవలసిందేనా?

ఈ ఏడాది వడదెబ్బకు 700 మందికి పైగా చనిపోయారు. మానవతతో ఆలోచించి ఏ ఊరికావూరిలో చలివేంద్రాలు, గంజి కేంద్రాలు, కాస్త నీడ సదుపాయం, పని వేళల్లో మార్పులు లాంటివి చేపడితే ఈ ఎండలను అధిగమించడం కష్టమేమీ కాదు. ◆

అన్ని పార్టీలూ మేం తెలంగాణకు వ్యతిరేకం కాదనో, వస్తే మా వల్లే వస్తుందనో అని హామీ పడుతున్న విధానంలోనే తెలంగాణ బలం ఉందంటున్నారు **నాగోబా**

రాజకీయ ఉద్యమంగా స్థిరపడిన తెలంగాణ

ఉపఎన్నికల ప్రచారం చివరి దశకు వచ్చింది. ఈ ఇరవై రోజుల ప్రచార సరళిని గమనిస్తే ఒక విషయం స్పష్టమైపోయింది. తెలంగాణ రాష్ట్ర డిమాండ్ పల్లె పల్లెకు చొచ్చుకుపోయిందని, అతి సామాన్య రైతు నుంచి నిరుద్యోగ యువకుల దాకా పాకిపోయిందని తెల్సిపోయింది. తెలుగుదేశం తరఫున ప్రచార బాధ్యతలు నిర్వహిస్తున్న చంద్రబాబుకు అనేక చోట్ల ప్రజలు తెలంగాణ నినాదాన్ని వినిపించారు, తెలంగాణాపై మీ వైఖరేమిటని నిలదీసినారు. చంద్రబాబు వారికి స్పష్టమైన జవాబులు చెప్పలేక తెల్లమొగమేసి వెనుదిరగక తప్పలేదు. వరంగల్ జిల్లాలో ఫణికర మల్లయ్య చంద్రబాబు కలువక ముందురోజు వరకు ఎవరికీ తెలియని అతి సామాన్య సన్నకారు రైతు. ఇవ్వాళ ఫణికర మల్లయ్య మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజలకు స్ఫూర్తి ప్రదాత. ఆయన చేసిందల్లా 'మా కష్టాలు తీరాలంటె మా తెలంగాణ మాకు కావాలె' అని చంద్రబాబుతో సూటిగా చెప్పటమే. అదే రీతిలో కమలాపూర్ నియోజకవర్గంలో మరో రైతు తెలంగాణపై మీ వైఖరేమిటని నిలదీయడం, మరో రెండు రోజుల్లో నిర్మల్ నియోజకవర్గంలో క్షౌరశాలలో పనిచేస్తున్న 18 ఏండ్ల యువకుడు 'జై తెలంగాణ' నినాదమిస్తూ 'మా తెలంగాణ మాకు కావాలె' అని అన్నడు. ఇదే రకమైన అనుభవాలు ముఖ్యమంత్రి, మంత్రులు ఎదుర్కొంటున్నారు. వీటిని అక్కడక్కడ జరిగిన విడివిడి సంఘటనలుగా చూస్తే అది అవగాహనారాహిత్యమే అవుతుంది. ఇవి తెలంగాణ జనాభిప్రాయానికి సూచికలుగానే పరిగణించాల్సి ఉంటుంది.

ఇవ్వాళ తెలంగాణ ఒక రాజకీయ డిమాండ్‌గా స్థిరపడి పోయిందనడానికి పై సంఘటనే సాక్ష్యం. ఫణికర మల్లయ్య ఎందుకు తెలంగాణ రావాలని కోరుకుంటున్నాడు? ఎందుకంటే తెలంగాణ వస్తే తమ చెరువులు బాగుపడతాయని, చెరువు వస్తే ఊర్లో వ్యవసాయం బాగుపడ్తుందని, వ్యవసాయం బాగుపడితే వ్యవసాయం చుట్టూ అల్లుకున్న జనజీవితం బాగుపడ్తుందని, మునుపటి పల్లె తిరిగి వస్తుందని అతని ఆశ. నిర్మల్ క్షౌరశాలలో చేస్తున్న యువకుడి ఆశ కూడా తెలంగాణ వస్తే తమ ఉద్యోగాలు తమకు దక్కుతాయని, అందుకే వారందరు తెలంగాణ కోరుకుంటున్నారు. మాకు సీమాంధ్ర వలస పాలన వద్దు, మా తెలంగాణ మాకిస్తే మా అభివృద్ధి మేం చేసుకుంటాం అంటున్నారు. ఎన్నికల్లో అభ్యర్థుల మంచి చెడ్డలను చూడదల్చుకోలేదు తెలంగాణకే మా ఓటు అంటున్నారు. ఇవి వ్యక్తుల మధ్య, పార్టీల మధ్య పోటీకాదు తెలంగాణ వాదానికి–సమైక్య వాదానికి మధ్య పోటీ అన్న స్పష్టత తెలంగాణ ప్రజలకు ఉన్నది. ఏ ఉద్యమమైన దశల వారిగా పరిణతి చెందుతుంది. భారత జాతీయోద్యమాన్ని విశ్లేషిస్తే 19వ శతాబ్దం చివరి దశకాల్లో ప్రారంభమైన భారతజాతీయ కాంగ్రెస్ మొదట్లో బ్రిటిష్ వలస దోపిడీనీ ప్రధానంగా ఎత్తి చూపింది. ఈ వలసదోపిడీ అంతం కావాలంటే బ్రిటిష్ వలస పాలన నుండి దేశం విముక్తి పోందాలని చెప్పింది. ఈ రకమైన భావ ప్రచారం 20వ శతాబ్దం తొలి దశకందాకా సాగింది. భారత జాతీయోద్యమంలోకి విస్తృతస్థాయిలో ప్రజల సమీకరణ సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమంతోనే సాధ్యమైంది. వందేమాతరం, తిలక్ ప్రారంభించిన సామూహిక గణేష్ ఉత్సవాలు తదితర సాంస్కృతిక పరమైన కార్యక్రమాలు ప్రజల్లో జాతి భావనని, దేశభక్తిని రగిలించాయి. జాతీయోద్యమం అటు తర్వాత ఊపందుకున్నది. ఈ నేపథ్యంలోనే గాంధీ జాతీయోద్యమ నాయకత్వాన్ని స్వీకరించాడు. రెండో ప్రపంచ యుద్ధ కాలనికి స్వాతంత్ర్యకాంక్ష రాజకీయ స్వభావాన్ని సంతరించుకున్నది. ఒకవైపు గాంధీ, నెహ్రూ, పటేల్ తదితరుల నాయకత్వంలో జాతీయోద్యమం జరుగుతుంటే, చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్ తదితరుల నాయకత్వంలో సాయుధపోరు కూడా సాగింది. 1942 నాటికి 'క్విట్ ఇండియా' ఉద్యమంగా పరిణతి చెందింది. అటు తర్వాత ఐదేండ్లకే దేశానికి స్వాతంత్ర్యం రావడం అందరూ ఎరిగిందే. ఇటువంటి పరిణామగతినే వర్తమాన తెలంగాణ ఉద్యమంలోనూ చాడవచ్చు. 1996లో తెలంగాణ సభలు తిరిగి ప్రారంభమైనపుడు ఉద్యమ నాయకులు ప్రధానంగా ఆంధ్ర వలస దోపిడీనే ప్రస్తావించారు. గణాంకాలను సేకరించి వ్యాసాలు రాసారు.. పుస్తకాలు ప్రచురించారు. నీళ్లు నిధులు, నియమకాలు, విద్య తదితర రంగాలలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని, వివక్షను విస్తృతంగా చర్చకు పెట్టారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించేవారు కూడా తెలంగాణ అన్ని రంగాలలో వివక్షకి, అన్యాయానికి గురి అయ్యిందని అంగీకరించారు. ఈ భావ ప్రచారం సాగుతుండగానే రెండో స్థాయిలో సాంస్కృతిక ఉద్యమం ఊపందుకుంది. తెలంగాణ రచయితలు, కవులు, కళాకారులు సంఘటితమై తెలంగాణ భాషా, సాంస్కృతిక అస్తిత్వాన్ని ఎజెండా మీదికి తెచ్చారు. కవులు, రచయితలు తెలంగాణ స్పృహతో కవిత్వాన్ని, కథల్ని రాసారు. వందలాదిగా పుస్తకాలు అచ్చయినాయి. కళాకారులు ధూం ధాం, ఆటపాటల పేరిట తెలంగాణ అంతటా సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. గద్దర్ నాయకత్వంలో వందలాది మంది కళాకారులు మహా సాంస్కృతిక యాత్రను జరిపారు. ఈ కాలంలో 500 పైగా తెలంగాణ పాటల క్యాసెట్లు, సిడిలు వెలువడి తెలంగాణ అంతటా మారుమోగాయి.

ఈ సాంస్కృతిక ఉద్యమం తెలంగాణ వాదాన్ని పల్లెపల్లెకి చేర్చాయి. ఫణికర మల్లయ్యలు తెలంగాణ నినాదాన్ని అందుకున్నారు. ఇక మూడో స్థాయిలో తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష రాజకీయ ఉద్యమంగా, తెలంగాణ డిమాండ్ రాజకీయ డిమాండ్‌గా ఇప్పుడు స్థిరపడిపోయింది. అందుకనే 'అభివృద్ధి మా పౌరహక్కు, తెలంగాణ మా జన్మహక్కు' అన్న నినాదం ప్రజల నాలుకల మీద తీవ్రంగా ధ్వనిస్తుంది. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రచారానికి లొంగిపోవడానికి తెలంగాణ ప్రజలు ఇపుడు సిద్ధంగా లేరు. అవ్వాకావాలి – బువ్వాకావాలి అన్నట్లు అభివృద్ధి కావాలి – తెలంగాణ కావాలి అంటున్నారు.

వైఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ప్రచారాన్ని కూడా తెలంగాణ ఉద్యమం చర్చకు పెట్టింది. తెలంగాణ ప్రజలు తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను వ్యక్తపరుస్తూ పోరాటాలకు సమాయత్తమైన అన్ని సందర్భాలలో వలసపాలకులు ప్రజలను తమ ఆకాంక్షల నుండి దూరం చేయడానికి అనేక మాయోపాయాలు, కుట్రలు, కుతంత్రాలతో విద్రోహాలకు పాల్పడినారు. ఆఖరి అస్త్రంగా అభివృద్ధి వాదాన్ని ముందుకు తెచ్చి ప్రజల్ని మభ్యపెట్టె ప్రయత్నం చేస్తున్నారు. 1969లో బ్రహ్మానందరెడ్డి, 1990ల నుండి 2004 వరకు చంద్రబాబు ఇటువంటి ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. ఇపుడు వైఎస్ మరోమారు అదే ప్రయత్నంలో ఉన్నాడు. జలయజ్ఞం, ఇతర సంక్షేమ పథకాల ద్వారా ప్రజల్ని దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నాడు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు ప్రాతిపదిక అభివృద్ధికాదు. తెలంగాణ 1956లో కోల్పోయిన స్వయంపాలన, వనరుల వినియోగం మీద స్వేచ్ఛ, తెలంగాణ ప్రత్యేక భాషా సాంస్కృతిక అస్తిత్వ పరిరక్షణ మొదలైన కీలకాంశాలే ప్రాతిపదికలు. స్వయంపాలనలోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని తెలంగాణ ఉద్యమం చెబుతూ వస్తున్నప్పటికీ పాలకులు ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను అభివృద్ధికి కుదించివేస్తున్నారు.

అభివృద్ధి ప్రత్యేకరాష్ట్రం వేరువేరు కాదు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం అభివృద్ధి చెందడానికి కావాల్సిన వ్యవస్థాగతమైన, పాలనాపరమైన ఏర్పాట్లు లేవు కనుకనే 50 ఏండ్లుగా తెలంగాణ వెనుకబడిపోయి ఉన్నది. అభివృద్ధి ఎపుడు సాధ్యమవుతుంది? లభ్యమయ్యే వనరులను తమ స్థానిక అవసరాలకు అనుగుణంగా వినియోగించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించినపుడే సమగ్ర అభివృద్ధి సాధ్యం. అయితే తెలంగాణ ప్రకృతి వనరులు భూమి, నీరు, బొగ్గు, అటవీసంపద, ఖనిజాలు, మానవనిర్మిత వనరులు, నిధులు, నియామకాలు తదితరాలు ఇతర ప్రాంత ఆధిపత్యశక్తుల చేతుల్లో ఉన్నాయి. కాబట్టి 50 ఏండ్లుగా ఈ వనరులు దోపిడీకి గురి అయినాయి. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలకు ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ ముందుకు తేవడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేనేలేదు.

ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి నమూనాలో మనిషి విధ్వంసానికి గురి అవుతున్నాడు. మనుషులు నిర్వాసితులవుతున్నారు, ఆత్మహత్యలపాలవుతున్నారు. పొట్టచేతబట్టుకొని బతుకుతెరువు వెదుక్కుంటూ వలసలు పోయారు. ఆకలిచావుల పాలయినారు. జీవన ప్రమాణాలు కుదించుక పోయినాయి. మనుషుల మధ్య అసమానతలు, ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగిపోయినాయి. వరల్డ్‌బ్యాంకు రూపొందించిన అభివృద్ధి నమూనాని అత్యుత్సాహంతో అమలుపరిచిన చంద్రబాబుని ప్రజలు తిరస్కరించారు. చంద్రబాబుని తిరస్కరించిన ప్రజలు వైఎస్‌ని గద్దెనెక్కించారు. చంద్రబాబు అమలు చేసిన అభివృద్ధి నమూనాకు భిన్నమైనదాన్ని అనుసరిస్తాడని ప్రజలు ఆశించారు, కాని కొద్ది రోజుల్లోనే ఆయన నైజం జమటపడింది. చంద్రబాబు వదిలివెళ్లిన బూట్లకాళ్లపెట్టి, ఆయన వేసిన బాటలోనే నడుస్తున్నాడని అర్థమైంది. వైఎస్ చంద్రబాబుకి వేసిన కొత్త వేషం అని ప్రజలు పసిగట్టారు. ఈ నాలుగేళ్ల వైఎస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు ఆగలేదు, అభివృద్ధి పథకాల పేరుమీద, సెజ్‌ల పేరుమీద వేలాది మంది పేద ప్రజలు తమ భూముల నుండి బేదఖలు అయి నిర్వాసితులు అవుతున్నారు. రింగురోడ్లు, అంతర్జాతీయ విమానాశ్రయం, రాష్ట్రంలో ఏర్పాటైన సెజ్‌లు ఇందుకు సాక్ష్యం. పోలవరం ప్రాజెక్టును ఆదివాసీలు ఎంత వ్యతిరేకించినా ప్రభుత్వం పట్టించుకోవడానికి సిద్ధంగాలేదు. కృష్ణా నీళ్లను రాయల సీమకు, గోదావరి నీళ్లను కోస్తాకు తరలించేందుకు జలయజ్ఞం సాగుతున్నది. తెలంగాణ భూములను తెగనమ్మి ఆ నిధులను ఇతర ప్రాంతాల అభివృద్ధికి వెచ్చిస్తున్నారు. ఉద్యోగరంగంలో తెలంగాణ పట్ల వివక్ష అంతం కానేలేదు. 610 జి.ఒ. కింద ఒక్క స్థానికేతర ఉద్యోగి కూడా వెనక్కి పోలేదు. స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు మెరుగుపడలేదు. సాగునీటి రంగంలో 50 శాతం నిధులను తెలంగాణాలోనే ఖర్చుపెడుతున్నామంటారు కాని కృష్ణా, గోదావరి నీటిలో తెలంగాణ వాటా ఎంతో చెప్పమంటే చెప్పరు. నీళ్లు పారని పైపులు, కరెంటులేని మోటార్లతో నీరు వస్తుందని నమ్మటానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరు. విద్యారంగంలో ప్రభుత్వ పెట్టుబడులు సీమాంధ్ర లలోనే కేంద్రీకృతమవుతున్నాయి. తెలంగాణలో విద్యపై ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోయి ప్రైవేట్ పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఇవి తెలంగాణాపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చదువు కొనలేని పేద విద్యార్థులు మధ్యలోనే చదువు వదిలిపెట్టి బాలకార్మికులుగా మారే ప్రక్రియ తెలంగాణలో పెరిగిందని సెస్ అధ్యయనాలు తేల్చి చెబుతున్నాయి. విద్య, వ్యవసాయం, వైద్యం తదితర రంగాలలో తెలంగాణ ప్రజలు ప్రభుత్వ పెట్టుబడి మీద కంటె తమ స్వంత పెట్టుబడుల మీదనే ఆధారపడుతున్నారు. కడప జిల్లాలో జరిగిన అభివృద్ధి లో శతాంశమైనా తెలంగాణలో జరిగిందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వైఎస్ పాలనలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి క్రమం ఇట్లా ఉన్నది.

అభివృద్ధి ప్రచారం చేస్తున్న పాలకులకు తెలంగాణ ప్రజల సూటి ప్రశ్న. తెలంగాణలో ఈ నాలుగేండ్లలో అభివృద్ధి జరిగితే ప్రజల ఆదాయాలు పెరగాలి. ఈ ఆదాయాలలోంచే ప్రజలు కొంత ఆహారంపై వెచ్చించడానికి సిద్ధపడతారు. అటువంటప్పుడు ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన నాలుగేండ్ల తర్వాత రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం ఎందుకు ప్రవేశపెట్టినట్లు? నిజానికి సుప్రీంకోర్టు కిలో మూడు రూపాయలకు కుటుంబానికి 35 కిలోలు ఇవ్వమని తీర్పిచ్చింది. ప్రభుత్వానికి ప్రజల ఆహార భద్రతమీద శ్రద్ధ ఉంటే నాలుగేండ్ల క్రితమే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మూడు రూపాయలకు కిలో చొప్పున 35 కిలోల బియ్యం ఇచ్చి ఉండేది, కాని ఎన్నికల ముందు బియ్యం పథకం వచ్చిందంటె ప్రభుత్వం దృష్టి ఓట్లమీదనే తప్ప ప్రజల ఆహార భద్రతపట్ల కాదనేది స్పష్టమవుతున్నది. ఈ పథకాలు కూడా ప్రజలు తెలంగాణ నినాదాన్ని ఎత్తుకున్నందుకు వచ్చినవేకాని ప్రజల మీద ప్రేమతో కాదు.

గత ఎన్నికలలో గుజ్జర్ల రిజర్వేషన్లకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బి.జె.పి. ప్రభుత్వం మాట తప్పడమే కాక, ఇప్పుడు గుజ్జర్ల ఉద్యమాన్ని పాశవికంగా అణిచివేస్తోందని అంటున్నారు **ఎన్. యాకయ్య**

రాజస్థాన్‌లో గుజ్జర్ల ఆందోళన

తరతరాలుగా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రత్యేకావశాలు కల్పించడం కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన వెసులుబాటును సద్వినియోగం చేసుకునే విషయంలో వివిధ వర్గాల మధ్య పోటీ పెరుగుతోంది. కొన్ని ప్రాంతాలలో కులాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో షెడ్యూల్డ్ కులాలను రిజర్వేషన్ల అమలు నిమిత్తం వర్గీకరించాలని కోరుతూ ఉద్యమాలు జరుగుతున్న విధంగానే అన్ని రాష్ట్రాలలోనూ ఏదో ఒక స్థాయిలో నిమ్న వర్గాలలో కదలికలు కనిపిస్తున్నాయి. రాజస్థాన్‌లో గత ఆరు దశాబ్దాలుగా సాగుతున్న గుజ్జర్ల ఉద్యమం కూడా ఇలాంటిదే. తమను ఎస్.టి.లుగా గుర్తించాలని వారు చేపట్టిన ఉద్యమం 2007, 2008 జూన్, మే నెలల్లో ఉగ్రరూపం దాల్చింది. ఈ రెండు సంవత్సరాల్లో రెండుసార్లు ఉప్పెనలా వెల్లువెత్తిన ఉద్యమంపై పోలీసులు జరిపిన కాల్పుల్లో 75 మంది గుజ్జర్లు మరణించారు. ఎన్నికల సందర్భంగా గుజ్జర్లను ఎస్.టి.ల్లో చేరుస్తామంటూ ఇచ్చిన హామీని నెరవేర్చని బి.జె.పి. ప్రభుత్వం వారిపై అణిచివేతకు పాల్పడుతోంది. ఆ రాష్ట్రానికి తోడు కేంద్ర ప్రభుత్వం కూడా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా వారి ఉద్యమాన్ని పాశవికంగా అణిచివేయాలని చూస్తోంది. దీంతో గుజ్జర్లు కూడా తమ చేతికందిన ఆయుధాలతో సాయుధులవుతున్నారు. గుజ్జర్లు ఇంతగా తెగించి పోరాడడానికి వెనుక కారణాలున్నాయి.

అమలు చేయని ఎన్నికల హామీ

అలవికాని హామీలను ఇవ్వడం నేరం. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం అన్యాయం. గుజ్జర్లను ఎస్.టి. జాబితాలో చేర్చుతామంటూ ఇలాగే 2004 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బి.జె.పి. వాగ్దానం చేసింది. వసుంధరా రాజే స్వయంగా ప్రచార సభలలో ఈ హామీని పునరుద్ఘాటించారు. ఎన్నికలకు బాగా ముందుగానే, ఎన్.డి.ఎ. మంత్రిమండలిలో సభ్యురాలుగా ఉన్న కాలంలోనే వసుంధర గుజ్జర్ల కోర్కెను సమర్థించారు. కానీ అధికారంలోకి రాగానే ఈ సమస్యను పరిష్కరించవలసిన బాధ్యతను విస్మరించారు. మాదిగలు కోరుతున్న వర్గీకరణకు రాజ్యాంగ సవరణ అవసరమైనట్లే ఎస్.టి. జాబితాలో చేర్చడానికి కూడా రాజ్యాంగాన్ని సవరించవలసిందే. ఈ మేరకు రాజస్థాన్ ప్రభుత్వం కేంద్రానికి సిఫారసు చేయాలి. ఈ వ్యవహారాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు వసుంధరా రాజే 2006లో నియమించిన మంత్రివర్గ ఉపసంఘం 2007 నాటికి ఒకే ఒక్కసారి సమావేశం కావడం పాలకుల చిత్తశుద్ధిని సూచిస్తోంది.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం చెందిన గుజ్జర్లు 29 మే 2007న శాంతియుతంగా ఆందోళన ప్రారంభించడానికి దౌసాకు వేల సంఖ్యలో తరలివచ్చారు. అలా వచ్చినవారిపై ముందస్తు హెచ్చరికలు లేకుండా పోలీసులు కాల్పులు జరపడంతో ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా

ఈ ఎరుక ప్రజలకు ఉన్నది. కనుకనే పాలకులు ఎంత అభివృద్ధి ప్రచారం చేసినా ప్రజలు మాత్రం తమ జీవితానుభవాలనుంచే ఆలోచించి తీర్పునిస్తారు. చంద్రబాబుని తిరస్కరించడం ద్వారా, కరీంనగర్‌లో కెసిఆర్‌ను ఎన్నుకొని ప్రజలు ఆ విషయం రుజువు చేశారు. అటువంటి తీర్పునే ప్రజలు మరోసారి ఇవ్వబోతున్నారు. ఉప ఎన్నికల ప్రాధాన్యత వారికి తెల్సు. తెలంగాణ వాదం ఓడిపోతే రాబోయే పరిణామాలు వారికి తెల్సు. రాజకీయ అనివార్యతలోంచి అన్ని పార్టీలు తెలంగాణ పాటను పాడుతున్న టిఆర్ఎస్ ఓడిపోతే తెలంగాణ ఉద్యమాన్ని తొక్కెస్తారని ప్రజలు నమ్ముతున్నారు. అందుకే అభ్యర్థుల మీద అసంతృప్తులను పక్కనబెట్టి తెలంగాణవాదాన్ని గెలిపించాలని ఆరాటపడుతున్నారు. నిజానికి రాజకీయ పార్టీల నాయకుల ప్రసంగాల్ని చూస్తే ఎవరు గెల్చినా ఇది తెలంగాణ రాష్ట్రానికి రిఫరెండంలాగానే పరిగణించాలి. చంద్రబాబు తాము తెలంగాణకు వ్యతిరేకం కాదంటున్నాడు. టిడిపి అభ్యర్థులు 'జైతెలంగాణ జైజై తెలుగుదేశం' నినాదాలు కరపత్రాల మీద బ్యానర్లమీద ముద్రించారు. వైఎస్ తెలంగాణ సెంటిమెంట్ లేదని మేమనడంలేదు మా వల్లనే తెలంగాణ సాధ్యం అంటున్నాడు. బిజెపి తెలంగాణ నినాదంతోనే బరిలోకి దిగింది. అంటె ఎన్నికల్లో ఎవ్వరు గెల్చినా తెలంగాణకు రిఫరెండంగానే భావించాల్సి వస్తుంది.

అయితే తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను రాజకీయ వ్యక్తీకరణను ఇస్తున్నది టిఆర్ఎస్ అనే ప్రజలు విశ్వసిస్తున్నారు. కనుకనే చంద్రబాబు, వైఎస్‌లను ప్రజలు నిలదీస్తున్నారు. వారి సభల్లో 'జై తెలంగాణ' నినాదాలు మారుమోగుతున్నాయి. 1972లో, 2001లో, 2004లో, 2006లో తమ ఆకాంక్షల్ని బలంగా వ్యక్తపరిచిన తెలంగాణ ప్రజలు చరిత్రను పునరావృతం చేయబోతున్నారు. ఢిల్లీ గద్దెలపై కూచున్న నేతల కండ్లు తెరిపిస్తారు. ఢిల్లీ పెద్దలకు రాజకీయ విజ్ఞత ఉంటె ప్రజల ఆకాంక్షలను గౌరవించి తెలంగాణ ఏర్పాటును ప్రకటిస్తారు. లేదంటే ప్రజల ఆగ్రహాన్ని భవిష్యత్ ఎన్నికలలోనూ ఎదుర్కోవాల్సి ఉంటుంది. ◆

19 మంది చనిపోయారు. రాజస్థాన్‌లోని దౌసాలో ప్రారంభమైన వారి నిరసన క్రమంగా ఉత్తరాదిన ఇతర ప్రాంతాలకూ పాకింది. దేశ రాజధాని ఢిల్లీ వీథులన్నీ గుజ్జర్ల ఆందోళనతో స్తంభించిపోయాయి. ఈ ఉద్యమం హింసాత్మకంగా మారి ఢిల్లీకి చేరితే కాని కేంద్ర ప్రభుత్వానికి, సుప్రీం కోర్టుకు జరుగుతున్నదేమిటో అర్థం కాలేదు. బస్సుల దగ్ధం, ప్రైవేట్ ఆస్తుల ధ్వంసం, రహదార్లపై రాకపోకలు గంటల తరబడి ఆగిపోవడంతో నాలుగైదు రోజులపాటు ప్రేక్షక పాత్ర వహించిన కేంద్రం రంగంలోకి దిగింది. సుప్రీంకోర్టు కూడా కలగచేసుకుని గుజ్జర్ల హింసాకాండను ఎందుకు అడ్డుకోలేదని రాజస్థాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, హర్యానా పోలీసు అధికారులను ప్రశ్నించింది. టెలివిజన్ ఛానెల్స్‌లో హింసాకాండ స్పష్టంగా కనిపిస్తుంటే పోలీసులు ఏమి చేస్తున్నారని నిలదీసింది. జరిగిన సంఘటల్ని దేశానికే సిగ్గుచేటుగా అభివర్ణించింది. గత ఏడాది పోటెత్తిన గుర్జర్ల ఆందోళన సందర్భంగా జరిగిన పోలీసుల కాల్పుల్లో దాదాపు 27 మంది మరణించారు. పరిస్థితి చేయిదాటి పోతుండటంతో స్పందించిన రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజే గుజ్జర్ ఆరక్షన్ సంఘర్ష సమితి నేత, ఆర్మీ మాజీ కల్నల్ కిరోరి సింగ్ భైంస్లా వారికి ఎస్.టి. హోదా కల్పించే విషయమై అధ్యయనం చేయడానికి త్రిసభ్య కమిటీ వేశారు. దీనిపై మూడు నెలలలోగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గుజ్జర్లు తమ ఆందోళన విరమించుకున్నారు. ఇదంతా గడిచిన ఏడాది సంగతి.

అధ్యయనంలో లోపించిన పురోగతి

సంవత్సరం గడిచింది. అయినా కమిటీ అధ్యయనం ముందుకు సాగలేదు. గుజ్జర్లను ప్రభుత్వం మరిచిపోయింది. దీంతో తమ హక్కుల సాధన కోసం వారు మళ్ళీ ఉద్యుక్తులు కావాల్సి వచ్చింది. అలా తిరిగి ఈ ఏడాది మే 24న గుజ్జర్ ఆరక్షన్ సంఘర్షణ సమితి ఆందోళనకు పిలుపునివ్వడంతో భరత్‌పూర్ జిల్లాలో ఆందోళనను అణిచివేయడానికి పోలీసులు జరిపిన కాల్పుల్లో 35 మంది గుజ్జర్లు చనిపోయారు. ఆందోళన జరుగుతున్న ప్రాంతాలకు అన్నపానీయాల సరఫరా నిలిపివేశారు. ఉద్యమంపై ఉక్కుపాదం మోపుతామని, సైన్యంతో అణిచివేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి శివరాజ్ పాటిల్ హెచ్చరించారు. రాజస్థాన్‌తో పాటు గుజ్జర్లు ఉన్న మిగతా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఓ సమావేశం ఏర్పాటు చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజే ప్రధానికి విజ్ఞప్తి చేశారు. వారికి ఆరు శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆమె సిఫార్సు చేశారు. దీనిపై కేంద్రం ఏ నిర్ణయం తీసుకోనుందో వేచి చూడాల్సిందే.

యుద్ధవీరులు గుజ్జర్లు

1857లో జరిగిన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో గుజ్జర్లు అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించి వలస పాలకుల వెన్నులో వణుకు పుట్టించారు. దీంతో బ్రిటిష్ పాలకులు గుజ్జర్ వారియర్ తెగను 'గుర్తించిన నేరస్థ తెగ'లలో ఒకటిగా చేర్చారు. 1871లో రూపొందించిన ఈ 'నోటిఫైడ్ క్రిమినల్ ట్రైబల్ ఆక్ట్' ప్రకారం గుజ్జర్ల సామాజిక హోదాను పాత రీతిలోనే ఖరారు చేశారు. స్వాతంత్ర్యానంతరం ఈ చట్టం పరిధిలోని తెగల్ని డీనోటిఫై చేసి ఎస్.టి. జాబితాలో చేర్చినప్పుడు గుజ్జర్ల విషయంలో మాత్రం అప్పటి హోంమంత్రి వల్లభాయి పటేల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గుజ్జర్లను ఎస్.టి. జాబితాలో చేర్చితే వారికి యుద్ధవీరుల హోదా పోతుందనేది ఆయన అభ్యంతరం. 1993లో వీరిని ఒ.బి.సి. జాబితాలో చేర్చారు. 1950 నుంచి 1993 వరకు వారు తమను ఎస్.టి. జాబితాలో చేర్చాలని పదే పదే డిమాండ్ చేస్తూనే ఉన్నారు. 1971లో మరికొన్ని (ఆంధ్రలో ఎరుకల తెగకు అప్పుడే ఎస్.టి. హోదా కల్పించారు) తెగల్ని డీనోటిఫై చేసి ఎస్.టి.ల్లో చేర్చుతున్నప్పుడు 1981 జనాభా గణన సమయంలో, 1984లో శివచరణ్ మాథుర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సైతం వీరిని ఒ.బి.సి.లుగానే గుర్తించాలని అక్కడి ఎస్.టి. జనాభాలో మెజార్టీగా ఉన్న మీనాలు ఒత్తిడి చేశారు. తమను ఎస్.టి.ల్లో చేర్చాలన్న గుజ్జర్ల డిమాండ్‌ను పట్టించుకోకుండా, వారు భయపడుతున్నట్లుగానే 1993లో వారిని ఒ.బి.సి. జాబితాలో చేర్చారు. 2003లో అశోక్ గెహ్లాట్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజ్జర్లు తమ డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తే అలా చేర్చే అధికారం రాష్ట్రానికి లేదని, కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళ్లమని ఆయన తన బాధ్యతనుంచి తప్పించుకున్నారు. ఈ నేపథ్యంలో గుజ్జర్లను ఎస్.టి. జాబితాలో చేర్చుతామని 2003 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వసుంధర రాజే హామీ ఇచ్చారు. గుజ్జర్ల రాకుమారి, రాజపుట్ కోడలు అని వరుస కూడా కలుపుకొని ఆమె విజయ సోపానాలను అధిరోహించారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత మీనాల ఒత్తిడిలో గుజ్జర్లకు ఎస్.టి. హోదా ఇచ్చే హామీని నేరవేర్చే బాధ్యతను దాటవేస్తూ వచ్చారు. గుజ్జర్లను ఎస్.టి. జాబితాలో చేర్చడం పట్ల మీనాలు అడ్డుపడడానికి కారణం వారు తమతో పోటీకొస్తారనే భయంతో కాక, ఇతర చిన్న చితక తెగలను మీనాలకు వ్యతిరేకంగా కూడగట్టి తమ గుత్తాధిపత్యాన్ని దెబ్బతీస్తారనే భయం.

అన్నింటా మీనాలదే పై చేయి

2001 జనాభా గణన ప్రకారం రాజస్థాన్‌లో ఉన్న 212 గిరిజన తెగల్లో ఒక్క మీనా తెగ జనాభానే మొత్తం ఎస్.టి.ల్లో 53.5 శాతం మేరకు ఉంది. ఎస్.టి. కోటాలో సింహ భాగం వీరిదే. 250 మంది ఐ.ఎ.ఎస్., 270 మంది ఐ.పి.ఎస్. మీనాలు సర్వీసులో ఉన్నారు. మన రాష్ట్రంలోనే నలుగురు పనిచేస్తున్నారు. ఈ హోదా కలిగిన అధికారులు గుజ్జర్లలో ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. రాష్ట్ర జనాభాలో పదకొండు శాతం ఉన్న మీనాలు ఎస్.టి. కోటాకు లభించే 24 రిజర్వ్‌డ్ సీట్లకే పరిమితం కాకుండా ఏడు జనరల్ స్థానాల నుంచి కూడా గెలిచారు. గుజ్జర్లకి మొత్తం ఎనిమిది మంది శాసనసభ్యులు మాత్రమే ఉన్నారు. ఈ స్వల్ప సమాచారాన్ని బట్టి చూసినా గుజ్జర్లు ఎంత వెనుకబడిపోయారో, వారికి ఎంత అన్యాయం జరిగిందో స్పష్టమవుతోంది.

అందుకే మీనాలతో సరి సమానంగా తమకూ రిజర్వేషన్లూ, ఇతర అవకాశాలూ కల్పించాలని గుజ్జర్లు కోరుతున్నారు. గుజ్జర్లను ఎస్.టి. జాబితాలో చేర్చడాన్ని మీనాలు వ్యతిరేకిస్తున్నారు. ఇలా వ్యవహరించడం రాజ్యాంగ విరుద్ధమే. ఈ రెండు కులాల మధ్య విద్వేషాగ్ని కొంతకాలంగా రగులుతున్నప్పటికీ రెండు కులాల పెద్దలతో

ఐ.టి. రంగం మన దేశంలో వృద్ధి చెందిన క్రమం గురించీ, దానితోపాటు దిగుమతయిన సంస్కృతి, విలువల గురించి చెబుతున్నారు **అరవింద**

ఐ.టి. పరిశ్రమ పరిణామం

భారతదేశంలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో, ఐ.టి. రంగం ఎలా వృద్ధి చెంది మారుతూ వచ్చిందనేది స్వీయానుభవం నుండి చేసిన పరిశీలన ఇది.

భారతదేశంలో కంప్యూటర్ రంగం మొదటగా ఎలక్ట్రానిక్స్, రక్షణ, అంతరిక్ష రంగాల్లో కంప్యూటర్లు వాడటంతో మొదలై, తరువాత స్వంత పరిశోధన, ఉత్పత్తి గల రంగంగా వృద్ధి చెందింది. ఈ పరిశ్రమ పరిణామక్రమం అర్థం చేసుకునే ముందు, కంప్యూటర్లంటే ఏమిటో క్లుప్తంగా చూద్దాం.

కంప్యూటర్‌లో ఉన్న వివిధ భాగాలని కలిపి హార్డ్‌వేర్ అంటారు. ఈ హార్డ్‌వేర్‌లో ముఖ్యభాగాలు ఇవి :

1) **సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్ (సి.పి.యు.) –** ఇది కంప్యూటర్‌కి మెదడు లాంటిది. కంప్యూటర్‌లో జరిగే గణిత, తార్కిక ప్రక్రియలన్నిటినీ సి.పి.యు. నియంత్రిస్తుంది. సి.పి.యు.కి. కొన్ని ఉదాహరణలు – ఇంటెల్ కంపెనీ వారి పెంటియమ్, సెలెరాన్ ప్రాసెసర్లు. అలాగే మోటరోలా, ఐ.బి.ఎం. లాంటి కంపెనీల ప్రాసెసర్లు.
2) **మెమరీ –** ఇది కంప్యూటర్‌కి జ్ఞాపకశక్తి లాంటిది. సి.పి.యు. వాడే సమాచారం, ఆ సమాచారం మీద జరపాల్సిన ప్రక్రియలు, ఆ ప్రక్రియల వాడకం మూలంగా వచ్చిన ఫలితాలు అన్ని నిక్షిప్తం చేసి ఉంటాయి. కంప్యూటర్లలో రకరకాల మెమరీలు ఉంటాయి. దీర్ఘకాలికమైన సమాచారం హార్డ్‌డిస్క్‌లో ఉంటుంది, తాత్కాలికమైన సమాచారం రామ్ (ఆర్.ఎ.ఎం.)లో ఉంటుంది.
3) **ఇన్‌పుట్ – అవుట్‌పుట్ యూనిట్ –** వీటి ద్వారా కంప్యూటర్‌కి దానిని వాడే వారికి మధ్య సమాచారం ప్రవహిస్తుంది. వీటికి ఉదాహరణలు – కీబోర్డ్, మౌస్, మానిటర్, స్పీకర్, మైక్ లాంటివి.

కంప్యూటర్‌లో జరిగే ప్రక్రియలన్నిటికి చోదకశక్తి సాఫ్ట్‌వేర్. ఒక పనిని చెయ్యాలంటే పాటించాల్సిన పద్ధతులని, ఆచరించాల్సిన క్రమాన్ని సాఫ్ట్‌వేర్ నిర్దేశిస్తుంది. సాఫ్ట్‌వేర్‌ని రకరకాల కంప్యూటర్ భాషల్లో రాయవచ్చు. సాఫ్ట్‌వేర్‌లో రెండు ముఖ్యమైన రకాలున్నాయి. సిస్టం సాఫ్ట్‌వేర్ అనేది కంప్యూటర్‌లోని హార్డ్‌వేర్ భాగాలని నియంత్రించేది. అది బయటికి కనిపించకుండా కంప్యూటర్‌లో అంతర్భాగంగా ఉంటుంది. సిస్టమ్ సాఫ్ట్‌వేర్‌కి ముఖ్యమైన ఉదాహరణలు – మైక్రోసాఫ్ట్ కంపెనీ వారి విండోస్, లీనక్స్ ఆపరేటింగ్ సిస్టమ్‌లు. కంప్యూటర్ వాడకం దార్లకి కనిపించే సాఫ్ట్‌వేర్‌ని అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ అంటారు. ఇది ప్రత్యేకమైన అవసరాలని తీర్చేదిగా ఉంటుంది. అప్లికేషన్ సాఫ్ట్‌వేర్‌కి కొన్ని ఉదాహరణలు – ఇమెయిల్, వెబ్ బ్రౌసర్, డిటిపి, అకౌంటింగ్, డాక్యుమెంట్ తయారీ ప్యాకేజీలు.

1950 లలో కంప్యూటర్లని తయారు చేసే ఆలోచనతో, ప్రక్రియతో భారతదేశంలో కంప్యూటర్ రంగం మొదలైంది. 1960ల నుంచి 90ల మొదటి భాగం వరకు సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చాలా వరకు ఎలక్ట్రానిక్స్, రక్షణ రంగం కంపెనీల్లో జరిగింది. ఈ కంపెనీలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందినవి. ఇది సాఫ్ట్‌వేర్ రంగంలో మొదటి దశ. 1990లలో భారతదేశం సరళీకృత విధానాల్ని అనుసరించడంతో కంప్యూటర్ రంగానికి చెందిన బహుళజాతి కంపెనీలు పెద్ద ఎత్తున మన ఆర్థిక రంగంలోకి ప్రవేశించాయి. అంతేకాక సాఫ్ట్‌వేర్ రంగాన్ని ప్రధానంగా ఎగుమతులు చేసే రంగంగా ప్రకటించారు. దీని వలన సాఫ్ట్‌వేర్ పరిశ్రమ స్వతంత్రమైన పరిశ్రమగా పరిణమించింది. 1992 నుండి 1998 వరకు సాఫ్ట్‌వేర్ రంగం బాగా విస్తరించింది. ఈ క్రమంలో చాలా సాఫ్ట్‌వేర్

చర్చించి విభేదాలను పరిష్కరించే ప్రయత్నం ప్రభుత్వపరంగా జరగలేదు. పోలీసు కాల్పుల తర్వాత గుజ్జర్ల వైఖరి మరింత కఠినతరమైంది. ఉద్యమకారులు, ఆందోళన సందర్భంగా జైపూర్ – ఆగ్రా జాతీయ రహదారిని మూసివేయడంతో యాత్రికులు ఇక్కట్లపాలయ్యారు. కోట్ల రూపాయల వ్యాపార నష్టం జరిగింది. రాజస్థాన్‌లో గుజ్జర్లు, మీనాల మధ్య నెలకొన్న వివాదం ఒకరకంగా మన రాష్ట్రంలో మాల–మాదిగల మధ్య కొనసాగుతున్న ఘర్షణతో పోల్చదగ్గది. మాదిగలకు న్యాయమైన వాటా దక్కకుండా ఎస్.సి. రిజర్వేషన్లపై మాలలు గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లే, రాజస్థాన్‌లో మీనాలు ఎస్.టి. కోటాపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారనే ఆరోపణల నెదుర్కొంటున్నారు. గుజ్జర్లకు ఎస్.టి. హోదా లభిస్తే మీనాలు గుత్తాధిపత్యం కోల్పోతారనేది వాస్తవమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో వ్యవహరించి గుజ్జర్ల విషయంలో శాశ్వత పరిష్కారం ఆలోచించనట్లయితే ఇటీవలి పరిణామాలు పునరావృతమవుతుంటాయి. 'అణిచివేత'నే ఆయుధంగా ప్రభుత్వాలు భావిస్తే మాత్రం పరిస్థితి ఇంకా విషమిస్తుంది. సాయుధ దళాల కంటే ఇటువంటి సందర్భాలలో రాజకీయ చొరవ సత్ఫలితాలను ఇస్తుంది. లేనట్లయితే వారిలో గూడుకట్టుకున్న ఆందోళన, అసంతృప్తి వీధుల్లో ఇలాగే బద్దలవుతుంది. ◆

కంపెనీలు, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కులు వెలిసాయి. ఇది సాఫ్ట్‌వేర్ రంగంలో రెండో దశ. 1999 నుండి సాఫ్ట్‌వేర్ రంగం మరింత వేగంగా అభివృద్ధి చెంది ఎగుమతులు, విదేశీ మారక ద్రవ్య ఆదాయ నిల్వలు బాగా పెరగడానికి దోహదపడింది. ఇది మూడో దశ. వై2కె సమస్యని పరిష్కరించడానికి వెలిసిన సాఫ్ట్‌వేర్ సేవా సంస్థలు, గత నాలుగైదేళ్ళుగా అనేక రకాలైన సేవలనందించడానికి బాగా విస్తరించాయి. ఇది నాలుగో దశ. ఆర్థిక రంగం మీద ప్రభావం, సాంకేతికాభివృద్ధి, పని స్థలంలోని సంస్కృతి, ఉద్యోగుల నిపుణత – ఈ నాలుగు కోణాల్లోంచి పరిశీలిస్తే ఈ నాలుగు దశలు విశిష్టమైన లక్షణాలు కలిగి ఉంటాయి.

మొదటి రెండు దశల్లోని కంపెనీలు ఎక్కువగా పూర్తి ఉత్పాదితాల మీద కేంద్రీకరిస్తే, తర్వాతి రెండు దశల్లోని కంపెనీలు ఎక్కువగా సేవలందించడం మీద కేంద్రీకరించాయి. ఉత్పాదితాలు చాలావరకు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రెండూ కలిగి ఉంటాయి. ఒక ప్రత్యేక అవసరాన్ని తీర్చడానికి ఉత్పత్తి అవుతాయి. ఒక కంపెనీ చేసిన ఉత్పాదితాలు ఆ కంపెనీకి చెంది ఉంటాయి. సాఫ్ట్‌వేర్‌లో సేవలు చాలా మట్టుకు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలకి పరిష్కారాలు చూపించడంగా ఉంటాయి, అంతే కాక వేరే కంపెనీ ఉత్పత్తి చేస్తున్న ఉత్పాదితాలలో కొంతభాగాన్ని తయారు చేయడంగా ఉంటాయి. ఇలా సేవారంగంలో తయారైన ఉత్పాదితాలు కాని, వాటి భాగాలుకాని, వాటిని తయారు చేస్తున్న కంపెనీకి చెందవు.

ఇ.సి.ఐ.ఎల్., సి.ఎం.సి., కొన్ని రక్షణరంగ కంపెనీలు (డి.ఆర్.డి.ఒ. వంటివి), ఎన్.ఆర్.ఎస్.ఎ., ఐ.ఎస్.ఆర్.ఒ. వంటివి మొదటి దశకి చెందిన ప్రభుత్వ రంగ సంస్థలు. ఎచ్.సి.ఎల్., విప్రో, టాటా గ్రూపుకి చెందిన కొన్ని కంపెనీలు (టి.సి.ఎస్. ఇందులో ప్రధానమైనది), పి.ఎస్.ఐ. మొదలైనవి ప్రైవేట్ రంగానికి చెందిన మొదటి దశ కంపెనీలు. ఈ కంపెనీల్లో అధికభాగం హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రెండూ చేసేవి. అంటే మొత్తం ఉత్పాదితాలని తయారుచేసేవి. ఉద్యోగులు ఎక్కువగా ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు కాని, గణితంలోనో లేక భౌతిక శాస్త్రంలోనో పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు కాని ఉండేవారు. అప్పుడప్పుడు కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్లు ఉండేవారు. వీళ్ళలో చాలామంది నగరాలకి చెందిన, ఇంగ్లిష్ బాగా వచ్చిన మధ్యతరగతి వాళ్ళు. పబ్లిక్‌రంగ సంస్థల్లోని సంస్కృతి ఎక్కువగా గవర్నమెంట్ ఆఫీసుల సంస్కృతి లాగా ఉండేది. అంటే పెత్తందారీతనం, వర్గశ్రేణులుగా విభజింపబడి ఉండడం, ఉద్యోగులు ఆఫీసుకి సంబంధించిన నిర్ణయాల్లో పాలుపంచుకోకపోవడం వంటివి. విప్రో, టి.సి.ఎస్. లాంటి ప్రైవేట్ రంగ సంస్థల్లో కూడా పని పరిసరాలు పబ్లిక్ రంగ సంస్థలలో లాగే ఉండేవి. తన మాతృసంస్థ అయిన ఐ.బి.ఎం. పద్ధతులనే కొనసాగించినందుకు సి.ఎం.సి. ఒక్కటి ఈ సంస్కృతికి మినహాయింపుగా ఉండేది. ఈ సంస్థలన్నీ వేరే ఉత్పాదితాలు తయారు చేసేవి. సాఫ్ట్‌వేర్ వాటిలో ఒక భాగంగా ఉండేది. ఎగుమతుల నుంచి వచ్చే ఆదాయం మీద ఈ కంపెనీల ప్రభావం పెద్దగా లేదు. అయితే, పూర్తి ఉత్పాదితాలు చెయ్యడం వలన వీటికి చాలా బలమైన పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) విభాగాలు ఉండేవి. ఈ విభాగాలలో ప్రధానమైన ఇంజనీరింగ్ కాలేజీల నుంచి మంచి విద్యార్థులు వచ్చి చేరేవారు. వీళ్ళు పరిశోధనకి మరింత దోహదపడేవారు. ఇతర ఇంజనీరింగ్ శాఖల ఉద్యోగులకిచ్చే జీతాలే ఈ దశలోని కంపెనీల్లోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకి కూడా ఇచ్చేవారు. డబ్బు అనేది పనికి ముఖ్యమైన ప్రేరకంగా, ప్రోత్సాహకరంగా అప్పటికింకా పరిణమించలేదు. పనివేళలు ఇతర ప్రభుత్వాఫీసుల లాగే ఉండేవి.

విప్రో, టి.సి.ఎస్., ఎచ్.సి.ఎల్. లాంటి కంపెనీలు సాఫ్ట్‌వేర్, సేవా రంగాల్లోకి విస్తరించడంతోనూ, ఇన్ఫోసిస్, సత్యం లాంటి ప్రధానమైన సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఆవిర్భవించడంతోనూ, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, మోటరోలా లాంటి బహుళజాతి కంపెనీలు దేశంలోకి ప్రవేశించడంతోనూ రెండో దశ ప్రారంభమైంది. ఈ దశలో, బహుళజాతి కంపెనీలు కొత్త పని సంస్కృతిని ప్రవేశపెట్టాయి. అలాగే, విదేశాల్లో పనిచేసి, అక్కడి పనిపద్ధతులని నేర్చుకున్న ఉన్నతాధికారులు ఇతర కంపెనీల్లో కూడా కొత్త సంస్కృతిని ప్రవేశపెట్టే ప్రయత్నాలు మొదలు పెట్టారు. వై2కె అనే కంప్యూటర్ల సమస్యని పరిష్కరించడానికి చాలా మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కావాల్సి వచ్చింది. అదే సమయంలో, సరళీకృత విధానాన్ని అనుసరించడం మూలాన మార్కెట్ బాగా విస్తరించింది. దీనితో భారతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ రంగంలో సేవలందించడానికి ముందుకు వచ్చాయి. ఈ కారణాలన్నిటి మూలంగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు చాలా పెరిగాయి. ఈ దశలో హార్డ్‌వేర్ మీదా, ఉత్పాదితాల మీదా, సాఫ్ట్‌వేర్‌దే పైచేయి అయ్యింది. ఈ దశలో, ఐ.టి. రంగంలో ముఖ్యమైన కంపెనీలుగా నిలదొక్కుకున్న కంపెనీలన్ని సాఫ్ట్‌వేర్ మీదే తమ దృష్టిని కేంద్రీకరించాయి. తమ సొంత కంప్యూటర్లని తయారు చేసే విప్రో, ఎచ్.సి.ఎల్. లాంటి కంపెనీలు, కంప్యూటర్ల తయారిని చాలావరకు తగ్గించేసాయి. అంతేకాక తమ పరిశోధన–అభివృద్ధి విభాగాలకిచ్చే మొత్తాలని కూడా తగ్గించేసాయి. ఇన్ఫోసిస్, సత్యం లాగే ఈ రెండు కంపెనీలు కూడా సాఫ్ట్‌వేర్ సేవలు, తయారీల ద్వారా ఆదాయన్ని పెంచుకోవడం మీద దృష్టిని నిలిపాయి. భారతదేశానికి వచ్చే ఎగుమతుల ఆదాయానికి ఈ కంపెనీల ఎగుమతి ఆదాయం పెద్ద మొత్తంలో చేరింది. ఈ దశలోని కంపెనీలు సాంకేతికాభివృద్ధి, ఉత్పాదితాల తయారీ మీద కన్నా ఆదాయం మీదే తమ దృష్టిని కేంద్రీకరించాయి.

బయటి ప్రభావాల మూలంగా, ఉన్నతాధికారుల విదేశీ పని పద్ధతులని అనుసరించడం మూలంగా ఈ కంపెనీల్లో ఒక కొత్త సంస్కృతి మొదలైంది. ఇదివరకటి మీద మరింత ప్రజాస్వామికంగా, తక్కువ వర్గీకరణలతో ఉన్న సంస్కృతి ఇది. ఉద్యోగులు కేవలం ఎలక్ట్రికల్, కంప్యూటర్ ఇంజనీర్లు మాత్రమే కాదు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల కొరత ఏర్పడడంతో, ఉద్యోగావకాశాలు బాగా పెరగడంతో, జీతాలు ఇతర రంగాల కన్నా బాగా పెరిగాయి. విదేశీ మార్కెట్ల కోసం సేవారంగం విస్తరించడంతో పని పెరిగింది. దీనితో పనివేళలు కూడా బాగా పెరిగాయి. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల కోసం డిమాండ్ బాగా పెరగడంతో దేశం మొత్తం మీద ఎన్నో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు తెరిచారు. ఈ కాలేజీల్లో చదివి బైటకొచ్చిన వారిలో చాలామందికి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ గురించి సరైన అవగాహన కూడా లేకపోయింది. ఒకరకంగా చెప్పాలంటే ఉద్యోగుల సాంకేతిక నైపుణ్యం పలచపడిపోయింది. విదేశీ కస్టమర్ల నుంచి వస్తున్న పని కూడా సాంకేతికంగా అంత గొప్పది కాకపోవడం మూలాన కూడా ఉద్యోగుల నైపుణ్యం పలచపడిపోయింది.

దాసరి నాగభూషణ రావు



సి.పి.ఐ. సీనియర్ నాయకుడు దాసరి నాగభూషణ రావు (81) ఏప్రిల్ 27న మరణించారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు. ఆయన కృష్ణా జిల్లా నూజివీడు తాలూకా దిగవల్లి గ్రామంలో జన్మించారు. నాగభూషణ రావు విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు రాజకీయాలవైపు ఆకర్షితులై అంతర్జాతీయ స్థాయిలోను కీలక బాధ్యతలు నిర్వహించారు. అఖిల భారత విద్యార్థి సంఘం జాతీయ కార్యదర్శిగా ఉంటూనే 'ది స్టూడెంట్' పత్రికకు ప్రధాన సంపాదకత్వం వహించారు. పాతతరం కమ్యూనిస్టు నేతల్లో ఒకరైన ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా రెండు సార్లు, కేంద్ర కార్యవర్గ సభ్యునిగాను పార్టీలో ప్రముఖపాత్రను పోషించారు. సి.పి.ఐ. రాజ్యసభ సభ్యునిగా కూడా ఎన్నికయ్యారు. విజయవాడను కమ్యూనిస్టుల రాజకీయ కేంద్రంగా మలచడంలో ఆయన ఎనలేని కృషి చేశారు. కృష్ణా, శ్రీకాకుళం జిల్లాల్లో భూపోరాటాలు నిర్వహించారు. ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా జనాన్ని సమీకరించి భూపోరాటాలు నిర్వహించి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి కృషి చేశారు. 1977 దివిసీమ ఉప్పెన సమయంలో వందల సంఖ్యలో వాలంటీర్లను సమీకరించి తుపాను షెల్టర్లు, గంజి కేంద్రాలు, ఆహార సరఫరా వంటి అనేక సేవా కార్యక్రమాలు ప్రభుత్వానికి సమానస్థాయిలో నిర్వహించారు. చంద్ర రాజేశ్వర్‌రావు ఫౌండేషన్ వ్యవస్థాపకులుగా, విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షునిగా వాటి అభివృద్ధికి కృషి చేశారు. సోవియట్ యూనియన్, మంగోలియా, చైనా, ఫిన్‌లాండ్ వంటి దేశాల్లో పార్టీ అవసరాల రీత్యా పర్యటించారు. ◆

డాట్‌కామ్ విపరీతంగా పెరిగిన నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు బాగా విస్తరించడంతోనూ, పెద్ద బహుళజాతి కంపెనీలు తమ ఉత్పాదితాల ఖర్చు తగ్గించడానికి భారతదేశంలో సాఫ్ట్‌వేర్ విభాగాలని నెలకొల్పడంతోనూ మూడో దశ ప్రారంభమైంది. ఈ దశలో పాత, కొత్త కంపెనీలన్నిటిలో సంస్కృతి బాగా మారింది. ఉద్యోగులు ఆఫీసుకి సంబంధించిన విషయాల్లో పాల్గొనడం పెరిగింది. కంపెనీలు (కనీసం చూడడానికి) ఉద్యోగులందరి పట్ల లౌకికంగా వ్యవహరించడం పెరిగింది. ఈ కొత్త సంస్కృతి కులం, మతం, లింగం, ప్రాంత ప్రాతిపదిక మీద, బాహాటంగా విచక్షణ చూపడాన్ని అనుమతించదు. అలాగే, ఉద్యోగులు తమ ఉన్నతాధికారులని ప్రశ్నించే, అంచనా వేసే స్వేచ్ఛ ఇచ్చింది. ఈ కొత్త సంస్కృతిని ఎంతవరకు కంపెనీలు, ఉద్యోగులు అంతర్గతం (ఇంటర్నలైజ్) చేసుకున్నారనేది ఆలోచించాల్సిన విషయం. కనీసం బాహాటంగా కనిపించే సంస్కృతి వరకు, సాఫ్ట్‌వేర్ రంగం ఇంతకు ముందు భారతదేశంలో ఉన్న పని సంస్కృతి కన్నా, చాలా భిన్నంగా మారింది. ముఖ్యమైన సాఫ్ట్‌వేర్ కంపెనీలు అమెరికాలోని క్లయింట్ కంపెనీలకి సేవలనందించే క్రమంలో, క్లయింట్లతో మాట్లాడడానికి ఎక్కువ గంటలు పని చెయ్యడమే కాక, తాము నాణ్యమైన, లోపాలు లేని సాఫ్ట్‌వేర్‌ని అందించగలమనే నమ్మకాన్ని వినియోగదారులకి కలిగించడానికి తమ పని పద్ధతులని మార్చుకోవలసి వచ్చింది. సాఫ్ట్‌వేర్‌ని వృద్ధి చేసే క్రమం, అనూహ్యమైన పరిణామాలని ఎదుర్కొనే పద్ధతి, మానవ వనరులని సరిగా వాడే ప్రణాళికలు – ఇవన్నీ చాలా ముఖ్యమైనవిగా మారాయి. ఒక ప్రాజెక్ట్‌లో మానవ వనరులను అవసరమయిన దానికన్నా ఎక్కువ మందిని పెట్టడం ద్వారా, ఎవరైనా ప్రాజెక్ట్ నుంచి, కంపెనీ నుంచి వెళ్లిపోయినా, ఆ మనిషి స్థానంలో ఇంకొకరిని పెట్టడంతో నష్టం రాకుండా చూడడం జరుగుతోంది. ఈ దశలో చాలామంది సాఫ్ట్‌వేర్ రంగంలోకి ప్రవేశించారు.

మొదటిసారిగా సాఫ్ట్‌వేర్ రంగంలోకి చిన్న పట్టణాల నుంచి వచ్చిన వాళ్లు ప్రవేశించారు. వీళ్లకి ఇంగ్లిష్ కూడా అంత బాగా రాదు. అయితే, వీళ్ళు చెయ్యాల్సిన పనుల గురించి చాలా స్పష్టమైన వివరణలు ఉండడం మూలాన, వాళ్ళకిచ్చిన శిక్షణ మూలాన వాళ్ళు తమకిచ్చిన పనులని సంతృప్తికరంగా చెయ్యగలుగుతున్నారు. ఈ దశలో సాఫ్ట్‌వేర్ పని చేస్తున్న వాళ్లకి తాము చేస్తున్న భాగాల గురించి మాత్రమే అవగాహన ఉంటుంది. కాని, మొత్తంగా తాము చేస్తున్నదేమిటో తెలీదు. ఈ దశలో ఆర్థిక రంగం మీద సాఫ్ట్‌వేర్ పరిశ్రమ ప్రభావం చాలా ఎక్కువగానే ఉంది. ఇది పట్టణాల నుంచి, పల్లెల నుంచి వచ్చి చదువుకున్న యువతకి చాలా ఉద్యోగావకాశాలని కల్పించింది. డబ్బనేది అధిక సంఖ్యాకులకి ముఖ్యమైన ప్రేరకంగా తయారైంది. మారిన సంస్కృతిని చాలా కంపెనీల్లో అతి మామూలు విషయంగా తీసుకునే దశ వచ్చింది. బైట సమాజంలో సంస్కృతికి, పనిస్థలంలోని సంస్కృతికి ఎన్ని విభేదాలున్నా వాటిని మామూలుగానే తీసుకునే పరిస్థితి ఉంది. పెద్ద పెద్ద కంపనీలన్నీ మానవ వనరులే తమకున్న పెద్ద ఆస్తి అని తమ మానవ వనరుల విధానాలు ఎంతో గట్టివని చెప్తున్నాయి. బహుళజాతి కంపెనీల విభాగాలు తప్ప, ఈ దశలోని మిగతా సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ అమెరికా, యూరప్ మార్కెట్‌లకి సేవలందించడం మీదే కేంద్రీకరించాయి. ఈ సేవలనేవి సాఫ్ట్‌వేర్ నిర్వహణ నుంచి, ఉత్పాదితాల నిర్వహణకి, సాఫ్ట్‌వేర్ రాయడానికి మారాయి.

సాఫ్ట్‌వేర్ రంగంలోని ఉద్యోగులు ఇప్పుడు ఐ.ఐ.టిల్లోని ప్రథమశ్రేణి ఇంజనీర్ల నుండి చిన్న చిన్న కాలేజీల్లో చదువుకున్న ఎం.సి.ఎ.ల వరకు ఉన్నారు. అత్యధిక సాఫ్ట్‌వేర్ రంగ ఉద్యోగులు కేవలం సాఫ్ట్‌వేర్‌ని రాసేవాళ్ళుగా ఉన్నారు. వాళ్లకి తాము పని చేస్తున్న భాగాలే కాని పూర్తి ప్రాజెక్ట్ గురించి తెలియదు. అంతేకాక వాళ్లకి కొత్తవి నేర్చుకోవడంలోనూ, సాంకేతిక నిపుణతని పెంచుకోవడంలోనూ పెద్దగా ఆసక్తి లేదు. ఉత్పాదితాల పై స్థాయి నక్షా (లేక ఆకృతి)ని సీనియర్ ఇంజనీర్లు చేస్తారు. వీళ్ళు చాలా వరకు పేరున్న విద్యా సంస్థల నుంచి వచ్చిన వారైనా, లేదా చాలా సంవత్సరాల అనుభవం ఉన్నవారైనా అయి ఉంటారు. వీరికి మాత్రమే ఉత్పాదితాల గురించి పూర్తిగా తెలిసి ఉంటుంది. మామూలుగా ఇలాంటి సీనియర్ ఇంజనీర్లు ఎంత పెద్ద కంపెనీలోనైనా చాలా తక్కువమంది ఉంటారు. మొదటి దశలోని

భూమితోపాటు ఉత్పత్తి కారకాలన్నీ అగ్రవర్ణాల చేతుల్లో ఉండటం కిందనున్నవారిని అణిచివేయడానికి ప్రధాన కారణం అంటున్నారు **డా. బండి సాంబయ్య, డా. వంగరి భూమయ్య**

ఒ.బి.సి. రిజర్వేషన్‌ల చట్టబద్ధత

సామాజికంగా భారతదేశం వైరుధ్యభరితమైనది. మనుస్మృతి ద్వారా బీజాలు పడిన కుల వ్యవస్థ దినదినాభివృద్ధి చెందుతూ నేడు తీవ్ర స్థాయికి చేరుకుంది. అగ్రవర్ణాలవారు అనాదిగా దళిత బహుజన వర్గాలను అన్ని రంగాల్లోనూ అణచివేస్తూ వస్తున్నారన్నది చారిత్రక వాస్తవం. నిమ్న కులాలలో అవగాహనారాహిత్యం, అవిద్య, అనైక్యతల వల్ల ఈ దోపిడీ అంతం కావడంలేదు. భూమితోపాటు ఉత్పత్తి కారకాలన్నీ అగ్రవర్ణాల చేతుల్లో వుండడం అణచివేతకు మరో ప్రధాన కారణంగా భావించవచ్చు. అయితే భారత గణతంత్ర వ్యవస్థకు రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ మందుచూపుతో దళిత బహుజన వర్గాల వారికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించి వారి పురోభివృద్ధికి పునాది వేశాడు. కానీ రిజర్వేషన్ల అమలులో రాజకీయ పార్టీలు తమతమ ఆశక్తులకనుగుణంగా ప్రవర్తిస్తున్నాయి. రిజర్వేషన్ విషయాన్ని ప్రస్తావించే సమయంలో సాధారణంగా, సహజంగా రెండు విభిన్న వాదాలు తెరపైకొస్తాయి. ఒకటి రిజర్వేషన్‌ను సమర్థించే వర్గం కాగా రెండోది వ్యతిరేకించే వర్గం. వేల సంవత్సరాలుగా తాము కోల్పోతున్న హక్కులను సాధించుకోవడమే ఆధునిక కాలంలో రిజర్వేషన్ పద్ధతి అనే విషయాన్ని రెండో వర్గం గ్రహించలేకపోతోంది. రిజర్వేషన్‌ను అనుభవించే క్రమంలో బి.సి.లు అనేక పర్యాయాలు అన్యాయానికి గురయ్యారు, అవుతూనే ఉన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలతో పాటు అన్ని ప్రైవేట్ విద్యా సంస్థల్లో సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసే అధికారం రాష్ట్రాలకు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం 2006 మే నెలలో 93వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని రూపొందించింది. ఈ విషయంలో శాసన, న్యాయశాఖల మధ్య కొంత వివాదం తలెత్తింది. అనేక సంపన్న వర్గాల వారు కూడా రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించారు. ప్రైవేట్, అన్‌ఎయిడెడ్

ఉద్యోగులు పూర్తి ఉత్పాదితాలకి సంబంధించిన నిర్మాణాత్మక వివరాలు తెలిసిన ఇంజనీర్లు కాగా మూడో దశలోని అధికశాతం ఉద్యోగులు ఉత్పాదితాల గురించి తెలియని కేవలం ప్రోగ్రాంలు రాసే వారిగా మిగిలిపోయారు. ఈ దశలో సాఫ్ట్‌వేర్ రంగంలో జీతాలు ఇతర ఇంజనీరింగ్ శాఖల వారికిచ్చే జీతాలతో పోలిస్తే మిన్నంటిపోయాయి. దీని వలన రెండు రకాల ప్రభావం ఉంది. సాఫ్ట్‌వేర్ వాళ్ళకిచ్చే జీతాల గురించి మిగతా ప్రజానీకంలో అసూయ వ్యక్తమౌతోంది. సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేసేవాళ్ళు బైట ఉన్న వాస్తవ పరిస్థితుల నుంచి దూరంగా వెళ్లిపోతున్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలను పెట్టిన చోట్లు, లోపల అమర్చిన హంగులు, కంపెనీల్లోని భాష, సంస్కృతి – ఇవన్నిటి మూలంగా సాఫ్ట్‌వేర్ వాళ్ళు బయటి వాస్తవ పరిస్థితులని మర్చిపోయే ప్రమాదముంది. దాదాపు పన్నెండు గంటలు పనిస్థలాల్లో గడపడం మూలాన, వెలుతురనేదే చూడకపోవడం మూలాన వాళ్లకి బయట ఏమౌతోందో కూడా తెలియని పరిస్థితి ఉంది. వినియోగదారులతో వాళ్లు మాట్లాడేది, విదేశాలకి వెళ్లినప్పుడు వాళ్లు చూసేది ఒక కొత్త అనుభవం, ఒక కొత్త వాస్తవం కింద తయారవుతోంది. దీనితో వాళ్లకి, బయటి ప్రపంచానికి మధ్య ఒక విచ్ఛేదనం ఏర్పడుతోంది.

బి.పి.ఒ., కె.పి.ఒ. లాంటి ఐ.టి. సంబంధిత సేవారంగ విస్తరణతో నాలుగో దశ ప్రారంభమైంది. ఈ రంగంలో ఉద్యోగాలకి కావల్సింది ప్రధానంగా వ్యక్తీకరణ నైపుణ్యమే కాని సాంకేతిక నైపుణ్యం కాదు. దీనితో ఇంగ్లిష్ భాష బాగా వచ్చిన మధ్యతరగతి నగరవాసులకు ఉద్యోగవకాశాలు బాగా పెరిగాయి. ఈ రంగం పూర్తిగా సేవల మీదే కేంద్రీకృతమైంది. వినియోగదారులకు సేవలనందించే పనులని అనేక బహుళజాతి కంపెనీలు ఈ నాలుగోదశ కంపెనీలకి అప్పచెప్తున్నాయి. ఈ బి.పి.ఒ., కె.పి.ఒ. కంపెనీల ఆదాయం ప్రతి సంవత్సరానికి పెరుగుతోంది. వీటి ఆదాయం పెరుగుదల రేటు కొన్నిసార్లు సాఫ్ట్‌వేర్ కంపెనీల కన్నా ఎక్కువగా ఉంటోంది. ఈ సేవారంగ విస్తరణ ప్రభావం నగరవాసుల జీవితం మీద ఎక్కువ ప్రభావమే చూపుతోంది. దీని మూలంగా కొత్త రవాణా పద్ధతులు, కొత్త ప్రసార సాధనాలు వాడకంలోకి వచ్చాయి. ఐ.టి. సంబంధిత సేవా రంగంలోని సంస్కృతి ఇతర సాఫ్ట్‌వేర్ కంపెనీలకన్న విభిన్నంగా ఉంటోంది. ఇందులోని ఉద్యోగులు వేరే దేశాల్లోని వినియోగదారులకి అనుకూలంగా ఉండేట్టు షిఫ్టుల్లో పని చేస్తారు. పాశ్చాత్యులు తేలిగ్గా పిలవగలిగే పేర్లు పెట్టుకుని, వాళ్లకి అర్థమయ్యే యాసలో మాట్లాడతారు. ఇంతకు ముందు ఆడవాళ్లు అసాధారణ (ముఖ్యంగా రాత్రి) సమయాల్లో పనిచేస్తే అసహనంగా చూసే సమాజం, ఇప్పుడు ఈ రంగంలో ఆడవాళ్లు తప్పనిసరి పరిస్థితుల్లో అసాధారణ సమయాల్లో పనిచేస్తుంటే ఒప్పుకునే స్థితికి వచ్చింది. (కనీసం చాలామంది నగరవాసులు దీన్ని ఒప్పుకోక తప్పటం లేదు). ◆

విద్యాసంస్థల్లో రిజర్వేషన్ కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు తీర్పు ఇవ్వడంతో అగ్రవర్ణాలకు కొంత ఊరట కలిగింది. అయితే రిజర్వేషన్ లకు వ్యతిరేకంగా 93వ రాజ్యాంగ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను పరిశీలిస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.జి. బాలకృష్ణన్ న్యాయమూర్తులు అరిజిత్ పసాయత్, సి.కె. ఠక్కర్, ఆర్వీ రవీంద్రన్, దల్వీర్ భండారీలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ ధర్మాసనం ఏప్రిల్ 10న ఒబిసి కోటాకు అనుకూలంగా తీర్పునిచ్చింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఐ.ఐ.టి.లు, ఐ.ఐ.ఎం.లు ఐ.ఐ.ఎం.ఎస్. వంటి ఉన్నత విద్యా సంస్థల్లో ఇతర ఏ వెనుకబడిన తరగతుల వారికి (ఒబిసి)27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఐక్య ప్రగతిశీల కూటమి (యూపిఏ) ప్రభుత్వం చేసిన చట్టం రాజ్యాంగ బద్ధమేనని తీర్పు చెప్పడంతో ఒబిసి రిజర్వేషన్ పై గత కొంత కాలంగా కొనసాగుతూ వస్తున్న వివాదానికి తెరపడింది.

కేంద్రీయ విద్యాసంస్థల్లో కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఒబిసి రిజర్వేషన్లకు సంబంధించిన నేపథ్యాన్ని పరిశీలించినట్లైతే ప్రభుత్వ విద్య, ఉద్యోగ విషయాల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు ఉన్నంత స్పష్టమైన విధానాలు ఒబిసి రిజర్వేషన్ విషయంలో లేవనే చెప్పాలి. 1920 దశకంలో మైసూర్ సంస్థానంలో మొదటి సారిగా సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణేతర కులాల వారిని బిసి లుగా గుర్తించి వారికి ఆ సంస్థానంలో ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. అలాగే స్వాతంత్ర్యానికి ముందే వివిధ స్వదేశీ సంస్థానాలు బిసి లకు ఉద్యోగాల్లో కొంత మేరకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాయి. స్వాతంత్ర్యానంతరం వెనుకబడిన తరగతుల అవసరాలు, కార్యకలాపాల సంక్షేమాన్ని పరిశీలించడానికి కేంద్ర హోంశాఖలో ఒక బిసి సెల్ ఏర్పాటు చేయబడింది. 1985లో కేంద్రంలో ప్రత్యేకించి సంక్షేమ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, మైనార్టీలతో పాటు వెనుకబడిన తరగతుల సంక్షేమాన్ని కూడా ఈ శాఖకే బదలాయించారు. 1998లో ఈ మంత్రిత్వ శాఖ పేరును సాంఘిక న్యాయం, సాధికారత శాఖ (సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్) గా మార్చారు. అప్పటి నుండి ఇది వెనుకబడిన తరగతుల సాంఘిక, ఆర్థిక సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలను, విధానాలను రూపొందించి అమలుచేస్తోంది. అంతేగాక ఒబిసిల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థిక, అభివృద్ధి సంస్థ (నేషనల్ బాక్‌వర్డ్ క్లాసెస్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్), జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (నేషనల్ కమిషన్ ఫర్ బాక్‌వర్డ్ క్లాసెస్) కు సంబంధించిన విధివిధానాలను కూడా ఈ శాఖే రూపొందిస్తోంది.


బి.సి. కమిషన్

1950 లో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ విద్య, ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ కులాలు, తెగలకు మాత్రమే రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. కానీ బి.సి.లకు మాత్రం రిజర్వేషన్‌లు కల్పించలేదు. నాడు కేంద్రంలో కొలువు తీరిన జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం బి.సి.లకు రిజర్వేషన్‌లు కల్పించే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పజెప్పింది. కేంద్ర సర్కార్ బి.సి.లకోటాను తాత్కాలికంగా వాయిదా వేసింది. అయితే రాజ్యాంగంలోని 340 ప్రకరణ సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల పరిస్థితులను అధ్యయనం చేసి, వారి స్థితిగతులను మెరుగుపర్చడానికి సూచనలు చేసేందుకు ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారాన్ని రాష్ట్రపతికి కల్పించింది. ఈ మేరకు భారత తొలి రాష్ట్రపతి డా. బాబూ రాజేంద్రప్రసాద్ 1953లో కాకా సాహెబ్ కలేల్కర్ అధ్యక్షతన మొదటి బిసి కమిషన్‌ను వేశారు. ఈ కమిషన్ 1955లో తన నివేదికను సమర్పించినా కేంద్రం బి.సి.లకు సంబంధించి ఎలాంటి చర్య తీసుకోలేదు.

1977లో అధికారంలోకొచ్చిన మొదటి కాంగ్రెసేతర జనతా సంకీర్ణ ప్రభుత్వం బి.సి.ల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని బీహార్ మాజీ ముఖ్యమంత్రి బి.సి. మండల్ అధ్యక్షతన రెండవ జాతీయ బి.సి. కమిషన్‌ను 1978లో ఏర్పాటు చేసింది. అప్పటికే కేంద్ర ప్రభుత్వ విద్య, ఉద్యోగావకాశాల్లో షెడ్యూల్డ్ కులాల వారికి 15 శాతం, తెగల వారికి 7.5 శాతం వెరసి 22.5 శాతం రిజర్వేషన్ సౌకర్యం అమలులో వుంది. ఎస్.సి., ఎస్.టి.లకు ఉన్న విధంగానే జనాభా ప్రాతిపదికన బి.సి.లకు కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో 27 శాతం రిజర్వేషన్ కల్పించాలని పేర్కొంటూ 40 సిఫార్సులతో మండల్ కమిషన్ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. అయితే నాడున్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా జనతా ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడం వల్ల బి.సి. రిజర్వేషన్‌లు అమలు జరుపబడలేదు. అంతేగాక మండల్ కమిషన్ సిఫార్సులు అమలుపర్చాలన్న డిమాండ్ కూడా ప్రజలనుండి పెద్దగా వినిపించకపోవడంతో బిసి రిజర్వేషన్ పెద్ద ప్రాముఖ్యతను సంతరించుకోలేదు. 1989 లో విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ నేతృత్వంలో కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం మండల్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో, కేంద్రీయ విద్యా సంస్థల్లో ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్‌ను అమలుపర్చాలని గట్టిగా నిర్ణయించింది. ఆ మేరకు వి.పి.సింగ్ ఉత్తర్వులు కూడా వెలువరించారు. దీనిపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తమైంది. వేలాదిమంది నిరసనకారులు వీధుల్లోకి వచ్చి విధ్వంసాన్ని సృష్టించారు. దేశవ్యాప్తంగా మండల్ కమిషన్ సిఫార్సులకై వివాదాస్పదమై చర్చ జరిగింది. కేంద్రంలో వున్న సంకీర్ణ ప్రభుత్వ భాగస్వామ్య పక్షాల మధ్య ఉన్న వైరుధ్యాల ఫలితంగా బి.సి. రిజర్వేషన్ ఒక కొలిక్కి రాలేకపోయింది. చివరికి ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరుకుంది.

1993లో సుప్రీంకోర్టు సూచన మేరకు భారత ప్రభుత్వం వెనుకబడిన తరగతుల కమిషన్‌ను చట్టబద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో రిజర్వేషన్ కల్పించడం కోసం ఇతర వెనుకబడిన తరగతుల (అదర్ బాక్‌వర్డ్ క్లాసెస్) కేంద్ర జాబితాలో చేర్చడానికి వచ్చే విజ్ఞప్తులను పరిశీలించి సిఫార్సులు చేయడానికి, ఫిర్యాదులను స్వీకరించడానికి శాశ్వత సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ కమిషన్‌లో ఒక చైర్మెన్‌తో పాటు మరో ముగ్గురు సభ్యులు వుంటారు. దీని పదవీకాలం మూడు సంవత్సరాలు. ప్రస్తుతం రత్నవేల్ పాండ్యన్ అధ్యక్షతన ఈ సంఘం పనిచేస్తుంది. ఈ సంఘం ప్రతి పది సంవత్సరాల కొకసారి వెనుకబడిన తరగతుల జాబితాను రివైజు చేయాలి. జాబితాలో వున్న కులాల వారీ సంక్షేమాన్ని సమీక్షించి వారి అభివృద్ధికై తగిన చర్యలు చేపట్టవలసిందిగా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయడం ఈ కమిషన్ బాధ్యత. కమిషన్ ఏర్పాటైన నాటి నుండి నేటి వరకు దాదాపు ఎనిమిది వందలకు పైగా సలహాలను కేంద్ర ప్రభుత్వానికి అందించింది.

భీమిరెడ్డి నర్సింహారెడ్డి



తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కమ్యూనిస్టుపార్టీ తొలితరం నాయకుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి (86) మే 9న మరణించారు. నల్లగొండ జిల్లా తుంగ తుర్తి మండలం కర్విరాల కొత్తగూడెం గ్రామంలో 1922లో భూస్వామ్య కుటుంబంలో చుక్కమ్మ, రాంరెడ్డి దంపతులకు జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యను సూర్యపేట, నల్లగొండలో కొనసాగించారు. పదవ తరగతిని 1942లో హైదరాబాద్ లో చదివారు. దేవులపల్లి వెంకటేశ్వరరావు ప్రభావంతో భీమిరెడ్డి నర్సింహారెడ్డి 1942లో ఆంధ్ర మహాసభ సభ్యుడయ్యారు. 1944లో ఆంధ్ర మహాసభకు, కమ్యూనిస్టు పార్టీకి ఏకకాలంలో నల్లగొండ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 'మా మూగ పాలేరు రెండు రోజులు తిండిలేక పస్తులుండి పనిచేసిన సంఘటనే నా రాజకీయ జీవితానికి భూమిక' అని బి.ఎన్. పేర్కొనేవారు. వెట్టిచాకిరీ, భూపంపిణీ పోరాటాలకు బి.ఎన్. ఆద్యుడు. యూనియన్ సైన్యాలు వచ్చింది నిజాంను లొంగదీసుకోవడానికి కాదని, కమ్యూనిస్టులపై దాడులు చేయడానికే అని తొలుత గుర్తించి యూనియన్ సైన్యాల నుంచి ప్రజా ఉద్యమాలను రక్షించుకోవాలని, దానికి అవసరమైన అధునాతన సాంకేతిక పోరాట పద్ధతులను అవలంబించాలని పార్టీని కోరారు. తెలంగాణలోని దాదాపు మూడు వేల గ్రామాల్లో గ్రామరాజ్యాలను స్థాపించి, పదిలక్షల ఎకరాల మిగులు భూమిని పంచడంలో బి.ఎన్. కృషి అసమాన్యమైనది. 1952లో సూర్యాపేట నుంచి శాసనసభకు మొదటిసారిగా ఎన్నికయ్యారు. మిర్యాలగూడ లోక్‌సభ స్థానం నుంచి మూడుసార్లు ఎం.పి.గా నెగ్గారు. 1996లో సి.పి.ఐ. (ఎం) తో విభేదించి మరో కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారు. దానిని 1998లో ఎం.సి.పి.ఐ. (యునైటెడ్)లో విలీనం చేశారు. ఆ పార్టీలో చివరిదాకా పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఉన్నారు. రెండు వందల ఎకరాల కామందు లైన భూస్వామ్య కుటుంబంలో పుట్టి, మూడుసార్లు ఎం.పి.గా, రెండు సార్లు ఎం.ఎల్.ఎ.గా ఉండి చివరి దాకా నిజాయితీగా, సాధారణమైన ఇంట్లో జీవించి అదే ఇంట్లో తుదిశ్వాస విడిచారు. ◆

ఓబిసి లకు రిజర్వేషన్లు అవసరమా ?

కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఓబిసిలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం వున్నదా? అనే ప్రశ్న మండల్ కమిషన్ సిఫారసుల ద్వారా దేశవ్యాప్తంగా తలెత్తింది. భారతదేశ ఆర్థిక సామాజిక నిర్మాణంలో బి.సిలది ఒక ప్రత్యేక పాత్ర. సంప్రదాయ కుల వృత్తుల ఆధారంగా జీవనం సాగిస్తూ భారత ఆర్థిక వ్యవస్థకు బిసిలు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఇటీవల భారత దేశంలో అమలు చేయబడిన సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణల నేపథ్యంలో అనాదిగా తాము నమ్ముకున్న కుల వృత్తుల నుండి పరాయీకరణ చెందుతూ నిరుద్యోగులౌతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి పునరావాసం కల్పించడంలో వైఫల్యం చెందాయి. విద్య, వైజ్ఞానిక, రాజకీయ రంగాల్లో చెప్పుకోదగిన అభివృద్ధిని సాధించలేకపోయారు. రాజ్యాధికారానికి ఆమడ దూరంలో నిలబెట్టబడుతున్నారు. భారతదేశ జనాభాలో 52 శాతం ఉన్న బి.సి.లకు చట్ట సభలల్లో పదిశాతం కూడా ప్రాతినిధ్యం లేకపోవడం గమనార్హం. మండల్ కమిషన్ గుర్తించిన 3743 సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాల్లో 3700 కులాలకు చెందిన వారు ఇంత వరకూ చట్ట సభలల్లో అడుగుపెట్టలేదంటే వారి వెనుకబాటుతనం ఏమేరకుందో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో గ్రేడ్-1 బి.సి. ఉద్యోగులు రెండు శాతం కూడా లేరని మండల్ కమిషన్ స్వయాన ప్రకటించిందంటే వారికి రిజర్వేషన్ కల్పించాలా? వద్దా? అనే విషయాన్ని తేల్చుకోవచ్చు.

ఓబిసి రిజర్వేషన్లు సబబే

1992 లో ఇందిరా సహాని కేసులో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబిసిలకు 27 శాతం రిజర్వేషన్లు సబబేనని, అయితే మొత్తం మీద రిజర్వేషన్లు 50 శాతం మించరాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఓబిసిలలో సంపన్న శ్రేణి (క్రీమీలేయర్)ని మినహాయించాలని, పదోన్నతులలో రిజర్వేషన్లు వర్తించవని, బ్యాక్‌లాగ్ ఖాళీలలో ఇవి వర్తిస్తాయని ఈ తీర్పులో పేర్కొంది. విద్య, ఉద్యోగావకాశాల్లో యాభై శాతానికి మించి రిజర్వేషన్లు ఉండరాదనే సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం 1994లో 76వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ చేసిన చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి న్యాయ సమీక్ష నుండి మినహాయించింది. 2001 లో జరిగిన 85 వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఎస్.సి., ఎస్.టి.లకు పదోన్నతుల్లో రిజర్వేషన్‌ను కల్పించారు.

2004లో కేంద్ర ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన ఐక్యప్రగతి శీల కూటమి (యూపిఏ) ప్రభుత్వం ఓబిసిలకు వర్తించే రిజర్వేషన్‌లను అమలుజరిపింది. మానవవనరుల శాఖామాత్యులు అర్జున్‌సింగ్ ప్రమేయంతో ఐఐటిలు, ఐఐఎం వంటి కేంద్రీయ విద్యాసంస్థల్లో ఓబిసిలకు రిజర్వేషన్ కల్పించాలనే ప్రతిపాదన ముందుకొచ్చింది. వీరప్ప మొయిలీ అధ్యక్షతన ఈ రిజర్వేషన్ అమలు విషయంలో ఒక కమిటీ నియమించబడింది. వెరసి కేంద్ర ప్రభుత్వం బి.సి.లకు ఇవ్వతలపెట్టిన 27 శాతం రిజర్వేషన్ రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇటీవల సంచలనాత్మక తీర్పునిచ్చింది. అయితే సంపన్న శ్రేణిని (క్రీమీలేయర్) రిజర్వేషన్ పరిధినుండి మినహాయించాలని పేర్కొన్నది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు బిసిల రిజర్వేషన్ నుండి చర్చను క్రీమీలేయర్ వైపు మరల్చింది. 2004లో క్రీమీలేయర్ ఆదాయ పరిమితిని సంవత్సరానికి ఒక లక్ష రూపాయల నుండి రెండు లక్షల యాభై వేల రూపాయలకు పెంచారు. అయితే రెండు లక్షల యాభై వేల రూపాయల వార్షికాదాయం దాటిన వారందరినీ సంపన్నులుగా పరిగణించడం అన్యాయమనే భావనకు స్పందిస్తూ ఆదాయ పరిమితిని రు. 2.5 లక్షల నుండి రు. 5 లక్షల వరకు పెంచే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. బి.సి.లు సాంఘీక వివక్షను ఎదుర్కొన్నారని ఉన్నతోద్యోగాల్లో వారి సంఖ్య స్వల్పంగా ఉన్నదని అందువల్లనే ఓబిసిలకు కేంద్ర సర్వీసుల్లో రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. ఈ రిజర్వేషన్ల ద్వారా ఓబిసిలకు సామాజిక న్యాయం సాధికారత లభిస్తుందనేది నిర్వివాదం. ◆

సేవారంగంలో పెట్టుబడులు, ఆదాయం పెరిగి ఆ మేరకు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో పెట్టుబడులు, ఆదాయం తగ్గడం ఒక అసమతౌల్యాన్ని సూచిస్తుందని అంటున్నారు **ఆర్.ఎస్. రావు**

ధరల పెరుగుదల వ్యవస్థాగత సంక్షోభం

ఈ మధ్యకాలంలో వార్తాపత్రికలలో అనూహ్యమైన వ్యాస పరంపర వస్తోంది. ఇందులో విచిత్రమైన ధరల పెరుగుదల వార్త ఒకటి ఉంది. ప్రపంచంలోకల్లా అతిపెద్ద వ్యాపారసంస్థ వాల్‌మార్ట్ హోల్‌సేల్ వ్యాపారంలోనూ, రీటైల్ వ్యాపారంలోనూ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒక ఆదర్శప్రాయంగా నిలబడి ఎన్నో ప్రతిరూపాలు తయారవడానికి కారణమైన సంస్థ. మన దేశంలో, మన రాష్ట్రంలో, మన రాజధానిలో కుక్కగొడుగుల్లా పుట్టుకొచ్చిన త్రినేత్ర, రిలయన్స్, స్పెన్సర్, హెరిటేజ్ వారి ఫ్రెష్ అని పిలువబడే రిటైల్ సంస్థలు కూడా వాల్‌మార్ట్‌కి ప్రతిరూపాలే. వాల్‌మార్ట్ కూడా ఇండియాలో ప్రవేశించే మార్గాల గురించి వెతుకుతోంది. అటువంటి మార్కెట్‌సంస్థ మనం అనుకోని రీతిలో రేషనింగ్‌ని ప్రవేశపెట్టిందని ఒక వార్త. సరుకుల కొరత కాలంలో రాజ్యం చేసే ఒక ప్రముఖ కార్యక్రమం కొరత సరుకులని అందరికీ సమానంగా అందించే క్రమంలో రేషనింగ్ ప్రవేశపెడుతుంది. అటువంటి రాజ్యాంగరీత్యా చట్టపరంగా ఆమోదయోగ్యమైన రేషనింగ్‌ని మార్కెట్ సంస్థ ప్రవేశపెట్టడమన్నది ఒక వింత. మార్కెట్ సంస్థలు సరుకుల కొరతను ధరల పెంపు ద్వారా వినియోగదారులు సరుకుని కొనుక్కో లేకుండా చేసే పద్ధతి ఈ రేషనింగ్. వాల్‌మార్ట్ తన రేషనింగ్‌లో తన పోటీదారుల వత్తిడికి తట్టుకోలేక ధరల పెంపుమార్గం ద్వారా కాకుండా సరుకుల రేషనింగ్ ద్వారా ప్రయత్నిస్తోంది. ఇది రాజ్యాంగం కాని రాజ్యాంగం. ఇది పెట్టుబడికి వ్యాపార రూపంలో ఉన్న పెట్టుబడి ప్రవేశపెట్టిన వైపరీత్యం. ఒక వైరుధ్యం. వాల్‌మార్ట్ రేషన్ చేసిన సరుకులు ఆహార ధాన్యాలు, అంటే వ్యవసాయోత్పత్తులు.

గత కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయోత్పత్తుల ధరలే కాకుండా పారిశ్రామిక ఉత్పత్తుల ధరలు, ఉత్పత్తికి అవసరమయ్యే మానవశ్రమేతర ముడి సరుకులు, వనరుల ధరలు కూడా అదుపులేని పద్ధతిలో పెరుగుతూ వచ్చాయి. ఉదాహరణకి ఇంధనంగా ఉపయోగపడే పెట్రోలు ధరలు గణనీయంగా పెరిగాయి, పెరుగుతూ వస్తున్నాయి. దాని ద్వారా మిగిలిన పారిశ్రామిక ఉత్పత్తుల ధరలు కూడా పెరుగుతూనే ఉన్నాయి. భూమి ధరలు సామాన్యులు ఊహించని రీతిలో పట్టణ ప్రాంతాలలో పెరిగి పోయాయి. చివరకు మంచినీరు కూడా చలివేంద్రాలలో ఉచితంగా దొరికే పరిస్థితి నుంచి అది ఒక పెద్ద సరుకుగా మారిపోయింది. పెట్టుబడికి మార్కెట్ సంస్కృతి అవసరం. మార్కెట్ సంస్కృతి అనగా ఒక మనిషి మనుగడకు తన దగ్గర ఉన్న వస్తువు కాని, వనరు కాని అమ్మకపోయినా, అమ్మలేకపోయినా మనుగడ సాగదు అని చెప్పే వ్యాపార సంస్కృతి.

ఈ సంస్కృతిలోనే పెట్టుబడి సజీవంగా నిలుస్తుంది. ఆ వ్యాపారం తనని తాను నియంత్రించే, నియంత్రించగలిగే శక్తి కలదని ఒక భావజాలం. ఎవరి అధీనంలోనూ లేని వ్యాపార సంస్థలు సప్లై – డిమాండ్ లోని అసమతుల్యం ద్వారా సమాజపు అవసరాలను, సమాజపు ఉత్పత్తులను సమతుల్య స్థితికి తీసుకుని వస్తుందని ఒక ఆశ, ఆశాభావం, ఒక భావజాలం. అసమతుల్యం నుండి సమతుల్యం వస్తుందా రాదా అనే ప్రశ్నను మేధావులకు వదిలేస్తే, మనకి కనిపించేది వ్యాపార సంస్కృతిలో అరాచకత్వం అనేది ప్రధానం. ఈ అరాచకత్వాన్ని కట్టడి చేసేది ఒక రకంగా రాజ్యం, రాజ్యాంగం అయితే వ్యాపార సంస్కృతి ద్వారా పుట్టేది ఒక గుత్తపెట్టుబడిదారీ విధానం. అది వ్యాపారంలో గుత్తపెట్టుబడిదారుగా వాల్‌మార్ట్‌ను ఉదాహరించుకోవచ్చును.

ఈ ధరల పెరుగుదలకి ఒక ముద్దుపేరు ద్రవ్యోల్బణం. ప్రస్తుతం వార్త పత్రికలలో వస్తున్న చర్చ ప్రధానంగా ఈ ద్రవ్యోల్బణం, దాని కారణాల మీద కేంద్రీకృతమవుతోంది. కొద్దిపాటి సరుకులను ఎక్కువ డబ్బు వెంటాడుతున్న పరిస్థితులలో ధరలు పెరుగుతాయన్నది దీనికి మూలం. మరో రకంగా చెప్పాలంటే సమాజపు అవసరాలు డబ్బు రూపంలో, సమాజపు ఉత్పత్తులు డబ్బు రూపంలో కంటే ఎక్కువ ఉన్నపుడు దీన్ని డిమాండ్ ద్వారా వచ్చిన ద్రవ్యోల్బణం అంటారు. మరొక రకంగా ఉత్పత్తుల ఖర్చులు పెరగడం వలన డబ్బు రూపంలో ఉత్పత్తి విలువలు పెరగడం వలన కూడా ద్రవ్యోల్బణం రావచ్చును. ఇందులో ఏది ముందు, ఏది వెనుక – విత్తనం చెట్టు వివాదంలా, అపరిష్కారంగా ఉంటుంది మేధావుల మధ్య. ఈ సమాధానం రాని ప్రశ్నను ప్రక్కన పెడితే, మనకు ఈ మధ్య ప్రధానంగా వినిపించేది రెండు కారణాలు. ఈ కారణాలన్నీ వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రంగా ముందుకు వస్తోంది. ముందుగా చెప్పుకోవలసినది ప్రపంచంలో బలవంతుల ద్వారా వచ్చిన విశ్లేషణ ముందు అమెరికన్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ కాండలీజా రైస్ అన్నట్లు భారతదేశం, చైనా వంటి ఎక్కువ జనాభా కల దేశాలు వాటి అభివృద్ధి క్రమంలో కలిగిన డిమాండ్ వలన ధరలు పెరుగుతున్నాయి. నిన్న మొన్నటివరకూ పేద రాజ్యాలుగా పేదరికంతో నిండిపోయి కరువు కాటకాల మధ్య ఉన్న అభివృద్ధికి నోచుకోని ఈ రెండుదేశాలలో జరిగిన అభివృద్ధి ఫలితమే ఈ ధరల పెరుగుదలకి ప్రధాన కారణంగా ఆమె

పేర్కొన్నారు అని దాని సారాంశం. అదే విషయాన్ని ఆ దేశాధ్యక్షుడు బుష్ కూడా చెప్పడం జరిగింది. ఈ చెప్పడంలో భారతదేశంలో పెరుగుతూ వచ్చిన మధ్యతరగతి పెరగడం, కొత్త ఉద్యోగావకాశాలు ఎక్కువ ఆదాయాలు వస్తున్నాయి అన్నది ఒక వాస్తవం. అది చూసే గర్వపడి 'మేరా భారత్ మహాన్' అని భారతీయ జనతా పార్టీ, 'మనం ఒక సూపర్ పవర్‌గా పెరుగుతున్నామ'ని కాంగ్రెస్ పార్టీ ఆ విషయాన్ని చెప్పక చెబుతున్నాయి. ఈ విషయాన్ని హిందూ మత గురువులు, యోగ నిపుణులు అయిన బాబా రామ్‌దేవ్‌గారు కూడా మొన్న హైదరాబాద్ వచ్చినపుడు చెప్పడం జరిగింది. మన దేశంలో మధ్యతరగతి ఈ మధ్య కాలంలో చాలా ఎక్కువగా తిని, లావెక్కుతున్నారని, ఈ విషయంలో తాను బుష్ గారితో ఏకీభవిస్తున్నానని కూడా చెప్పారు. అందులోనూ కొంతనిజం ఉంది. కాని ప్రశ్న వ్యాపార సంస్కృతిలో డిమాండ్ పెరుగుతున్నపుడు ఆ అసమతుల్యాన్ని సరిదిద్దే క్రమం ఉత్పత్తుల పెంపుదలలో ఉంటుంది. గత ఇరవై సంవత్సరాలుగా అభివృద్ధి చెందుతూ ఉన్న భారత్, చైనా ప్రజల డిమాండ్‌ని తీర్చగలిగే విధంగా ఉత్పత్తులు పెరగకపోవటం, ప్రపంచీకరణ కాలంలో ప్రపంచదేశాల మొత్తం ఉత్పత్తులు పెరగకపోవటం రైస్ కానీ బుష్ కానీ రామ్‌దేవ్ కానీ గుర్తించని, గ్రహించని విషయం. వ్యవసాయ ఉత్పత్తులు పెరగక పోవటానికి కారణాలేమిటి? ఆహారధాన్యాల ఉత్పత్తులు పెరగక పోవటానికి కారణాలేమిటి? అనే ప్రశ్నలు వేసుకోకపోతే మనమందరం భోజనం తగ్గించుకోవటం, యోగాశ్రమాలకు వెళ్ళటం లేక అభివృద్ధిని నిరాకరించటం అనేవే సమాధానాలుగా మిగులుతాయి.

ఇంక రెండో ప్రస్తావన కూడా ఈ మధ్య ప్రచారంలో ఉంది. ఈ ప్రస్తావన వ్యవసాయోత్పత్తులు, అందులో ఆహారధాన్యాలు పెరగక పోవటానికి కారణాలు వెతుకుతుంది. ప్రపంచవ్యాప్తంగా పెట్రోలు నిలువలు తగ్గిపోతున్నాయి అనే అనుమానంతో పెట్రోల్‌కు ప్రత్యామ్నాయ ఇంధనాల గురించి కొంత సుదీర్ఘమైన చర్చ జరుగుతోంది. ఆ ప్రత్యామ్నాయ ఇంధనాలలో ఒకటి బయో ఇంధనాలు. వ్యవసాయ ఉత్పత్తులలో ఆహారధాన్యాల ప్రాధాన్యత నుండి బయో ఇంధనాల ప్రధాన్యతకు మారిన క్రమంలో వ్యవసాయ పద్ధతులు, ఆహార ధాన్యేతర అవసరాలు పశ్చిమదేశాలలో పెరగడం వలన ప్రపంచవ్యాప్తంగా ఆహార ధాన్యాల కొరత ఏర్పడిందని ఒక వాదన. ఈ వాదనలో ఉండే బలం గురించి ప్రక్కనపెడితే, ఈ వాదన లేవనెత్తిన విషయం ప్రధానంగా ఉత్పత్తులు ఎందుకు పెరగటం లేదు అని మనం ఆలోచించవలసిన ప్రశ్న. ప్రపంచ వ్యాప్తంగా మానవాళి భోజన కొరత అనే సంక్షోభంలోకి వెళ్ళి పోయిందా అనే అనుమానం వస్తుంది. ఈ విషయం మీద మనం కొద్దిగా ఆలోచిద్దాం.

మన వ్యవసాయరంగాన్ని చూస్తే గత కొద్ది సంవత్సరాలుగా అది ఒక సంక్షోభ పరిస్థితిలో ఉందనీ, దానిలో వృద్ధి లేదనీ, చిన్నకారు రైతులే ప్రధానంగా ఉన్నారనీ, వారి ఉత్పత్తి విధానం తమస్వంత అవసరాలు తీరేందుకేనని, వ్యాపార పంటలు పెరగటం లేదనీ, వ్యాపార పంటలు పండినా రైతుల ఆత్మహత్యలు కూడా జరుగుతున్నాయనీ, పెట్టుబడీ క్షీణించిందనీ, బ్యాంకుల నుండి రైతులకు రుణాలు అందటం లేదనీ వేరువేరు కారణాలు చాలా మంది నిపుణులు చెబుతూ ఉంటారు. ఎవరి భావజాలం ప్రకారం వారు తమ సమాధానాలు కూడా చెబుతారు. కొంతమంది కార్పొరేటు వ్యవసాయం ఒక సమాధానం అనుకుంటే కొంతమంది కొత్తపంటలు, సబ్సిడీలు ప్రభుత్వం చేపట్టాలని చెప్పే సమాధానాలు.

50 సంవత్సరాల వ్యవసాయరంగ చరిత్ర చూస్తే చాలా మార్పులు కనిపిస్తాయి. ఆ మార్పులు చాలా వరకు పెట్టుబడి ప్రవేశాన్ని, వ్యాపార సంస్కృతిని చాలానే పెంచాయి. పాత భూస్వామ్య వ్యవస్థ మారిందా లేదా అనే ప్రశ్న పక్కన పెడితే ఈ మార్పులు కొన్నచోట్ల గణనీయంగా, కొన్ని చోట్ల చాలా స్వల్పంగా కనిపిస్తాయి. పంజాబ్ లాంటి ప్రాంతంలో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. ఒరిస్సాలాంటి ప్రాంతంలోనూ కనిపిస్తాయి. మొదటి రెండు పంచవర్ష ప్రణాళికలలో పెట్టుబడి, ప్రధానంగా ప్రభుత్వ పెట్టుబడి, పరిశ్రమలలోకి రావడం ద్వారా వ్యవసాయరంగంలో అసంపూర్ణ వ్యవస్థాగత మార్పులు రావడంతో వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరగక 64 ప్రాంతంలో ఒక పెద్ద సంక్షోభంలోకి సమాజం వెళ్ళింది. ఆ సంక్షోభానికి ఒక సమాధానంగా ప్రభుత్వపెట్టుబడులు హరిత విప్లవం ద్వారా వ్యవసాయంలోకి వచ్చాయి. హరిత విప్లవం అనేది ఒక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వచ్చింది. కొత్త విత్తనం, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక రసాయనాలు కేంద్రంగా వచ్చాయి. రసాయనిక ఎరువులు ఇంకా ఎక్కువ వేస్తే ఇంకాఎక్కువ పండుతుంది అనే ఆశ కూడా పుట్టింది, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక రసాయనాలు చాలా వరకు పంటపొలాలను నిర్వీర్యం చేస్తాయి. 10,15 ఏళ్ళ ప్రయత్నం తరువాత ఈ సాంకేతిక అభివృద్ధి సాధించిన విజయాల కంటె పర్యావరణ నష్టాలు చాలా చోటు చేసుకున్నాయని మనకు పంజాబ్‌ను చూస్తే తెలుస్తుంది. అంతే కాకుండా ఈ రసాయనాలు మన తినుబండారాలలోకి కూడా చేరి అనారోగ్య కారణమవుతోంది. అని అనుకుని ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతి సహజపంటలను ప్రోత్సహించటం జరుగుతోంది. ఈ మొత్తం ప్రక్రియలో వ్యవసాయరంగంలో దిగుబడులు తగ్గిపోతున్నాయి. హరితవిప్లవం తరువాత వచ్చిన పెనుమార్పులు కొంతకాలం క్రితం వంట చెరుకు, వంటగ్యాస్ ప్రధానంగా లేని కాలంలో, అవసరాల కోసం సరుగుడు, యూకలిప్టస్ వంటి గ్రామచిట్టడవులు పెంచే కార్యక్రమం కొన్నాళ్ళు సాగింది. వంట చెరుకు వేసిన భూములు ఇంక ఏ పంటకు పనికిరావు. అటువంటిదే అంతర్జాతీయంగా చేపలకు ఎక్కువ విలువ ఉంటుందని ఆశాభావంతో పంట చేలను చేపల చెరువులుగా మార్చిన దుస్థితి కృష్ణా, గోదావరి, నెల్లూరు జిల్లాలలో ఉధృతంగా వచ్చింది. ఆ పొలాలు పాడవటమే కాకుండా పక్కపొలాలకు కూడా నష్టంవచ్చింది. ఇలా రాస్తూ పోతూ ఉంటే ఇంకా ఇలాంటివి చాలా కన్పిస్తూ ఉంటాయి. ఎక్కడో అమెరికాలో ఉండే ఫ్రాంక్లిన్‌కి కావలసిన భోజనం గురించి మన ఊరి పెంటయ్య కష్టపడి తన వ్యవసాయపద్ధతులను మార్చుకునేది వ్యాపార సంస్కృతి. దాని ప్రభావం కొంచెం బలంగానే ఉండి మన ఆహార ధాన్యాల ఉత్పత్తుల పెరుగుదలకు సహాయం చెయ్యలేదు.

గోరుచుట్టపై రోకటిపోటులాగా ఒక సంక్షోభంలో ఉన్న వ్యవసాయ భూములను వ్యవసాయేతర కార్యక్రమాలకు మళ్ళించటం ఈ మధ్య మనం చూస్తున్న పెద్దపరిణామం. వ్యవసాయ రంగంలో పని

విప్లవాత్మకంగా పూర్తి చేసాం. ఇంక పరిశ్రమలే అభివృద్ధికి కావలసిన కార్యక్రమాలు అనే బుద్ధదేవ్ భట్టాచార్యగారి నుంచి ప్రపంచపెట్టుబడులు అడ్డూ ఆపూ లేకుండా ప్రవహించటం గురించి ఆలోచించే రాజ్య విధానాల వరకూ 'సెజ్'లు భారతదేశానికి సర్వరోగనివారిణిగా చూపించటం జరుగుతోంది. అది బెంగాల్‌లో నందిగ్రామ్ అవవచ్చును, మన రాష్ట్రంలో కాకినాడ, నెల్లూరు అవవచ్చును. ఈ సెజ్‌ల ప్రభావం వ్యవసాయం మీద గణనీయంగా ఉంటుంది. ఎంత ఉంటుంది, ఇంకా వ్యవసాయరంగం ఎంత సంక్షోభంలోకి వెడుతుంది అనేది కొంతవరకూ కాలం, ప్రజలు నిర్ణయిస్తారు. ఒకానొక కాలంలో హైదరాబాద్ నగరం అంటే అనాబ్‌షాహి అనే ద్రాక్షపండ్లకు పెద్ద గుర్తింపు. అప్పటికి ద్రాక్షపళ్ళ ఉత్పత్తి బెంగుళూరులో కొంత, పూనాలో కొంత ఉండేది కాని హైదరాబాద్ ద్రాక్షపళ్ళకు పెట్టింది పేరు. ఇప్పుడు ఆ ద్రాక్ష తోటలన్నీ రియల్ ఎస్టేట్ రంగం కింద మారిపోయాయి. శంషాబాద్ విమానాశ్రయం వచ్చిన తరువాత ఆ చుట్టు పక్కల వ్యవసాయ ఉత్పత్తులన్నీ శూన్యమైపోయాయి. వ్యవసాయరంగంలో చోటు చేసుకున్న ఈ వ్యాపార సంస్కృతి బాహ్యప్రపంచంలో ఉన్న డిమాండ్‌ని కేంద్రీకృతం చేస్తుంది, కాని అంతర్గతంగా వ్యవసాయరంగంలో ఉన్న డిమాండ్, అంటే అక్కడ ఉన్న పేద ప్రజల భోజనం, నిత్యావసరాల గురించి పట్టించుకోదు. ఇంతవరకూ అసంపూర్ణ సామాజిక పరివర్తనలోనే సమాజం ఆగిపోయింది. ఆ ప్రజలకే దారిద్ర్యరేఖ అనే, దాని కింద మనుషులనీ, పేదప్రజలనీ, తెల్లకార్డు ఉన్నవాళ్లనీ ఇత్యాది పేర్లు పుట్టుకొచ్చాయి. సంక్షోభంలో దెబ్బ తినేదీ వాళ్ళే, ఆ సంక్షోభాన్ని ఎదుర్కునేదీ వాళ్ళే. దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాలెన్ని చేసినా వ్యవస్థాగతంగా వాళ్లను ఉత్పత్తి శక్తులుగా చూడనంత కాలం ఈ సంక్షోభం అలాకొనసాగింది, కొనసాగుతూనే ఉంటుంది.

ఇకపోతే అభివృద్ధి జరిగిందా లేదా, లేక ఆ జరిగిన అభివృద్ధి వ్యవసాయాన్ని ప్రేరేపితం చేసే అభివృద్ధా కాదా, అభివృద్ధిలోపమా లేక ఈ నిర్దిష్ట అభివృద్ధి లోపమా అనే ప్రశ్నలు మన ముందుకు తీవ్రంగా వస్తాయి. గత దశాబ్దంలో మనమందరం వింటున్న మాట మన అభివృద్ధి క్రమంలో సేవారంగం చాలా ప్రధాన పాత్ర నిర్వహిస్తోంది. ఈ మధ్య నేను చదివిన ఒక వ్యాసంలో భారతదేశం 50 ఏళ్ళ వృద్ధి చూసినపుడు మొదట వ్యవసాయరంగం ఇంజనుగా ఉండి ఆర్థికవృద్ధిని సంపాదించింది. తరువాత 80ల కాలం నుండీ సేవారంగమే వృద్ధికి ఇంజనుగా తయారయింది అని చెబుతోంది. ఇది ఆ వ్యాసమే కాకుండా చాలామంది నిజంగా నమ్మేటటువంటిది. మన ఆంధ్రప్రదేశ్‌లో చూసుకుంటే, దాని ఆదాయంలో 60 శాతం వ్యవసాయం, వ్యవసాయ రంగానికి సంబంధించినది అయితే, ఇప్పుడు అది 27 శాతానికి కుంచించుకుపోయింది. సేవా రంగాన్ని చూస్తే మొదట్లో ఈ 25 శాతం ఉండేది, అది 50 శాతానికి పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా కూడా సేవారంగం ప్రాధాన్యత చాలా హెచ్చు, ఇప్పటి భావజాలంలో సేవారంగం ఎంత ఎక్కువ ఉంటే ఆ సమాజం అంత వృద్ధి చెందినది అనే అవగాహన కూడా బలంగా నాటుకుంది. ఒరిస్సాలాంటి రాష్ట్రంలో కూడా వాళ్ళ ప్రగతిని సేవారంగ ప్రగతిగానే చూస్తారు. సేవారంగంలో చాలా ముఖ్యాంశాలు ఉన్నా ఐ.టి. రంగమే సేవారంగం అనే అవగాహన కూడా చాలా ప్రబలంగా ఉంది. అందుచేతే బెంగుళూరా? హైదరాబాదా? అనేది మన మధ్యతరగతిలో చర్చనీయాంశంగా ఉంటుంది. మన చంద్రబాబునాయుడు హైదరాబాద్‌కి ప్రపంచపటంలో ఐ.టి. రంగం ద్వారా గుర్తింపు తెచ్చాడని ఆయనకో పేరు, సేవారంగమంటే ఒక్క కంప్యూటర్లే కాదు, రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా ఉంది. సినిమా రంగం, హోటళ్ళు కూడా అందులోనే ఉంటాయి. సేవలు అనే విద్య, వైద్య, పోలీసుశాఖ ఇవి కూడా సేవారంగంలో భాగమే. సమస్యల్లా ఇందులో పెరుగుతున్నది రియల్ ఎస్టేట్, సినిమాలు, ఐ.టి. సెక్టర్. ఈ రంగం పెరుగుతోంది అన్నపుడు ఈ రంగంలో పెట్టుబడులు పెరుగుతున్నాయని అర్థం. పెట్టుబడులు ఈ రంగంలో ఎంత పెరుగుతున్నాయో, అంతమేరకు పెట్టుబడులు వ్యవసాయరంగంలోను, పారిశ్రామిక రంగంలోనూ తగ్గుతాయి. అంటే వ్యవసాయం, పరిశ్రమలలో వృద్ధిజరగదు. ఇది ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఒక పరిక్రమ. సేవారంగంలో పెట్టుబడులు పెరగడమూ, తద్వారా సేవారంగంలో ఆదాయాలు పెరగడమూ, ఆ ఆదాయానికి సరిపడా వ్యవసాయోత్పత్తులు, పరిశ్రమలో ఉత్పత్తులు పెరగక పోవడమూ ఒక అసమతుల్యాన్ని సూచిస్తుంది. ఒకానొక కాలంలో పారిశ్రామిక వేత్తలకి సమాజంలో ఒక పెద్దపీట ఉండేది. ఇప్పుడు ఆ పీట ఒక సింహాసనమై ఒక బిల్‌గేట్స్, ఒక నారాయణమూర్తికి అంకితమైంది. ఒక రంగం ముందుకు వెళ్ళటం, మిగిలిన రంగాలు వెనుకబడిపోవటం ప్రస్తుత ప్రపంచ సమాజంలో కన్పిస్తున్న అసంబద్ధత. ఈ సంక్షోభం రూపం ఆహారధాన్యాల సంక్షోభంగానూ కన్పిస్తుంది, పరిశ్రమల ఉత్పత్తులలో సంక్షోభంగానూ కనిపిస్తోంది.

ప్రధానంగా ఏ లెక్కలు చూసుకున్నా రమారమి 50 శాతం ప్రజలు, మనదేశంలో అయితే 70 శాతం ప్రజలు–గ్రామీణ ప్రాంతాల లోనూ, వ్యవసాయం మీద ఆధారపడిన వాళ్ళు, రోజుకి రెండుపూటలా తిండిలేని మనుషులు ఉంటారు. ఈ పరిస్థితి వెనుకబడిన లాటిన్ అమెరికా, ఆఫ్రికా ఖండాలలోనూ ఉంటుంది. అభివృద్ధి చెందిన అమెరికాలోనూ ఉంటుంది. పెట్టుబడి సాధించిన ఘన విజయాలలో సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా సగటు మానవుడి నిత్యావసరాలు తీరే పద్ధతి సుదూరంగా ఉంది.

20వ శతాబ్దంలో పెట్టుబడిదారీ సమాజాలకు భౌతికంగా, భావజాలపరంగా సోషలిజం అనేది ఒక నియంత్రణగా ఉండేది. సోషలిజం అనేది మానవ అవసరాల ద్వారా సమాజాన్ని పునర్ నిర్మించే క్రమం అని మనం అర్థం చేసుకుంటే, అది ఒక పెట్టుబడిదారీ సమాజానికి ఒక ప్రత్యామ్నాయంగా నిలబడింది. అక్కడ ద్రవ్యోల్బణం అనే మాట మనం వినం, నిరుద్యోగం అనే మాట వినం. అది భౌతికంగా, భావజాలపరంగా ఒక వెనుకడుగు వేసిన కాలంలో, పెట్టుబడికి అవధులు లేకుండా ప్రపంచం నలుమూలలా పాకే ప్రయత్నాలు గత 20 ఏళ్ళుగా జరుగుతున్నాయి. పెట్టుబడికి కొత్తగా వచ్చిన పరికరం ప్రసార సాధనాలు. దాన్నే అభివృద్ధి అని కూడా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో వ్యవసాయరంగం మనిషికి ప్రాథమికంగా కావలసిన భోజనం కరువయ్యే ప్రమాదం ఎదురు చూస్తోంది. ధరల పెరుగుదల, వ్యవసాయంలో సంక్షోభం శాశ్వతంగా తీరాలంటే ఈ వ్యవస్థాగత మార్పులలో ఆ సంక్షోభాన్ని చూడవలసిన అవసరం ఎంతోఉంది. ◆

ఐక్యరాజ్య సమితి 2007ను 'ఆకలి రహిత సంవత్సరం'గా పాటించాలని పిలుపునిచ్చినా ఆకలిచావుల చేదు అనుభవాలతో సహజీవనం చేస్తున్నామనీ, ఇదంతా విధానాల ఫలితమేనని అంటున్నారు టి. లక్ష్మీనారాయణ

ధరలతో సామాన్యుల బతుకు భారం

నిత్యావసర వస్తువుల ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెరగడంతో సామాన్య ప్రజల జీవితాలు పెద్ద ఎత్తున ఒడిదుడుకులకు గురైనాయి. కాయకష్టం చేసి బతుకు పోరు సాగిస్తున్న కూలీలు, చేతివృత్తుల మీద ఆధారపడిన వారు వివిధ రంగాలలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికుల బాధలైతే వర్ణనాతీతం.

సొంతకాళ్ళపై నిలబడి, పని చేసుకొని బతుకుదామంటే పని దొరకదు. దొరికిన పనికి భద్రతలేదు. శ్రమదోపిడీ పెరుగుతున్నది. సంపాదన తక్కువ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు, వేతనాలు పెరగడం లేదు. సంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు సహితం తల్లడిల్లిపోతున్నారు. ఆరవ వేతన సంఘం సిఫార్సులు బహిర్గతమయ్యాయో లేదో నిత్యావసర వస్తువుల ధరలకు మరింత రెక్కలొచ్చేశాయి. శరవేగంతో పెరగనారంభించాయి. వేతన సంఘం సిఫార్సులు కిందిస్థాయి ఉద్యోగవర్గాలను తీవ్ర అసంతృప్తికి గురిచేశాయి. అసలు వేతన సవరణ ఎప్పుడు జరుగుతుందో ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. కానీ ధరల పెరుగుదల గోరుచుట్టపై రోకటిపోటులా పరిణమించింది.

ఆకలి చావులు పునరావృతం కానున్నాయి

గ్రామీణ ప్రాంతాలలో డెబై శాతం మంది పౌష్టికాహార లోపంతో జీవిస్తున్నారని కొన్ని సర్వేలు తెలియజేస్తున్నాయి. ఈ సమస్యకు ప్రధాన కారణం పేదరికం, నిరుద్యోగం, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తుల వారు, అసంఘటిత కార్మికులు, పేద–మధ్యతరగతి రైతులు, సామాన్య ప్రజలకు కొనుగోలు శక్తి లేకపోవడం వల్లనే ఈ సమస్య జటిలంగా తయారయ్యింది. కాబట్టే ఒక ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆహారధాన్యాలను కొనుక్కొని ఆకలి తీర్చుకోలేని దౌర్భాగ్య స్థితిలో జీవిచ్చువాల్లా బతుకుతున్న నిరుపేదలకు ప్రభుత్వమే ఉచితంగా ఆహారధాన్యాలను అందజేయాలని, పిల్లలకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని సెలవిచ్చింది. ఐక్యరాజ్యసమితి 2007 సంవత్సరాన్ని 'ఆకలి రహిత సంవత్సరంగా' పాటించమని సభ్య సమాజానికి పిలుపునిచ్చింది. అయినా ఆకలిచావుల చేదు అనుభవాలతో మనం సహజీవనం చేస్తూనే ఉన్నాం. కరువు కాటకాలు, వరదలు, తుపానులు, అకాల వర్షాలు లాంటి ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపున, సరళీకృత ఆర్థిక విధానాల అమలుతో మరోవైపు తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయి. గ్రామ సీమల్లో జీవితం దుర్భరంగా మారిపోయింది. నిరుద్యోగుల, అర్ధ నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. పర్యవసానంగా పట్టణాలకు వలసలు పెరిగాయి. వీటి దుష్ఫలితాలు బహుముఖంగా ఉన్నాయి. వాస్తవాలు ఇలా ఉంటే దేశ ప్రధాని మన్మోహన్‌సింగ్, ఆర్థికమంత్రి పి. చిదంబరం వీటిని చూడనిరాకరిస్తున్నట్లు వారి ప్రకటనలను బట్టి అర్థమవుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో ఎనభై రూపాయలు కనీస వేతనంగా చెల్లిస్తున్నామని, ఫలితంగా పేదలందరికి ఉపాధి దొరికిందని, వాళ్ల చేతుల్లోకి డబ్బులు బాగా పోగు కావడంతో కొనుగోలు శక్తి పెరిగిందని, ధరలు పెరగడానికి ఇదొక కారణమని నమ్మబలకడం గర్హనీయం. అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్, ఆ దేశ విదేశాంగ కార్యదర్శి కండోలిజా రైస్ భారతదేశంలో దినదినాభివృద్ధి చెందుతున్న ముప్పై ఐదు కోట్ల మంది మధ్యతరగతి వర్గ ప్రజలు బాగా తిండిపోతులుగా అయ్యారని ఆ కారణంగానే ఆహార ధాన్యాల కొరత ఏర్పడి ధరలు పెరుగుతున్నాయనే దుష్ప్రచారాన్ని చేస్తున్నారు. ఈ వాదనను గర్వంగా స్వీకరిస్తూ, ఇది మన దేశ ఆర్థికాభివృద్ధిని, పెరిగిన ప్రజల కొనుగోలు శక్తిని ప్రపంచదేశాలు గుర్తించాయని కాలరెగరేస్తున్న కొంతమంది మన ఆర్థికవేత్తలూ లేకపోలేదు. సామాన్యులకు అర్థంకాని ద్రవ్యోల్బణం, దాని పర్యవసానాలపై చర్చోపచర్చలు ఆర్థిక రంగ నిపుణులు చేస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు ఇదే కారణమంటున్నారు. ద్రవ్య పరిమాణం బాగా పెరిగినప్పుడల్లా ధరలు పెరిగాయని, కాబట్టి ద్రవ్య సరఫరాపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు పెట్టింది. ధరలను నియంత్రించడానికి మరికొన్ని చర్యలను తీసుకొన్నది. అయినా ద్రవ్యోల్బణం మే 3న ముగిసిన వారాంతానికి 7.8 శాతంకు పెరిగిపోయింది.

37 దేశాలలో ఆహార ధాన్యాల ఉత్పత్తి బాగా పడిపోవడంతో ప్రపంచవ్యాపితంగా ధరలు పెరిగిపోతున్నాయనే వారు, మన దేశంలో కూడా పెరుగుతున్న 1.44 శాతం జనాభాకు అనుగుణంగా ఆహారధాన్యాల ఉత్పత్తి లేక సరఫరా తక్కువై, వినియోగం ఎక్కువైన కారణంగా ధరలు పెరుగుతున్నాయని, ఇలా వివిధ కోణాలతో ధరల పెరుగుదలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమర్థించడానికి పడరాని పాట్లు పడుతున్నారు. అసలు సమస్య తీవ్రతను గుర్తించి, యుద్ధ

ప్రాతిపదికపై ధరల పెరుగుదలకు అడ్డుకట్టవేసి, నియంత్రించి, తగ్గించడానికి పటిష్టమైన చర్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోక పోతే సమీప భవిష్యత్తులో ఆకలి చావుల పరంపర మళ్లీ మొదలయ్యే ప్రమాదం ముంచుకొస్తుంది.

అసలు ధరలెందుకు పెరుగుతున్నాయి?


సరళీకృత ఆర్థిక విధానాల దుష్ఫలితాలలో భాగమే ఈ ధరల పెరుగుదలని నిస్సంకోచంగా చెప్పవచ్చు. ప్రపంచబ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ వాణిజ్య మండలి, అమెరికా తదితర సామ్రాజ్యవాద దేశాల ఒత్తిడికి తలవొగ్గి మన వ్యవసాయరంగంలో వాణిజ్యపరమైన సంస్కరణలను విచ్చలవిడిగా అమలు చేయడం మూలంగా ఈ దుస్థితి నెలకొన్నది. వ్యవసాయ ఉత్పత్తులపై రోజు రోజుకూ ఆర్థికభారం అధికమవుతున్నది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగాయని, పర్యవసానంగా ఆయిల్ కంపెనీలు భారీ నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాయని, పెట్రోల్, డీజిల్ ధరలను దశలవారిగా పెంచుకుంటూ పోతున్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు ఇదొక ప్రధాన కారణం. దాని ప్రభావం వ్యవసాయ ఉత్పత్తులపై పెద్ద ఎత్తున పడుతున్నది. రవాణా చార్జీలు పెరగడం, రసాయన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు వగైరా ధరలు పెరిగి భారం పడుతున్నది. ఆహార ధాన్యాల ఉత్పత్తులపై దేశం స్వయం సమృద్ధి సాధించినా మార్కెట్‌లో వినియోగదారులకు మాత్రం చవక ధరలకు లభించడం లేదు. రైతాంగం ఆరుగాలం కష్టపడి, పనిచేస్తూ ప్రకృతి వైపరీత్యాలకు, పాలకులు అమలు చేస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు బలైపోతూ గిట్టుబాటు ధరలు లభించక, అప్పుల బాధలను తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. మరొకవైపు వినియోగ దారుల నడ్డి విరుగుతోంది. ఆహార ధాన్యాలు పండించే రైతులు సహితం వాటిని ముడిసరుకులుగా తక్కువ ధరలకు అమ్ముకొని, వినియోగ వస్తువులను అత్యధిక ధరలకు కొనుక్కొని అనుభవించలేని దౌర్భాగ్య స్థితిలోకి నెట్టబడ్డారు.

స్వేచ్ఛా మార్కెట్ విధానాల అమలులో భాగంగా రీటైల్ మార్కెట్‌ను విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలు దురాక్రమణ చేశాయి. చిన్న, మధ్యతరహా కిరాణా షాపుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. లక్షలాది మందికి స్వయం ఉపాధి కల్పిస్తున్న ఈ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారు. బహుళజాతి సంస్థలైన కార్గిల్, పిల్స్‌బరీ, ఐ.టి.సి., ఆగ్రోటెక్ ప్రధాన పట్టణాలలో అత్యధిక సంఖ్యలలో నెలకొల్పబడి, చిల్లరవ్యాపార రంగాన్ని దెబ్బతీస్తున్న బిగ్‌బజార్, స్పెన్సర్, రిలయన్స్, మోర్ లాంటి సూపర్ బజార్స్ అటు రైతులను, ఇటు వినియోగదారులను విచ్చలవిడిగా దోపిడీ చేస్తూ అత్యధిక లాభాలు గడిస్తున్నాయి. ఫార్వర్డ్ ట్రేడింగ్ పేరిట ముందస్తు వ్యాపార లావాదేవీలతో రైతుల నుండి కారుచౌకగా ఆహారధాన్యాలను కొనుగోలు చేసి మిలియన్ల టన్నుల కొద్దీ గిడ్డంగులలో అక్రమంగా నిల్వ చేస్తున్నారు. సప్లయ్, డిమాండ్‌కు సంబంధించి కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. వాణిజ్యపరమైన జూదం ఆడుతూ ఇష్టం వచ్చినట్లు ధరలు పెంచి లాభాల మీద లాభాలు గడిస్తున్నారు. వాటిలో పని చేస్తున్న అసంఘటిత కార్మికులు సంఘాలు పెట్టుకోవడానికి వీలులేదు. జీతభత్యాలపై బేరసారాలాడే హక్కులేదు. ఉపాధి భద్రతలేదు. కనీస వేతనాలకు నోచుకోవడం లేదు. నిర్దిష్ట పని గంటలూ అమలు చేయడంలేదు. వాటిలో పనిచేసే వాళ్లు సహితం అర్థాకలితో బతకాల్సిందే.

రైతులకు చెల్లిస్తున్న ధరలకు, టోకు ధరలకు, చిల్లర ధరలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను పరిశీలిస్తే ఈ కార్పొరేట్ సంస్థలు, దళారీ సంస్థలు చేస్తున్న ఆర్థిక దోపిడీ ఎంత తీవ్రంగా ఉన్నదో బోధపడుతుంది. నేచర్ ఫ్రెష్, అన్నపూర్ణ బ్రాండ్స్‌తో గోధుమపిండి, సన్‌ఫ్లవర్ ఆయిల్ మార్కెట్‌ను అమెరికన్ బహుళజాతి సంస్థ కార్గిల్ ఆక్రమించింది. ఒక్క మాటలో చెప్పాలంటే విత్తనాలు మొదలుకొని ఆహారపదార్థాల వరకు క్రయ విక్రయాలపై కార్పొరేట్ సంస్థలే పెత్తనం చెలాయిస్తున్నాయి. ధరలను, మార్కెట్‌ను నియంత్రిస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. వీటిపై ప్రభుత్వాలకు ఏ మాత్రం నియంత్రణ లేదనే చెప్పాలి. పైపెచ్చు ఈ సంస్థలు ఆహార ధాన్యాలు, పదార్థాలు చెడిపోకుండా నిల్వ చేసుకోవడానికి వీలుగా శీతల గిడ్డంగుల నిర్మాణానికి, వ్యవసాయాధారిత పరిశ్రమలను నెలకొల్పుకోవడానికి తక్కువ వడ్డీలతో ఆర్థిక సహాయం, పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తున్నారు. వాటికి కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారు. అలాగే అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, వాణిజ్య సంస్థల ఒత్తిళ్లకు లొంగి ఎగుమతులను పెంచుకొని, విదేశీ కరెన్సీని ఆర్జించే లక్ష్యంతో వాణిజ్య పంటలను పడించాలని రైతులను ప్రోత్సహించడం ద్వారా ఆహార సంక్షోభానికి తెరలేపారు. అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచంపై పెత్తనాన్ని సాధించాలనే దుష్ట తలంపుతో అమలు చేస్తున్న యుద్ధోన్మాద విధానాల వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దాని ప్రభావం నుండి అమెరికా, దాని మిత్రదేశాలు వంట నూనెలను, ఆముదాలు, మొక్కజొన్నలు తదితర ఆహారధాన్యాలను ఇథనాలు, జీవఇంధనం ఉత్పత్తి చేసుకోవడానికి అధికంగా వినియోగిస్తూ, మార్కెట్‌లో కొరతను సృష్టిస్తున్నారు. సరళీకృత ఆర్థిక విధానాల మోజులో మిశ్రమ ఆర్థిక విధానాల మోజులో మిశ్రమ ఆర్థిక వ్యవస్థకు తిలోదకాలిచ్చి, ప్రైవేట్ రంగానికి దాసోహం పలికి ప్రత్యేక ఆర్థిక మండలాలకు విచ్చలవిడిగా లైసెన్సులు మంజూరు చేస్తూ, అత్యంత విలువైన లక్షలాది ఎకరాల పంట భూములను వాటికి ధారాదత్తం చేస్తున్నారు. మరొక వైపు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఫలితంగా సాగు భూముల విస్తీర్ణం గణనీయంగా తగ్గి ఆహారధాన్యాలు, కూరగాయాల ఉత్పత్తి బాగా పడిపోయింది.

దీనికి మన హైదరాబాద్ నగరం, పరిసర ప్రాంతాలే ప్రబల నిదర్శనం. ఇక్కడ మరొక విషయాన్ని కూడా ప్రస్తావించాలి. ప్రభుత్వరంగ సంస్థలు ధ్వంసమయిపోతే వచ్చే దుష్ఫలితాలను నేడు మనం అనుభవిస్తున్నాం. సిమెంట్, పంచదార, మందుల పరిశ్రమలను ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా ప్రైవేటీకరించింది, లేదా మూసివేసింది. ఈ రంగాలపై ప్రైవేట్ యజమానులు గుత్తాధిపత్యం సాధించారు. ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయించుకొంటూ అధిక లాభాలు గడిస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారు. ధరలను తగ్గించమని ప్రభుత్వాధినేతలు యాజమాన్య సంఘాలను ప్రాధేయపడినా ఖాతరు చేయని పరిస్థితి. ప్రభుత్వాల చేతకానితనానికి లోపభూయిష్టమైన విధానాలకు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే సామాన్య ప్రజలు, ప్రత్యేకించి శ్రామిక ప్రజలు కడుపు మంటలతో జీవచ్ఛవాల్లా భారంగా జీవితం గడపాల్సి వస్తోంది.

విజయ్ టెండూల్కర్



ప్రముఖ రచయిత విజయ్ టెండూల్కర్ (80) మే 19న మరణించారు. కండరాలకు సంబంధించిన వ్యాధితో అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించారు. ఆయన 6 జనవరి, 1928 న మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జన్మించారు. ఆయన నాటక రచయితగా, సాహిత్య విమర్శకుడుగా, పొలిటికల్ జర్నలిస్ట్‌గా, సామాజిక వ్యాఖ్యాతగా, మరాఠి సామాజానికి తెలుసు. మరాఠా, భారతీయ నాటకానికి ఆయన అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొచ్చారు. దారి తప్పిన మానవ ప్రవృత్తులను ఎండగట్టడమే ఆయన లక్ష్యం. మనుషులలో అంతర్గతంగా దాగి ఉన్న క్రూరత్వం, వికృత కోరికలు, హిపోక్రసీలే ఆయన రచనలోని పాత్రలు. సంప్రదాయవాదులు గగ్గోలు పెట్టినా, కొన్ని వర్గాలు ఆక్షేపించినా మరాఠి సాహితీ ప్రపంచంలో నాలుగు దశాబ్దాల పాటు ఆయన శిఖర సమానంగా నిలిచారు. తండ్రి పుస్తక ప్రచురణ పనులు నిర్వహిస్తుండడం వల్ల ఇంట్లో సాహిత్య వాతావరణం ఉండేది. ఆరేళ్ల వయసులోనే ఆయన తొలి కథ రాశారు. పదకొండేళ్లకు ఒక నాటిక రాసి, దర్శకత్వం చేసి నటించారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో చదువు మానేశారు. 'శ్రీమంత్' నాటకంతో 1956లో ఆయనకు నాటక రచయితగా గుర్తింపు వచ్చింది. మొత్తంగా ఆయన 28 నాటకాలు, పాతిక పైగా ఏకాంకికలు, పిల్లల కోసం పదహారు నాటికలు, అయిదు కథా సంకలనాలు, రెండు నవలలు, మూడు వ్యాస సంకలనాలు, పదిహేడు సినిమా స్క్రిప్ట్‌లు, ఒక టి.వి. సీరియల్ రాశారు. వీటికి తోడు తొమ్మిది నవలల్ని, రెండు జీవిత చరిత్రల్ని, ఐదు నాటకాల్ని మరాఠిలోకి అనువదించారు. ఆయన సాహిత్య కృషికి సంగీత నాటక్ అకాడమీ అవార్డ్ (1970), 'మంథన్' సినిమాకి ఉత్తమ స్క్రీన్‌ప్లేకి గాను జాతీయ అవార్డ్ (1977), 'ఆక్రోష్' సినిమాకి ఉత్తమ కథా, స్క్రీన్‌ప్లే అవార్డ్‌లను (1981), 'అర్ధసత్య' సినిమాకి ఉత్తమ స్క్రీన్‌ప్లే అవార్డ్ (1983), పద్మభూషణ్ (1984), కాళిదాస్ సన్మాన్ (1999), కథా చుడామణి అవార్డ్ (2001) లాంటి మరెన్నో అవార్డ్‌లను అందుకున్నారు. 2002లో గుజరాత్ ప్రభుత్వ పర్యవేక్షణలో ముస్లింల ఊచకోత జరిగినప్పుడు 'నా దగ్గిర పిస్తోలుంటే నరేంద్రమోడి నీ, అలాంటి రాజకీయనాయకుల్నీ కాల్చిపారేసేవాణ్ని' అని బాహాటంగా ప్రకటించారు. ఇలా తన అభిప్రాయాల్ని నిక్కచ్చిగా చెప్పేవారు. ◆

ఆహార భద్రత ఎక్కడ?

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఆహారధాన్యాలు, వంటనూనెలు, పంచదార, ఉల్లిపాయలు, మిరపకాయలు, కిరోసిన్ తదితర నిత్యావసర వస్తువులను చవుక ధరలకు పేద, మధ్యతరగతి ప్రజానీకానికి అందించాలనే మహాదాశయాన్ని ప్రభుత్వం విడనాడింది. ప్రజాపంపిణీ వ్యవస్థను కుదించివేయడం, నిర్వీర్యం చేయడం, అవినీతికి నిలయంగా మార్చివేయడం, నాసిరకం ఆహారధాన్యాలను సరఫరా చేయడం, నిత్యావసర వస్తువుల సరఫరా సంఖ్యను తగ్గించివేయడం ద్వారా మౌలిక లక్ష్యాన్నే గొడ్డలిపెట్టుకు గురిచేశారు. అలాగే భారత ఆహారసంస్థ (ఎఫ్.సి.ఐ.)ని నిర్వీర్యం చేశారు. తద్వారా ఆహారధాన్యాల సేకరణ – పంపిణీ కార్యకలాపాల్లో ప్రభుత్వ పాత్ర గణనీయంగా కుదించివేయడం జరిగింది. స్వేచ్ఛా మార్కెట్‌లో అందివచ్చిన అవకాశాలను బాగా ఉపయోగించుకొని కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపార వర్గాలు, దళారీ సంస్థలు విపరీతంగా సంపదను కొల్లగొట్టడానికి పూనుకొన్నాయి. ధరల పెరుగుదలతో ఆహారధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువులు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. వాటిని కొని ఆరగించే, అనుభవించే శక్తిలేకుండా పోయింది. ఆహార భద్రతకు మునుపెన్నడూ లేనంత ప్రమాదం ముంచుకొస్తోంది. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. అరకొర చర్యలతో ధరలను తగ్గించలేరని, కనీసం ఇంకా పెరగకుండా కూడా నియంత్రించలేరని తేలిపోయింది. సోయా, పామాయిలు దిగుమతులపై సుంకం రద్దు చేయడంతోను, పప్పు ధాన్యాల ఎగుమతులపై నిషేధం మరో ఏడాది పొడిగించడంతోను, వంటనూనె, గోధుమలు తదితర వస్తువులపై ఆంక్షలు విధించడంతోను, ఉక్కు సిమెంట్ ధరలను తగ్గించమని ఉత్పత్తిదారులకు, డీలర్లకు విన్నపాలు చేసుకోవడంతోను ముందస్తు వ్యాపార లావాదేవీలపై కొన్ని పరిమితమైన చర్యలు తీసుకోవడంతోను సమస్య పరిష్కారం కాదని మరొకసారి రుజువైంది. ఈ చర్యలు భవిష్యత్‌లో పాక్షిక ఫలితాలు ఇవ్వవచ్చుగాక. కానీ సమస్య మూలాల్లోకి వెళ్లి దీర్ఘకాలిక పరిష్కారాన్ని అన్వేషించాలి. లోపభూయిష్టమైన విధానాల అమలును తక్షణం ఉపసంహరించాలి. ధరల నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణను రూపొందించి రాజకీయ సంకల్పంతో అమలు చేయాలి. ఇక మన రాష్ట్రంలో రెండు రూపాయలకే కిలో బియ్యం ఇస్తున్నామని, భవిష్యత్తులో వంటనూనె, కందిపప్పు ధరలు తగ్గించి సరఫరా చేస్తామని, దేశంలోనే అత్యధికంగా దారిద్ర్యరేఖ కింద జీవించే (బి.పి.ఎల్.) నిరుపేదలకు, దారిద్ర్యరేఖ పైన జీవించే (ఎ.పి.ఎల్.) పేదలకు, కటికదారిద్ర్యంలో జీవిస్తున్నవారికి అంత్యోదయ పథకం ద్వారా రేషన్ కార్డులు మంజూరు చేశామని గొప్పలు చెప్పుకుంటే ప్రయోజనం పరిమితమే. ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత విస్తరించాలి, పటిష్ట పరచాలి. అవినీతి అక్రమాలను నిరోధించాలి. పేద, మధ్యతరగతి ప్రజానీకానికి చవుక ధరలకు, నాణ్యమైన నిత్యావసరలన్నింటినీ అందించాలి. అదే సందర్భంలో స్వేచ్ఛా మార్కెట్‌లో ధరల నియంత్రణకు కఠినచర్యలు అమలు చేయడం ద్వారా మాత్రమే పేద, బడుగు, బలహీనవర్గాలకు, శ్రామిక ప్రజానీకానికి ఆహార భద్రత కల్పించడానికి వీలుపడుతుంది. కేవలం ఇరవై రూపాయల రోజువారి తలసరి వినియోగశక్తి కలిగిన డెబ్బై ఎనిమిది శాతం మంది ప్రజలకు ఆహార భద్రత కల్పించడమే దేశం ముందున్న తక్షణ కర్తవ్యం. తమ సంపాదనలో డెబ్బై ఎనభై శాతాన్ని ఆహారం కోసమే వెచ్చిస్తున్న పేదజనానికి ధరల పెరుగుదల ఒక జీవన్మరణ సమస్య. ◆

ఆకలిదప్పులతో అలమటిస్తున్న లక్షలాది ప్రజలను వీధుల్లోకి తీసుకొని వచ్చి నల్లబజారు గోదాములను తెరిపించే పోరాటాలు చేయడంలో అన్ని రాజకీయ పార్టీలూ విఫలమయ్యాయని అంటున్నారు **వి. హనుమంతరావు**

ధరలెందుకు పెరుగుతున్నాయి ?

ఈ సంవత్సరం 2007-08లో పంటలు మస్తుగా పండాయని, తిండిగింజలు దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేదని కేంద్ర వ్యవసాయ మంత్రి చేసిన ప్రకటన ఎర్రటి ఎండలో నడిచి వచ్చి, చల్లటి నీరు తాగిన అనుభూతి కలిగించింది. బజారులో తిండిగింజలు పుష్కలంగా లభ్యమైతే, ధరలనెత్తిన మేకు కొట్టినట్లవుతుందని మనమంతా అనుకుంటాం. కాని బియ్యం, గోధుమల లభ్యత ఆ రెంటికే పరిమితవుతుంది గాని పప్పులు, వంటనూనెల ధరలు, అలాగే పెట్రోలియం ఉత్పత్తుల ఉత్పత్తి పెరుగుదల లేదు. వీటిని దిగుమతి చేసుకొనే స్థితిలో ఉన్నాం. మాల్స్, గ్రేట్ బజార్ల పుణ్యమా అంటూ, కూరగాయలు దెబ్బతీస్తూనే ఉన్నాయి. తిండిగింజలు బాగా పండినంత మాత్రాన ధరలు మన నెత్తిన సవారి చేయకమానవు. అయినా, తిండిగింజల ఉత్పత్తి పెరుగుదల ప్రభుత్వం తీసుకొన్న చర్యల ఫలితమేమీ కాదు; ప్రకృతి కరుణించటం, వర్షాలు బాగాపడటం వల్ల అది సాధ్యమయింది. ఇందులో ప్రభుత్వం మెహర్బాని ఏమీలేదు.

బి.జె.పి. హయాంలో

రైతు తన బిడ్డకు పెళ్లిచేసి ఒక అయ్య చేతిలో పెట్టినట్లు మస్తుగా పంట పండించి ఆరు కోట్ల ముప్ఫై లక్షల టన్నుల ఆహార ధాన్యాలను జులై 2002 నాటికి ప్రభుత్వానికి అందచేసింది. ఆనాడు గాదెలు, గోదాములు నిండాయి. ఆరుబయట టార్పాలిన్లు కప్పి, తిండిగింజలను ఫుడ్ కార్పొరేషన్ నిల్వ చేసింది. మామూలుగా కార్పొరేషన్ చేతుల్లో 2.43 కోట్ల ఆహార ధాన్యాలు కనీస నిల్వలుండాల్సి ఉండగా, నలభై లక్షల టన్నులు అదనపు నిల్వలున్నాయి. ఆనాటి ధరలో కిలో ఆరు రూపాయలనుకొన్నా మొత్తం నిల్వల విలువ రు. 37,800 కోట్లు. అంటే అంత ధనం చలామణిలో లేకుండా ఈ నిల్వల్లో ఇరుక్కొనిపోయింది. అలాంటప్పుడు ప్రభుత్వం చేసి ఉండాల్సిన పని 'పనికి ఆహార పథకం', 'అందరికీ ఉపాధి పథకం', 'గ్రామీణాభివృద్ధి' లాంటి పథకాల కోసం తిండిగింజలను విడుదల చేసి ఉంటే నిల్వలు తగ్గి ఉండేవి. ప్రజలకు తిండిగింజలు, పని లభించి ఉండేవి; గ్రామాల్లో రహదారులు, పాఠశాల భవనాలు, వైద్య కేంద్రాలు లాంటి ప్రభుత్వ ఆస్తులు జమ అయి ఉండేవి. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో బి.జె.పి. ఓడిపోయి ఉండేది కాదు. కాని షావుకార్లు, బడా ధాన్య వ్యాపారస్తుల, బహుళ జాతి సంస్థల అనుకూల పార్టీ అయిన బి.జె.పి.కి అలాంటి మంచి ఆలోచన లెందుకు వస్తాయి? ఏం చేసింది? మూడు కోట్ల టన్నుల తిండిగింజలను, దేశంలో రైతుల కిస్తున్న కనీస ధరకన్న తక్కువ ధరకు విదేశీ ఆహారధాన్యాల గుత్తపెట్టుబడి దారీ సంస్థలకు ఎగుమతి చేసి రు. 14,135 కోట్లు నష్టపోయింది. అలాగె 1.9 కోట్ల టన్నుల గింజలను దేశంలోని వ్యాపారస్తులకు సబ్సిడీ ధరకు అమ్మేసింది. ఇదికాక ఒక కోటి నలభై ఏడు లక్షల టన్నుల తిండిగింజలు 'మాయమైపోయాయి'. వాటి విలువే రు. 8,800 కోట్లు. ఇది బి.జె.పి.చేసిన నిర్వాకం ప్రభుత్వం చేతుల్లో తిండిగింజలు ఆ తర్వాత రాను రాను హరించుకు పోతూ వచ్చాయి. కేవలం గోధుమల నిల్వలకే పరిమితమై చూస్తే 2002లో 2.6 కోట్ల టన్నుల నుంచి 2003లో 1.56 కోట్లు, 2004లో 69 లక్షల టన్నులకు, 2005లో కేవలం 40 లక్షల టన్నులకు నిల్వలు దిగజారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి, కనీసం ఉండాల్సిన నిల్వలకన్నా ఒక లక్ష టన్నులు తక్కువ స్థాయికి పడిపోయింది. అంటే ప్రభుత్వ గోదాముల్లో నిల్వలు నిండుకున్నాయి. వ్యాపార సంస్థల పంట పండింది. అలాంటప్పుడు ధరలు పెరక్క ఏం చేస్తాయి? ఇది బి.జె.పి. 'ప్రజానుకూల' విధానమైతే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ విధాన కథా కార్యక్రమం బెట్టిదనిన...

కాంగ్రెస్ హయాంలో

ఉండాల్సిన కనీస స్థాయి తిండిగింజల నిల్వలకన్నా తక్కువ నిల్వలున్న నేపథ్యంలో అధికార పీఠమెక్కిన కాంగ్రెస్ పార్టీ ఏం చెయ్యాలి? అందులోనూ, కొత్తగా అధికారంలోకి వచ్చింది కాబట్టి, పేదలకు ఏదో కాస్తో కూస్తో సహాయం అందిస్తున్నట్లు కనబడాలి కాబట్టి ఉపాధి కల్పించే పలు గ్రామీణ పథకాల అమలుకు తిండి గింజలను సరఫరా చేయాల్సి ఉంటుంది కాబట్టి, తిండిగింజలు పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. 2005 నాటికే కనీసం కోటి 85 లక్షల టన్నుల గోధుమల అవసరం ఉంటుందని అంచనా వేసింది. అంటే ఆ మేరకు ప్రొక్యూర్‌మెంట్ చేయాలి కదా? కాని చేసింది కోటి 47 లక్షల టన్నులు మాత్రమే. కాంగ్రెస్ పాలన తిండి గింజల కొరతతో ప్రారంభమైందన్న మాట. అలాంటి కొరత ఏర్పడడం ఆహార ధాన్యాల వ్యాపారస్తుల రొట్టె నేతిలో పడింది. తిండిగింజల విషయంలో బి.జె.పి. విధానాల కొనసాగింపే కాంగ్రెస్ విధానం. ప్రొక్యూర్‌మెంట్ తగ్గించడమే కాకుండా కనీస మద్దతు

కనీస మద్దతు ధర, ప్రొక్యూర్‌మెంట్

సంవత్సరం	కనీస మద్దతుధర	మొత్తం పంటలో ప్రొక్యూర్‌మెంట్ శాతం
1999-2000	580	21.4
2000-01	610	29.6
2001-02	620	26.2
2002-03	630	24.0
2003-04	630	23.3
2004-05	640	20.6
2005-06	650	13.3

ధరను పెంచకుండా స్తంభింపచేసింది. మొత్తం పంటలో సేకరణ 21.4 శాతం నుంచి 13.3 శాతానికి తగ్గిపోయింది. 2000-01 నుంచి ప్రొక్యూర్‌మెంట్ ధర లాంఛనంగా పెంపుదలే గాని, ఇన్‌పుట్స్ ధరల పెరుగుదలకు అనుగుణంగా ఎంత మాత్రం లేదు. 2005-06లో కనీస మద్దతు ధర రు. 650లుగా ప్రకటిస్తే ప్రొక్యూర్‌మెంట్ స్పందన లేకపోవటంతో, రు. 50లు అదనంగా బోనస్‌గా ప్రకటించినా, అంతకు ముందు సంవత్సరంలో కన్న సుమారు 38 శాతం తగ్గింది. పైగా కనీస మద్దతు ధర పెంచేనాటికి చిన్న సన్నకారు రైతులు అప్పటికే అమ్మేసుకోవటంతో, బోనస్ వారికి ముట్టనేలేదు. ఇలా మద్దతు ధర స్తంభింప చేయటంలో, అలాగే సేకరణను తగ్గించటంలో ఒక కుట్ర, ఒక దురుద్దేశం దాగి ఉంది.

1991లో సరళీకృత ఆర్థిక విధానంలో ప్రధాన అంశం ఉత్పత్తి రంగాల నుంచి ప్రభుత్వం నిష్క్రమించి, మార్కెట్ శక్తులకు - దీనినే మార్కెటీకరణ అంటారు - వదిలిపెట్టటం. అంటే ప్రైవేటీకరణ. ఈ విధానం ప్రకారం ప్రభుత్వం ఫుడ్ కార్పొరేషన్‌ను రద్దుచేసి, తిండి గింజల వ్యాపారాన్ని ప్రైవేట్ రంగానికి ధారాదత్తం జేయటం. ప్రైవేట్‌గా పెట్టుబడులు పెట్టేవారికి ఏకైక లక్ష్యం లాభాలు, మరిన్ని లాభాలు సంపాదించుకోవటం; ప్రజలకు తిండిగింజలందచేయటం వారి లక్ష్యం కానేకాదు. ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటిస్తున్నా ధరలు పెరుగుతుంటే, ప్రైవేట్ రంగానికి చోటిస్తే, పేదవాడికి అంతే సంగతులు. ఉదాహరణకు బియ్యానికి కనీస మద్దతు ధర వెయ్యి రూపాయలుగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళన జరిపింది. ధర నిర్ణయ అధికారం, ప్రొక్యూర్ చేసి ప్రజల ఆహార హక్కు కాపాడటం, ప్రభుత్వ విధి కాబట్టి, అలా అడిగి సాధించుకునే అవకాశం రైతులకు, ప్రజలకు ఉంది. అదే ప్రైవేటీకరణ చేస్తే, అలా డిమాండ్ చేసే హక్కును రైతాంగం కోల్పోతుంది. షావుకారు 'నీ దిక్కున్న చోట చెప్పుకో' అంటాడు. ప్రభుత్వ ప్రస్తుత విధానం ఆ వ్యాపారికి అనుకూలంగా ఉంది.

ఈ పరిస్థితి మరో పరిణామం దృక్కోణం నుంచి చూడాలి. వరి, గోధుమ పండించవద్దు, వ్యాపార పంటలు పండించాలని ప్రభుత్వం రైతులను పదే పదే కోరుతోంది. మన రాష్ట్రంలో అప్పుడు చంద్రబాబు, ఇప్పుడు వై.ఎస్. ప్రభుత్వాలు రెండూ రైతులను ధాన్యేతర పంటలు పండించాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాయి. కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించటం ఈ ఉద్దేశంతోనే జరుగుతోంది. పళ్ళు, పువ్వులు, కూరగాయలు, ఇతర ఉద్యానవన ఉత్పత్తులను పెంచడం వైపు తమ భూములను మళ్లించాలని, అందుకు ప్రధానంగా ఉపయోగించే తుంపర సేద్యాన్ని చేపడితే పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇస్తామని బడ్జెట్‌లో అధికంగా కేటాయింపులు చేయటం చూస్తే తిండి గింజల పంట తగ్గించాలని పరోక్షంగా ఒత్తిడి తీసుకుని రావటమేకదా. అలాగే, తిండిగింజలను ప్రొక్యూర్ చేయవద్దని ప్రభుత్వం అధికారికంగా ఆదేశించింది. ఎక్కువలో ఎక్కువగా దేశంలో గోధుమ పండించే ఉత్తరప్రదేశ్‌లాంటి రాష్ట్రంలో రెండున్నర కోట్ల టన్నుల గోధుమ పంటకు గాను కేవలం అయిదున్నర లక్షల టన్నులు మాత్రమే 2005-06లో ప్రొక్యూర్ చేస్తే, ఒక పథకం ప్రకారం ఒక లక్ష్యంతో ప్రొక్యూర్‌మెంట్‌ను కావాలనే తగ్గిస్తున్నట్లు స్పష్టం. ప్రభుత్వం వద్ద నిల్వలు తగ్గితే, వ్యాపారుల వద్ద నిల్వలు పెరుగుతాయి. ధరలు ఆ బాటలోనే పయనిస్తాయి. వ్యాపారుల లాభాలు చుక్కలు చూస్తాయి. పాలక పార్టీ ఖజానా నిండుతుంది. మరో ముఖ్యమైన పరిణామం ఏమంటే వ్యవసాయరంగంలో అడుగిడిన కార్పొరేట్ సంస్థలు వ్యాపార పంటలు పండించుకొంటాయి. అగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమలు స్థాపించి రెడీమేడ్ ఉత్పత్తులను ఎగుమతి చేసి సొమ్ము చేసుకొంటాయి. నేరుగా రైతులనుంచే వారి ఉత్పత్తులను కొనుక్కునే అవకాశాన్ని కార్పొరేట్ సంస్థలకు ఇచ్చింది. కాగా ధరలు పెరక్కేమి చేస్తాయి? తాజాగా పైన చెప్పినట్లు, రిటైల్ బజార్లు వెళ్ళి పెద్ద ఎత్తున టన్నుల కొద్దీ కొనుగోలు చేసి వారి గోదాముల్లో నిల్వ చేసుకొంటూంటే, మార్కెట్లోకి వచ్చే ఉత్పత్తులు సంఖ్యాత్మకంగా, గుణాత్మకంగా తగ్గి ధరలు పెరగటానికి కారణమవుతున్నాయి.

ఇలా ప్రొక్యూర్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రభుత్వమే తగ్గించటం గమనించిన ఆహార ధాన్యాల గుత్త అంతర్జాతీయ సంస్థలు గ్రహించి, ఇండియా తప్పకుండా తిండిగింజలు దిగుమతి చేసుకోనున్నదని పసికట్టి, వారి వారి మార్కెట్ ధరలు పెంచటం ప్రారంభించింది. ఆ విధంగా అంతర్జాతీయంగా తిండిగింజల ధరలు పెరగాయంటే దానికి భారత ప్రభుత్వమే కారణం. ఇపుడు ధరలు విపరీతంగా పెరిగిపోవడానికి అంతర్జాతీయంగా ధరలు పెరగడమే కారణం అని అంటున్న ప్రభుత్వం వాస్తవంలో తానే కారణమనే విషయాన్ని మరుగుపర్చే ప్రయత్నం చేస్తోంది. ఆఖరుకు దేశాన్ని తిండిగింజలను దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితికి ప్రస్తుత ప్రభుత్వం దిగజార్చింది. అయిదువేల కోట్లు ఖర్చుపెట్టి 55 లక్షల టన్నుల గోధుమలను దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ప్రపంచంలో ఈజిప్ట్ తర్వాత అంత పెద్ద ఎత్తున దిగుమతి చేసుకొన్న దేశం భారత దేశమే. ఆహారోత్పత్తులను ఎగుమతి చేసే స్థాయినుండి దేశాన్ని ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవాల్సిన దుర్గతికి నెట్టింది కాంగ్రెస్ పాలకులే. ఉన్నత మధ్య తరగతి ఉద్యోగుల జీతభత్యాల గురించి వారి ఆందోళనను బలపరిచే కొన్ని పార్టీలు, సామాన్య ప్రజల ఆకలి దప్పులను తీర్చటంలో ప్రకటనలు, ఖండనలతో సరిపెట్టుకొన్నాయి. లక్షలాది ప్రజలను వీధుల్లోకి తీసుకొని వచ్చి నల్లబజారు గోదాములను తెరిపించే మిలిటెంట్ పోరాటాలకు సన్నద్ధులను చేసే కార్యదక్షత ఆ పార్టీల్లో లోపించిందని చెప్పాలి.

నేడు వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు అన్నీ పెట్రోలియం ఉత్పత్తుల మీద ఆధారపడుతున్నాయి. కాని అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. మన దేశంలో మంచి నీళ్ళకు స్త్రీలు నల్లాల వద్ద క్యూలు కట్టినట్లు అమెరికా, తదితర అభివృద్ధి చెందిన దేశాల్లో పెట్రోలు బంకుల వద్ద కార్లు బారులు తీరుతున్నాయి. వాళ్లకు పెట్రోల్, డీజిల్ దాహం హద్దులు మీరడంతో

ఆహారధాన్యాలను బయో డిజిల్‌గా మార్చటం పెద్ద ఎత్తున జరుగుతుండ డంతో ఆహారధాన్యాల కొరత ఏర్పడి, వాటి ధరలు పెరగడానికి కారణమవుతున్నాయి. వర్ధమాన దేశాలన్నీ ధరల పెరుగుదలతో వారి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి.

ఉత్పత్తి పెరిగితే ధరలు తగ్గుతాయనేది సాధారణ ఆర్థిక సూత్రం. ఉదాహరణకు మన రాష్ట్రమే తీసుకొంటే 2007-08లో 190 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు పండాయని ప్రభుత్వం చెబుతోంది. ఉత్పత్తి అనూహ్యంగా పెరిగింది కదా, ధరలు తగ్గలేదెందుకు? కారణం స్పష్టం. బహుళజాతి సంస్థలను మన దేశంలో తిండిగింజలను నేరుగా రైతుల వద్ద నుంచి కొనుక్కునేందుకు ప్రభుత్వం గేట్లు బార్లా తెరవటంతో, అలాగే కార్పొరేట్ సంస్థలు, దేశీయ బడా ఆహార ధాన్యాల వ్యాపారస్తులు, రిటైల్ మేజర్లు గ్రామాల్లోకి వెళ్ళి తిండిగింజలను కొని నిల్వలు పెంచుకొంటున్నారు. నల్లబజారు వ్యాపారస్తులు సరే సరి. దీనితో ధరలు చుక్కలు చూడడం జరుగుతోంది.

ధరలిలా పెరిగినప్పుడు, సామాన్య ప్రజలకు తిండిగింజలు అందుబాటులో ఉంచడానికి ఫుడ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, ప్రభుత్వమే తిండిగింజలు సేకరించే విధానం చేపట్టింది. ఇది మంచి నిర్ణయమే. కాని 1991లో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టిన తర్వాత, ప్రపంచబ్యాంక్ ఒత్తిడితో, రాను రాను సేకరణ ఎలా తగ్గుతూ వచ్చిందో పైన వివరించటం జరిగింది. కార్పొరేషన్‌నే మూసివేసే చర్యలు చేపట్టింది. చంద్రబాబు ఏ మెకన్సీ కంపెనీనయితే 2020 ప్రణాళికను రచించటానికి నియమించిందో, ఆ మెకన్సీ కంపెనీనే కేంద్ర ప్రభుత్వం నియమించి ఫుడ్ కార్పొరేషన్‌ను 'పునర్వ్యవస్థీకరణ' చేసే పథకాన్ని రచించమంటే ఆ సంస్థ కార్పొరేషన్ తలుపులు మూసేయమనే పలు సూచనలు చేసింది. ఇదొక అమెరికన్ కన్సల్టెన్సీ సంస్థ. కార్పొరేషన్ మూసేసి ధాన్యసేకరణ, రవాణా, పంపకం అన్నీ ప్రైవేటీకరణ చేయమని సూచించింది. ప్రైవేటీకరణ చేస్తే ధరలు మరింత పెరుగుతాయి. బహుళజాతి సంస్థలు సేకరించిన తిండిగింజలను, ఆ ప్రైవేట్ సంస్థల ద్వారా పంపిణీ చేసి లాభాలు దండుకొంటాయి. ఆ సంస్థ సలహా ఇవ్వటం సరే, మన ప్రభుత్వానికి బుద్ధి, జ్ఞానం ఉండొద్దూ? మెకన్సీ సంస్థ సూచనలను ఆచరణలో పెట్టడం ప్రారంభించింది. ఫలితం చవుక దుకాణాల ద్వారా పంపిణీ ఛిన్నాభిన్నం కావటం, 'నిజమైన' పేదలకు మాత్రమే లభించే పద్ధతి ప్రవేశపెట్టడం, వైట్ కార్డుల ప్రహసనం వగైరా వగైరా అన్నీ చోటు చేసుకొన్నాయి. ప్రజలకు తిండి గింజలను అందించే ప్రాథమిక బాధ్యతను పూర్తిగా విస్మరించింది. పెరిగిన ధరలు పెట్టి కొనుక్కోగలిగిన వారికే తిండి. ప్రణాళికా సంఘం ప్రకారం, పేదరికపు రేఖ కింద ఉన్న వారిలో 57 శాతం మందికి చవకదుకాణాల ద్వారా తిండి గింజలు అందటంలేదు.

వివిధ దేశాల్లో ఆహారధాన్యాల వినియోగం
(మిలియన్ టన్నులు)

దేశం	2006-06	2007-08	తేడా శాతం
చైనా	382.2	389.1	1.8
అమెరికా	277.6	310.4	11.81
ఇండియా	193.1	197.3	2.17
ప్రపంచం	2624	2105	2.06

(ఐక్యరాజ్య సమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఒ.)

వ్యవసాయాన్ని భ్రష్టు పట్టించారు

గత దశాబ్దంన్నర కాలంగా వ్యవసాయాన్ని ప్రభుత్వం భ్రష్టు పట్టించింది. వ్యవసాయంలో పెట్టుబడులు క్షీణిస్తున్నాయి. దేశం సంక్షోభాన్నెదుర్కోబోతుందని వ్యవసాయార్థిక శాస్త్రవేత్తలు నెత్తినోరు పెట్టి ఇది చెబుతూ వచ్చినా, ప్రభుత్వం పెడ చెవిన పెట్టింది. ఆహార పంటల కింద భూమి విస్తీర్ణం సుమారుగా 120 మిలియన్ హెక్టార్ల వద్ద స్తంభించిపోయింది. ఉత్పత్తి పెరిగినట్లు కనిపిస్తుంది. కాని, పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుంటే తలసరి లభ్యత తగ్గిపోతూ వచ్చింది. పదిహేను సంవత్సరాల నాటి కన్నా తక్కువ గత దశాబ్దకాలంగా ఉత్పాదకత హెక్టారుకు 1500 - 1700 కిలోల మధ్యనే తచ్చాడుతోంది. ఆసియా దేశాలతో పోల్చి చూసినా కనాకష్టంగా ఉంది.

2004-05లో ఇతర దేశాల్లో ఉత్పాదకత (ట/హె)

దేశం	బియ్యం ధాన్యం
ఈజిప్టు	9.8
అమెరికా	7.8
కొరియా	6.7
జపాన్	6.4
ఇండియా	2.9
ప్రపంచ సగటు	3.96
దేశం	**గోధుమ**
ఇంగ్లండ్	7.7
ఫ్రాన్స్	7.6
చైనా	4.3
ఇండియా	2.7
ప్రపంచ సగటు	2.67

(ఎకనమిక్ సర్వే 2006-07)

తిండిగింజల వార్షిక సగటు పెరుగుదల ఏడవ ప్రణాళికలో (1985-90) 3.2 శాతం అయితే 2006-07 ముందస్తు అంచనా ప్రకారం 2.7 శాతానికి పడిపోయింది. ఆహారధాన్యాల ఉత్పత్తి (బియ్యం, గోధుమ) 2001-02 లో 212.9 మిలియన్ టన్నుల నుంచి 2006-07 ముందస్తు అంచనా ప్రకారం 209.2 మి.ట. కు దిగజారింది. విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకత అన్నీ నేలచూపు చూస్తుంటే, రాను రాను వ్యవసాయ భూమిని పువ్వులు, పండ్లు లాంటి ఉద్యానవన ఉత్పత్తులకు మళ్ళిస్తుంటే వ్యవసాయానికి భవిష్యత్తు ఉందా? ధరలు తగ్గుతాయా?

ప్రస్తుతం ధరల పెరుగుదల ఒత్తిడి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలంటే వామపక్షాలు వెంటనే ఈ కింది చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

1. ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ (పి.డి.ఎస్.) ప్రజలందరికి విస్తరిస్తూ దానిని పటిష్టం చేయాలి. పప్పులు, వంట నూనెలు చక్కెర సహా 15 నిత్య జీవితావసర వస్తువులను పి.డి.ఎస్.లో చేర్చాలి.
2. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రతిపాదించిన 25 వ్యవసాయోత్పత్తులపై ఫ్యూచర్స్ ట్రేడింగ్‌ను నిషేధించాలి.
3. కస్టమ్స్, ఎక్సయిజ్ సుంకాలను, నూనెలు, పెట్రోలియం ఉత్పత్తులపై తగ్గించాలి.
4. అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

వీటితోపాటు ప్రభుత్వం ఫుడ్‌కార్పొరేషన్ ద్వారా ఆహార ధాన్యాల సేకరణ చేయాలి. ఎగుమతులను నిషేధించాలి. వ్యవసాయానికి

దేశవ్యాప్తంగా ఆదివాసుల కాళ్ల కింద అడవిలోని ఖనిజ సంపద కోసం, బహుళజాతి కంపెనీల ప్రయోజనాలు నెరవేర్చడం కోసం ఇలాంటి కుట్రలు జరుగుతున్నాయని అంటున్నారు **ఎం. నాగరత్నం**

వాకపల్లి బాధితులకు కోర్టు నోటీసులు

దేశాన్ని కుదిపేసిన వాకపల్లి ఘటనలో బాధిత మహిళలకు మరోసారి ఘోరమైన అన్యాయం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా బాధితులపైనే దాడికి తెగబడింది. ఆరోపణలకు ఆధారాలు చూపించాలని లేకుంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తూ కోర్టు ద్వారా నోటీసులు పంపించింది. వాకపల్లి ఘటనలో వాస్తవాలు లేవని, ఆ గ్రామంలో మహిళలపై పోలీసులు అత్యాచారానికి పాల్పడలేదని, ఈ విషయం తమ విచారణలో బైటపడిందని సిఐడి అధికారులు పాడేరు కోర్టులో నివేదికను దాఖలు చేశారు. దీంతో పాడేరు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ బాధిత మహిళలకు నోటీసులు జారీచేసారు. నోటీసులు అందిన వారంలోగా కోర్టుకు హాజరై పోలీసులపైన చేసిన అత్యాచార ఆరోపణలను రుజువు చేయాలని, లేని పక్షంలో సిఐడి నివేదికను అనుసరించి బాధిత మహిళలపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆనోటీసులో కోర్టు తీవ్రంగా హెచ్చరించడం జరిగింది. తమపై కూంబింగ్‌కు వచ్చిన పోలీసులు అత్యాచారానికి పాల్పడ్డారని, గత ఏడాది ఆగష్టు 20వ తేదీన వాకపల్లి గ్రామానికి చెందిన 11 మంది ఆదివాసి మహిళలు ఆరోపించడం ఈ సంఘటన దేశవ్యాప్తంగా కుదిపేసింది. బాధిత మహిళలకు న్యాయం చేయాలంటూ రాష్ట్ర, దేశ వ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు, ర్యాలీలు జరిగాయి. ఈ తరుణంలో పాడేరు కోర్టు జారీచేసిన నోటీసులు మరోసారి ఆందోళనలకు దారితీసే పరిస్థితులు కనిపిస్తునాయి.

ఈ నోటీసులందుకున్న వాకపల్లి ఆదివాసి మహిళలు, ప్రజా స్వామికవాదులు, మేధావులు హతాశులయ్యారు. బహిరంగంగా, సామూహికంగా అత్యాచారానికి గురై న్యాయం జరక్కపోగా, తమలోతాము కుమిలిపోతుండగా కోర్టుకు హాజరుకమ్మని నోటీసులు పంపడం, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం అన్యాయం. తమవద్దకే కోర్టు రావాలని, తమకు జరిగిన అన్యాయాన్ని ముఖ్యమంత్రి, హోంమంత్రితో సహా హైకోర్టును, రాష్ట్ర మానవ హక్కుల సంఘాన్ని, జాతీయ ఎస్‌సి.ఎస్‌టి కమిషన్‌ను ఆశ్రయించినా న్యాయం జరగకపోగా కోర్టు నోటీసులు వారిని మరింత అవమానానికి గురిచేశాయి. మానసికంగా కుంగదీసాయి. రాజ్యయంత్రాంగంలో ఒక భాగం తప్పుచేస్తే, రాజ్యంతో సహా మొత్తం యంత్రాంగం ఆ భాగాన్ని రక్షించడానికి ఎంతటి దారుణానికైనా ఒడిగడ్తారనేది వాకపల్లి ఘటన ద్వారా రాజ్యం తన ఫాసిస్టు స్వభావాన్ని మరోమారు తేటతెల్లం చేస్తోంది. మరో పక్క బాధితుల్లో కసిని కూడా నింపుతోంది. వారి మాటల్లోనే తమకు బతుకంటే పోరాడటమని, చావంటే భయంలేదని, బతకడానికి ఎన్నిసార్లు అయిన చస్తామని, పోలీసులు ఇకపై తమ గ్రామంలోకి అడుగుపెడితే సంప్రదాయ ఆయుధాలతో బుద్ధి చెబుతామని తీవ్రంగా హెచ్చరించారు. అణచివేత ఎక్కడ ఉంటుందో ప్రతిఘటన అక్కడ ఉంటుందనడానికి ఇది నిదర్శనం. అయినా పేదవారి కోపం పెదవికి చేటన్నట్లు తమ ఆవేదనను దిగమింగుకుంటూ మార్చి 12న అరకులోయ కోర్టుకు హజరయ్యారు. తిరిగి మార్చి 19న పాడేరు కోర్టుకు హాజరు కావాలని కోరడంతో ఆత్మాభిమానంతో పాడేరు కోర్టుకు హాజరు

ప్రాధాన్యత నిచ్చి, ఉత్పత్తి, ఉత్పాదకత పెంచటం ద్వారా దిగుమతులపై ఆధారపడాల్సిన దౌర్భాగ్య పరిస్థితిని అంతం చేయాలి.

ఇవన్నీ ప్రధానికి నివేదిస్తే, జరిగే పనులు కావు. మంత్రాలకు చింతకాయలు రాలవు. దొంగ నిల్వలను బహుళజాతి సంస్థల, కార్పొరేట్ల, బడా వ్యాపారస్తుల నిల్వలను ప్రజలే బయటపెట్టాలి. ప్రభుత్వ దృష్టికి ఈ నిల్వలను తీసుకొనివచ్చి, ఎటువంటి చర్య తీసుకోని పక్షంలో ప్రజలే చొరవ తీసుకోవాలి.

తాజా వార్త

ఈ వ్యాసం రాస్తూండగా, ఇండియా, చైనాల్లో జనం ఎక్కువగా తింటూండడం వల్లనే కొరత ఏర్పడి ధరలు పెరుగుతున్నాయనే అమెరికా అధ్యక్షుడు బుష్ సంధి ప్రేలాపన వార్త వచ్చింది. తన పదవీ కాలానికి నూకలు చెల్లాయి. తన దేశ ప్రజలే అతనిని ఛీ కొడుతున్నారు. ప్రపంచంలో అమెరికా పెత్తనానికి నూకలు చెల్లుతున్నాయి. పాపం, కాస్త మతిచలించి ఏమేమో మాట్లాడుతున్నాడు. పెట్టుబడిదారీ ప్రపంచంలోని వర్ధమాన దేశాల్లో ఇండియా, ప్రజాస్వామ్య సోషలిస్ట్ దేశమైన చైనా ఆసియా ఖండంలో ముందుకు దూసుకుపోతున్నాయి. అమెరికా పాలకుల కంపు ముక్కుపుటాలదరగొడుతూంది. అందుకనే ఈ రెండు దేశాల మీద ఆకుకు అందని, పోకకు పొందని ఆరోపణ చేశాడు. గురివింద గింజ తన కింద నలుపు తానెరుగదన్నట్లు తన దేశంలోనే తిండి గింజల వినియోగం పెరుగుతోందని అతనికి అంచనాలేదు. లేదా ఈ అధిక వినియోగాన్ని కప్పిపుచ్చటానికి ఇతర దేశాల మీద అభాండాలు వేస్తున్నాడు. ◆

కాలేకపోయారు. దీంతో కేసు విచారణ ఏప్రిల్ 2కు వాయిదావేసారు. ఎలాంటి విచారణ చేపట్టకుండానే మళ్ళీ కేసు విచారణ మే 7కు వాయిదా వేశారు.

ఆదినుంచి అదేతీరు

వాకపల్లి అత్యాచార ఘటన వెలుగుచూసిన దగ్గర నుంచి పోలీసుల వైఖరిపై తీవ్రస్థాయిలో ప్రజావ్యతిరేకత వ్యక్తం అయిన విషయం లోకానికి తెలిసిందే. బాధిత మహిళలను వైద్య పరీక్షలకు సకాలంలో తీసుకు వెళ్లకపోవడం, మార్గమధ్యంలో వారిని అడ్డగించి బెదిరించడం, ఆ గ్రామానికి చెందిన సూర్యం, ప్రకాష్‌లను నిర్బంధించడం, బూటకపు ఎన్‌కౌంటర్ చేస్తామని భయపెట్టడం వంటి చర్యలతో వాస్తవాలను వెలుగులోకి రాకుండ తీవ్ర ప్రయత్నాలు చేసారు. ఘటన జరిగిన కొద్ది గంటల్లోనే డిజిపి, ఎస్‌పి ఏమి జరగలేదని తేల్చేసారు. వారు మావోయిస్టు సానుభూతిపరులని, మావోయిస్టులకు ఆశ్రయం ఇచ్చారని బుకాయించారు. నేర విచారణ కోర్టులు చెయ్యాలనటం రాజ్యాంగం చెప్పేమాట. కాని దానికి విరుద్ధంగా చట్టాల కోసం బాగా తెలిసిన ఇద్దరు పెద్దమనుషులు నేరం జరగలేదు, నేరస్తులను ఎట్లా పట్టుకుంటామని తేల్చేశారు. దీన్నిబట్టి చూస్తే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అప్రజాస్వామికంగా ఎవరు వ్యవహరిస్తున్నారో విజ్ఞతతో ఆలోచిస్తే అర్థమవుతోంది. 1993 ప్రాంతంలో మన్యం ఆదివాసుల గూడెలను మావోయిస్టు సానుభూతిపరులనే నెపంతో తగులబెట్టారు. అలాంటిది వాకపల్లి ఘటన సహజమైనదిగా పట్టించుకోనవసరం లేనిదిగా కనిపిస్తోంది. ఇలాంటి సహజ, సాధారణ ఘటనను చూసి ప్రజాస్వామిక వాదులు, మేదావులు, ప్రజాసంఘాలు ఇంత ఆందోళన చేయడమేమిటని హోంమంత్రి దగ్గరి నుండి జిల్లా ఎస్‌పి, పాడేరు డిఎస్‌పి వరకు ఆశ్చర్యపోయారు అంటే వారి మనస్సులో వారి ఆలోచనల్లో ఏముందో విజ్ఞులకు ఎవ్వరికైనా అర్థమౌతుంది. గత చరిత్ర పునరావృతం అయ్యింది. గతంలో కూడా ఆదివాసులపై జరిగిన ప్రభుత్వ తప్పిదాలను అంగీకరించిన చరిత్ర ప్రభుత్వానికి లేదు. ఆదినుంచి ఇలాంటి ఆకృత్యాలు అనేకం చేసిన, చేస్తున్న అనుభవం ఇటు ప్రభుత్వానికి అటు పోలీసులకు ఉంది. ఇలాంటి ఆకృత్యాల జాబితాలో తాజాది 'వాకపల్లి అత్యాచార' ఘటన. ఇది అంతంకాదు. అరంభం అంతకన్నకాదు. కొనసాగింపు మాత్రమే. గ్రేహౌండ్స్ అడుగు పెట్టిన చోటల్లా ఇలాంటివి అనేకం జరుగుతున్నా, లోకం దృష్టికి వచ్చింది తక్కువే. ఆదివాసీ ప్రాంతాల్లో ఇది నిత్య కృత్యం.

వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, మావోయిస్టుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి పెరగటంతో వాకపల్లి ఘటనపై గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి నాగిరెడ్డిని ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ ఘటనపై ప్రాథమిక ఆధారాలు ఉన్నట్టుగా, బాధిత మహిళల మాటలను కొట్టి పారేయలేమని నాగిరెడ్డి అన్నారు. అంతే కాకుండా ఘటన జరిగిన తర్వాత జిల్లా కలెక్టర్, ఎస్‌పిలు సందర్శించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. ఇలాంటి సందర్భంలో ఎస్.సి., ఎస్.టి. అత్యాచార నిరోధక చట్టం 1989కి విలువ లేకుండా పోతోందని మొసలి కన్నీరు కార్చారు. దీంతో సిబిడి విచారణకు ఆదేశించింది. గత ఏడాది సెప్టెంబర్ 29న సిబిడి ఎస్‌పి శివానందరెడ్డి పాడేరులో బాధిత మహిళలను విచారించి, వాకపల్లి ఘటనలో వాస్తవాలు లేవంటూ హైకోర్టుకి నివేదిక సమర్పించారు. సిబిడి నివేదికతో సంతృప్తి చెందిన హైకోర్టు వాకపల్లి కేసును మూసివేసింది. ఘటనపై ఆలస్యంగా స్పందించిన జాతీయ ఎస్.సి., ఎస్.టి. కమిషన్ వాస్తవాలను తెలుసుకునేందుకు ఆర్.కె. మిశ్రా అనే అధికారిని గత ఏడాది నవంబరు 19న పంపింది. బాధిత మహిళలను విచారించిన మిశ్రా నివేదికను జాతీయ ఎస్.సి., ఎస్.టి. కమిషన్‌కు అందించారు. దీనిపై స్పందించిన ఎస్.సి., ఎస్.టి. కమిషన్ వాకపల్లి ఘటనకు సంబందించిన ఆధారాలు ఉన్నాయని, ఈ ఘటనపై సిబిఐ లేదా ఆపైస్థాయి అధికారులతో సమగ్రంగా విచారణ జరిపించాలనీ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. నిర్ణయాధికారం లేని కమిషన్లు, కమిటీలు, ఎన్ని నివేదికలు, పత్రాలు సమర్పించినా వాటిపై తుది నిర్ణయం తీసుకోవాల్సింది రాజ్యం. కాబట్టి కమిషన్లకు, కమిటీలకు సాధికారతలేదు అందుకే వాటి నివేదికలు, పత్రాలు భూడిదలో పోసిన పన్నీరు మాదిరిగా ఉంటుంది. తాజాగా సిబిడి, ఎస్‌పి వాకపల్లి ఘటనలో బాధిత మహిళలదే తప్పని తేలినట్టుగా కోర్టుకు నివేదించడాన్ని బట్టిచూస్తే ప్రభుత్వం పథకం ప్రకారం కేసును నీరుగార్చి, దోషులను రక్షించడానికి ఆడుతున్న నాటకాన్ని రసవత్తరంగా నడిపిస్తున్నది. అన్ని నివేదికలు పరిశీలించిన అనంతరం హైకోర్టు అత్యాచారం జరిగిందనిగాని, జరగలేదనిగాని తేల్చలేదంటే నేర నిర్ధారణ సక్రమంగా జరగలేదని అర్థం. అలాంటి సందర్భంలో కేసు ఎలా మూసివేస్తారు? నేర ఆరోపణకు గురయ్యింది పోలీసులు. హోంమంత్రి నుండి డిజిపి వరకు బహిరంగంగా దాపరికం లేకుండా పోలీసుల పక్షం వహించారు. మరి వారి కింద పనిచేసే సిబిడి వారు నిష్పాక్షికంగా విచారణ చేస్తారని కోర్టు ఎలానమ్మింది? ఈ విషయంలో బాధితులు, ప్రజాసంఘాలవారు ముందే తమ అభ్యంతరాలను, అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని హైకోర్టు ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు? సిబిఐచే విచారణ జరిపించాలనే పిటిషన్ ఎందుకు కొట్టివేసింది. ఒకవైపు అత్యాచారం జరగలేదని చెప్పలేమని ఒప్పుకుంటూనే కేసును మూసివేయడం దుర్మార్గమైన, హేయమైన చర్య తప్ప మరేమి కాదు. అతిసామాన్యులకు అందున వెనుకబడిన ఆదివాసీ మహిళలకు కనీస న్యాయ తృణీకరణగా హైకోర్టు చరిత్రలో ఈ తీర్పు నిలిచిపోతుంది. మానవ హక్కుల ఉల్లంఘన రేటింగ్‌లో ఇప్పటి వరకు రాష్ట్ర పోలీసులదే ప్రథమ స్థానం. ఈ తీర్పుతో రాష్ట్ర హైకోర్టు తన వర్గ నిజస్వరూపాన్ని నగ్నంగా బయటపెట్టుకొని వారితో జతకలిసింది.

రాజ్యాంగం-చట్టాలు గ్రంథాల్లోనూ, న్యాయ కళాశాలల్లో బోధించడానికి, కోర్టుల్లో వాదించడానికి తప్ప ఇలాంటి సంఘటనల్లో బాధిత ఆదివాసీ మహిళలకు ఏమి ఉపయోగపడ్డట్టు లేదు. బూర్జువా చట్టాలు, రాజ్యాంగం దోపిడివర్గాల ప్రయోజనాలు ఈడేర్చడానికి రాజ్య యంత్రాంగంలో భాగంగా ఉన్నవే. వారికి జరుగుతున్న అన్యాయం.ఈ వాకపల్లి ఘటన రుజువు చేస్తోంది. ఆదివాసుల ఆత్మగౌరవానికి చట్టబద్ధతే లేదన్నదికూడా ఈ ఘటన ద్వారా అర్థమవుతోంది. కమిషన్ల గురించి అంతర్జాతీయ వేదికలపై లెక్కలు చెప్పుకోవడానికి, డాంబికాన్ని, వాగాడంబరాన్ని ప్రదర్శించడానికి మొదటి వరసలో ఉండే ఈ కమిషన్లు వాకపల్లి ఆదివాసీ మహిళలకు జరిగిన అన్యాయంపై పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాయి. పాలకవర్గాల అడుగులకు మడుగులొత్తడమే తమ కర్తవ్యంగా, ఈ కేసు విషయంలో కూడా పాలకులకు అనుకూలంగానే పనిచేసారు.

మన్యం ప్రాంతంలోని ప్రకృతి వనరులపై బహుళజాతి సంస్థల కన్నుపడటంతో ఇక్కడ ఆదివాసీ ప్రజలు నిర్వాసితులు కాబోతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం జిందాల్, ఆల్‌రాస్‌ఖైమా, అనన్‌రాక్ వంటి బహుళజాతి సంస్థలతో బాక్సైట్ తవ్వకాలకు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇటువంటి పరిస్థితిలో మొత్తం అటవీ ప్రాంతంపై క్రమంగా బహుళజాతి సంస్థలు ఆధిపత్యం సంపాదించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంట్లో భాగంగానే బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆదివాసీలపై అప్రకటిత యుద్ధానికి దిగింది. గత కొంత కాలంగా మన్యంలో ప్రభుత్వ సాయుధ బలగాల దాడులు పెచ్చుమీరాయి. గ్రామాలపై పెద్ద ఎత్తున దాడులు కొనసాగుతున్నాయి. ప్రజల ఆస్తులు, ఆహారధాన్యాలు, ధ్వంసం చేస్తున్నారు. ఇండ్లకు ఇండ్లను లూటీ చేస్తున్నారు. డబ్బు, నగలు వంటివి దోచుకుపోతున్నారు. అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులు బనాయించి జైల్లో నిర్బంధించి, ఆదివాసుల్లో భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆగష్టు 20న వాకపల్లి అత్యాచార ఘటన వెలికి చూసింది. వెంటనే సెప్టెంబర్ 2న వాకపల్లి బాధితుల న్యాయంకోసం ప్రజల్ని సంఘటితపరిచే పనిలో ఉన్న మావోయిస్టుల్ని అమిడేలు గ్రామంలో ఏకపక్షంగా కాల్పులు జరిపి నలుగుర్ని హత్యచేసింది. ఈ ఘటనతో ఆదివాసీ సమాజమంతా నివ్వెరపోయింది. ఈ వరస ఘటనల నుండి తేరుకోక ముందే గత ఏడాది డిసెంబర్ 6న విశాఖ జిల్లా కొయ్యూరు మండలం కన్నవరం గ్రామంలో ముగ్గురు ఆదివాసీ యువకులను బూటకపు ఎన్‌కౌంటర్లో హత్య చేశారు. మావోయిస్టులనే ముద్రవేసారు. ఈ పరంపరలో భాగంగా పెదబయలు మండలం అమిడేలు గ్రామంలో 25 ఏప్రిల్ 2008న వివాహం సందర్భంగా వధువు, వరుడ్ని అదుపులోకి తీసుకుని తాళ్లతో బంధించారు. వివాహ సామాగ్రినంతటిని ధ్వంసం చేసారు. సాయుధ మూకల చర్యలను గ్రామస్థులు ప్రతిఘటించారు. రెచ్చిపోయిన పోలీసులు గ్రామస్థులపై తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శించారు. వరుడ్ని, వధువుని కూడా చితకబాదారు. ఇదంతా బతుకుదెరువుకోసం. రాజ్యం, సహజవనరులు దోచుకుంటున్న బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా ప్రజా సమూహాలు తమన్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్నప్పుడు వాటిని చట్టబద్ధంగా పరిష్కరించే, ఎదుర్కొనే ప్రజాస్వామ్య దృక్పథం, సత్తాలేనప్పుడు, అలాంటి ఉద్యమాలు తమ అస్థిత్వానికి ప్రమాదకరమని భావించి అప్రజాస్వామిక పద్ధతుల ద్వారానే నోరునొక్కి టెర్రరైజ్ చేసి అణచడం కోసం, ఎదురు తిరుగుతున్న గ్రామాలపై జరిగే దమనకాండ ఆదివాసీ ప్రాంతాలను నిత్య నిర్బంధంలో నిస్తేజపరుస్తున్నాయి.

మహిళలను గౌరవించడం భారత సంప్రదాయం అని చెప్పుకునే వాళ్ళు, మహిళల సామాజిక, రాజకీయార్థిక అభ్యున్నతికోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్నవాళ్ళు, ఒక మహిళ మొట్టమొదటి దేశ ప్రథమ పౌరురాలిగా ఉన్న ఈ దేశంలో బహుశా వాకపల్లి ఆదివాసీ మహిళలు వారి దృష్టిలో మహిళలు కాకపోవచ్చు. ఎందుకంటే అత్యాచారం జరిగిన వెంటనే తమపై అత్యాచారం జరిగిందని లోకానికి తెలియజేయటం, దీనికి బాధ్యులైన పోలీసులను కఠినంగా శిక్షించాలని ఉద్యమించి భారత మహిళల పరువు ప్రతిష్ఠను మంటగలిపారనే భావనే వారిని మహిళలుగా పరిగణించక పోవడానికి కారణం. భూస్వామ్య భావజాలం పెంచిపోషిస్తున్న పాలకులు కోరుకునేది అత్యాచారం జరిగిన వెంటనే సభ్యసమాజం గర్హించేలా ఆత్మహత్య చేసుకుంటేనో లేదా అత్యాచారం జరిగిన తరువాత సభ్యసమాజంలో తలెత్తుకుని ఎలా బతగ్గలమని అసలు సంఘటననే జరగలేదని మానసికంగా కుమిలిపోతూ ఆత్మవంచన చేసుకుంటేనో వాకపల్లి మహిళలు కూడా భారతమహిళల సరసన చేరి ఉండే వారేమో! కాని వారు ఆదివాసీ పుత్రికలు ఎటువంటి కల్మషం లేని శ్రమజీవులు. ఎలాంటి ఒడిదుడుకులనైనా, ఆటుపోట్లనైనా, కష్టనష్టాలనైనా ఎదుర్కొనే ధైర్యం వారిసొత్తు. అబద్ధాలు ఆడడం వారికి తెలియదు. చేసిన తప్పులను నిజాయితీగా ఒప్పుకోవడమే కాదు, తప్పుచేసి ఒప్పుకుంటే తప్పుచేసిన వారిని కూడా హృదయంలో అక్కున చేర్చుకునే విశాల దృక్పథం కలిగినవారు. ప్రకృతికి అనుగుణంగా, సహజసిద్ధంగా శ్రమైక జీవనం సాగిస్తున్న వారిని జాతీయ స్రవంతిలో కలువాలని పాలకులు పదే పదే పిలుస్తున్నారు. జాతీయ స్రవంతి అంటే పాలకుల అర్థంలో వారికట్టుబొట్టు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, శ్రమైక్య జీవనాన్ని విడనాడి, భూస్వామ్య సామ్రాజ్యవాద విషసంస్కృతిని స్వీకరించమనడమే. ఇలా పిలుపునిస్తూ వారి సామాజిక, రాజకీయార్థిక, సాంస్కృతిక అభివృద్ధికి తమ ప్రభుత్వమే పెద్దపీట వేస్తున్నదని తామే ఆదివాసీ పక్షపాతులమని దాంబికాన్ని, వాగాడంబరాన్ని ప్రదర్శిస్తున్నాయి. కానీ తమపై అత్యాచారం జరిగిందని, అత్యాచారం కూడా గూడెం సజీవ సాక్ష్యంగా జరిగిందని, అత్యాచారం చేసింది కూడా ఈ రాజ్య పోలీసులని గొంతెత్తి నినదించినా కలిసిన వారందరికీ విన్నవించుకున్నా, రాజ్యం కనుసన్నలలో నడిచే ఫోరెన్సిక్ నివేదికల మీదున్న నమ్మకం, సిఐడిల నివేదికల మీదున్న విశ్వాసం, ఆదివాసుల నీతి నిజాయతీ మీద లేకపోవడం ఈ పాలకుల దమననీతిని తెలుపుతున్నది. ఆదివాసీ మహిళల ఆరోపణల చుట్టూ కట్టుకథలల్లి పోలీసుల కూంబింగ్‌ను నిరోధించడానికే మావోయిస్టులు పోలీసులపై ఆరోపణలు చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేయడం పోలీసుల నైజాన్ని కప్పిపుచ్చడమే. పాలకపక్షానికి, పోలీసులకున్న సంబంధమే ప్రజాస్వామిక విలువలుగా ప్రచారమవుతుంటే అందున ఆదివాసీ మహిళలకు ఏదో న్యాయం జరుగుతుందనుకోవడం నేతిబీరకాయలో నెయ్యిని వెతకడమే.

ప్రపంచంలోకెల్లా గొప్ప ప్రజాస్వామ్య దేశమని చెప్పుకునే ఈ దేశంలో భద్రతా దళాల నుంచి మొదలుకొని రిజర్వు పోలీసుల దాక, కాశ్మీర్ నుంచి విశాఖ మన్యం వరకు గత 60 సంవత్సరాలుగా పోలీసుల నిర్వాకం గుర్తెరగనిది ఎవరు? నక్సలైటు ఉద్యమాన్ని అణచివేయడానికి గ్రేహౌండ్స్ వంటి పోలీసు వ్యవస్థను తయారు చేస్తే సమాజానికే మవుతుందో తాజా ఉదాహరణలు ముదిగొండ, వాకపల్లి, కన్నవరంలలో చూసాం. ఆదివాసీ మహిళల అత్యాచారానికి కారణం వాళ్ళ కాళ్ల కింద నేలలో ఉన్న ఖనిజాల కోసమని వాళ్లకు తెలియకకాదు. ఆదివాసుల, శ్రమజీవుల కాళ్లకిందనేల, కడుపులో వొడిగట్టుకున్ననేల, వీపుపై గంపకెత్తుకున్ననేల, పిడికిట్లో పంటవుతున్ననేల ఇపుడు సామ్రాజ్యవాదానికి కావాలి. దేశవ్యాప్తంగా ఆదివాసుల కాళ్ల కింది అడవిలోని ఖనిజాలకోసం, సంపదకోసం ఈ కుట్ర జరుగుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులపై ఎక్కుపెట్టిన అప్రకటిత యుద్ధాన్ని ప్రజా ఉద్యమం ద్వారానే తిప్పికొట్టాలి. అడవిపై ఆదివాసుల రాజకీయాధికారం కై పోరాడాలి. ◆

కాన్షీరాం ఒక రాజకీయవేత్తే కాకుండా తాత్వికుడు, మేధావి, సిద్ధాంతాన్ని ఆచరణతో అత్యద్భుతంగా మేళవించిన గొప్ప సృజనశీలి అని అంటున్నారు **బి.వీరయ్య, బి. సుధాకర్**

బహుజనుల బాంధవుడు - కాన్షీరాం

భారతదేశ సామాజిక వ్యవస్థ అనేక దొంతరలను కప్పుకొని ఉంది. ఈ దొంతరలే వర్ణవ్యవస్థకు ప్రతిరూపాలు. ఈ వర్ణ వ్యవస్థను ఛేధించడానికి బహుజనులంతా సంఘటిత పడుతూ రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చిన బహుజన పితామహుడు కాన్షీరాం. ఉత్తరభారతదేశమే కాక యావత్తు దేశ రాజకీయాలలో బహుజన ఉద్యమ ప్రభావంను ఆచరణలో అమలు చేసి మూడుమార్లు ఒక దళిత యువతిని దేశంలోనే అతి పెద్ద రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేసిన ఘనత కాన్షీరాంకే దక్కుతుంది. అనాది నుండి బహుజన తాత్వికులైన బుద్ధుడు, పూలే, సాహుజీ, నారాయణగురు, పెరియార్, అంబేద్కర్‌ల హృదయాంతరాళల నుండి పొంగిపరవళ్ళు తొక్కుతూ సాగుతున్న బహుజన ప్రవంతిని అక్కున చేర్చుకొని దానికి మార్గాన్ని నిర్దేశిస్తూ ప్రయోగాత్మకమైన, రాజకీయ, సాంస్కృతిక భావజాలాన్ని దేశం మొత్తం మీద ప్రచారం చేసిన ఘనుడు కాన్షీరాం. పంజాబ్‌కు చెందిన రోపడ్ జిల్లాలో 'ఖవాస్‌పూర్' గ్రామంలో 1934 మార్చి 15న షెడ్యూల్డ్ కులంలో కాన్షీరాం జన్మించారు. దళితులను సంఘటితం చేసి, వారిని ఎన్నికలలో నిర్ణాయకశక్తిగా మలచి స్వతంత్ర భారత రాజకీయాలను విశేషంగా ప్రభావితం చేసిన వ్యక్తి కాన్షీరాం సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా తనదైన శైలిలో రాజకీయ ఉద్యమాలను నిర్మించి దళితులకు, బహుజనులకు రాజ్యాధికారం రుచి చూపించిన వైతాళికుడు. రిజర్వేషన్ విధానం వల్ల లబ్ది పొందిన ఉద్యోగ వర్గాలను సమీకరించి వారిలో రాజకీయ చైతన్యం రగిలించి దళిత బహుజనులను అధికార పీఠం వైపు నడిపించిన వైదుష్యం ఆయనది. ఆయన రాజ్యాధికారమే దళితుల లక్ష్యం కావాలని ఘోషించిన మేధావి అంబేద్కర్ కలల సాఫల్యానికి సృజనాత్మకంగా కృషి చేసి సత్ఫలితాలు సాధించిన సేనాని కాన్షీరాం.

స్వతంత్ర భారత రాజకీయాలలో ఏ నాయకుడితోనూ పోల్చలేని అసాధారణ, అతి విలక్షణ, అపురూప నాయకుడు కాన్షీరాం. ఆయన 9 అక్టోబర్ 2006లో కన్నుమూశారు. ఒక వ్యక్తిగా కాక ఒక శక్తిగా, ఒక స్ఫూర్తిగా, ఒక మహా సంచలనంగా దేశ రాజకీయ క్షితిజంపై ప్రత్యక్షమై దేశం మొత్తాన్ని తనవైపు చూసేలా చేసుకున్న నేత ఇటీవలి కాలంలో కాన్షీరాం ఒక్కరే. అశేష బహుజన సమాజంలో కొత్త ఆశలను సరికొత్త కార్యోత్సాహాన్ని నింపి అతిస్వల్ప కాలంలోనే అనూహ్య ఫలితాల వైపు వారిని నడిపించిన కాన్షీరాంను సాధారణ రాజకీయ నాయకుల పక్కన నిలబెట్టి తూచడమంటే ఆయన వ్యక్తిత్వాన్ని, ఆయన లక్ష్యాలను చిన్న బుచ్చడమే. ఒక రాజకీయవేత్తే కాకుండా ఒక తాత్వికుడు, మేధావి, సిద్ధాంతాన్ని ఆచరణతో అత్యద్భుతంగా మేళవించగల గొప్ప సృజనశీలి కాన్షీరాం. రాజకీయ పార్టీని ఒక సామాజిక, సాంస్కృతిక పునర్నిర్మాణ ఉద్యమంగా కాన్షీరాం నడిపాడు. 80 శాతం ప్రజలు తమ ఓటును తాము ఉపయోగించుకుంటే రాజకీయాధికారం తమ హస్తగత మవుతుందని సిద్ధాంతీకరించాడు. భారత భూభాగంలోని అతి ప్రసిద్ధమయిన గంగా మైదానంలో సైకిల్‌తో ప్రవేశించి ఒక దశాబ్ది కాలంలో వాడవాడలా నీలం రంగు జెండా ఎగురవేయగల్గిన ప్రభంజన కర్త. బహుజన సమాజ నిర్మాణానికి రాజకీయాధికారం ప్రధానమయిన 'కీ' అని బోధించిన కార్యకర్త. అగ్రకుల రాజ్యాన్ని కూల్చివేయడానికి ఓటు ఒక పోరాట సాధనమని, దానిని అమ్ముకోవడమంటే రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల్ని అమ్ముకోవడమేనన్నారు. కాన్షీరాం బహుజనుల తాత్విక పునాది రాయి, త్యాగమూర్తి, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత స్వంత ఆస్తి లేకుండా మరణించిన నలుగురయిదుగురు నాయకులలో ఒకరు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం కాలినడకన, సైకిల్‌మీద భారతదేశం నలుమూలలా తిరిగిన ప్రభోదకుడు. అపారమయిన జ్ఞాపకశక్తితో భారత రాజకీయ, సామాజిక చరిత్రను గంటలకొలది బోధించగలిగిన అధ్యాపకుడు. లక్షలాది మంది ప్రజలను అంబేద్కర్ తర్వాత ఉత్తేజ పరుస్తూ ఉపన్యసించిన మహోపన్యాసకుడు.

ఉద్యోగం నుండి ఉద్యమ ఆచరణలో

కాన్షీరాం బి.ఎస్.సి సైన్స్‌లో పట్టభద్రుడై 1957లో పూణెలోని ఆయుధాల ఫ్యాక్టరీలో పరిశోధక అధికారిగా మంచి ఉద్యోగంలో ఉంటూనే అంబేద్కర్ అనంతర కాలంలో దళిత బహుజనుల విముక్తి ఉద్యమ స్థితిగతులను శ్రద్ధగా అధ్యయనం చేయడం ప్రారంభించారు.

అంబేద్కర్ కన్నుమూయగానే ఆయన ఆలోచనధార ఆచరణ కార్యక్రమం ఆగిపోయిందని అగ్రవర్ణాలు నిర్ధారణకు వచ్చాయి. కానీ అంబేద్కర్ ఆలోచన సరళిని, దాని ఆచరణ పార్శ్వాన్ని తిరిగి సజీవం చేసి స్వతంత్ర భారతంలోకి తీసుకురావడం కాన్షీరాం గొప్పతనమేనని, ఆయన తాత్వికతను విశ్లేషించిన పరిశీలకులు అంటారు. విద్యావంతులు, మేధావులయిన దళితులు అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు ఉపయోగించుకొని ఉద్యోగాలలో ఎదిగి సంపద కూడబెట్టుకొని తమ

కుటుంబాలను ఉద్ధరించుకోవడంలోనే మునిగారు తప్ప అంబేద్కర్ ఆశించినట్టు మొత్తం దళిత సమాజ సముద్ధరణకు తమ వంతు సహాయం అందించవల్సిన బాధ్యతను విస్మరించారని కాన్షీరాం ఆవేదన చెందారు. ఆ ప్రయత్నంలో కాన్షీరాం మంచి జీతం లభిస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నారు. ఆ క్రమంలోనే బహుజనులందరిని సమీకరించే నినాదాన్ని అందుకొని 1981 డిసెంబర్ 6న 'దళిత్ సోషిత్ సమాజ్ సంఘర్షణసమితి' ని ఏర్పాటు చేశారు.

బహుజనుల భావ వ్యక్తీకరణ – పత్రికల ఏర్పాటు

సమాజంలో అవకాశాల లేమికి గురి అవుతున్న పీడిత ప్రజల భావజాలాన్ని అగ్రవర్ణాల ప్రచార మాధ్యమాలు వ్యాపింపచేయవని కాన్షీరాం ఒక గొప్ప నిర్ణయంను తీసుకొన్నారు. 'బామ్‌సెప్' నిర్మాణం వెనుకబడిన వర్గాల ఉద్యోగులలో దావనంలాగా విస్తరించి బహుజన ఉద్యమ ఆవశ్యకతను పాదుకొల్పింది, ఈ విషయాలను ఢిల్లీ నుండి వచ్చే 'బామ్‌సెప్' పత్రిక 'ది అప్రెస్డ్ ఇండియన్' ద్వారా ప్రచారం చేయడమే కాక, విస్తృతంగా విశాల ప్రజల్లోకి చొచ్చుకొని పోగల్గింది. దీనితో ఇంగ్లిష్ పత్రికలు వెనుకబడిపోయాయి. ఈ ఉద్యమం పట్ల ఆకర్షితులవుతున్న వెనుకబడిన తరగతులవారిని గందరగోళపరచడానికి ఈ అగ్రవర్ణ పత్రికలు ఎన్నో ప్రయత్నాలు చేశాయి. ఇలాంటి మీడియా వైఖరిని చక్కటి తార్కిక వైఖరితో కాన్షీరాం విశ్లేషించాడు. ఈ దేశంలో ఉన్న మీడియా మన వార్తలను తొక్కిపడుతుందని, ఒకవేళ ప్రచురించినా అది బ్రాహ్మణవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలను వక్రీకరించడానికి ప్రయత్నం చేస్తుందని కాన్షీరాం చెప్పారు.

అంబేద్కర్ తన స్వంత పత్రికలయిన 'బహిష్కృత భారత్' 'మూక్‌నాయక్' 'సమత' ప్రబుద్ధ భారత్‌ల ద్వారా ఉద్యమాన్ని ఎలా విస్తరించాడో అలాగే మనకోసం ఒక బహుజన మీడియాను సృష్టించుకోవాలని కాన్షీరాం ఎప్పుడు చెప్తుతుండేవారు. కొన్ని వారపత్రికలను ఏర్పాటు చేశారు. బహుజన సంఘటక్ (హిందీ), బహుజన నాయక్ (మరాఠీ), బహుజన సందేశ్ (గుజరాత్) ఎకనామిక్ అండ్ సర్జ్ (ఇంగ్లిష్) నడిపేవాడు. చెల్లాచెదురయిన బహుజన రచయితలను జర్నలిస్టులను ఒకచోట చేర్చడం ఆయన ధ్యేయంగా పెట్టుకొని విజయం సాధించడం జరిగింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోనే కాకుండా యావత్ భారత్‌లో ఈ ప్రయోగం పెను ప్రభావంను చూపగల్గింది.

బామ్‌సెఫ్ నిర్మాణం – బహుజనుల ఐక్యత

బహుజన సమాజంలోని వివిధ కులాలు, ఉపకులాలు, మత మైనారిటీల అవసరాలు తీర్చే విధంగా డిసెంబర్ 6, 1978లో బ్యాక్‌వర్డ్ అండ్ మైనారిటీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (బామ్‌సెఫ్) ను ప్రారంభించారు. కాన్షీరాం బామ్‌సెఫ్‌ను రాజకీయ, పోరాట రహిత, మత రహిత సంస్థగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఢిల్లీలో కార్మికశాఖలో పనిచేస్తున్న సెక్షన్ ఆఫీసర్ శ్రీ దౌలత్‌రామ్ బంగర్ ఇంటిలో బామ్‌సెఫ్ కార్యాలయం ప్రారంభించారు. బామ్‌సెఫ్‌ను బలోపేతం చేయడానికి చాలా కష్టపడ్డారు. వేలాది శిక్షణా శిబిరాలు నిర్వహించారు. ఇందులో ఐదు వందలమంది పి.ఎచ్.డి. స్కాలర్స్, మూడు వేలమంది డాక్టర్లు, పదిహేను వేలమంది సైంటిస్టులు, 70 వేలమంది గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు చేరారు. ఐదుసంవత్సరాలలో 2లక్షల మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఇందులో విద్యావంతులైన ఉద్యోగులు బ్రెయిన్ బ్యాంక్ (మేధోబ్యాంక్), మనీ బ్యాంక్, టాలెంట్ బ్యాంక్‌గా అందించవలసిన అవసరం ఉంది.

బామ్‌సెఫ్ నిర్మాణాన్ని స్థిరీకరించడానికి అవసరమయ్యే సమాచారం, గణంకాలు, పటాలు, చిత్రాలు, ఎంతో శ్రమించి సేకరించి కార్యకర్తల శిక్షణ శిబిరాలలో ప్రదర్శించారు. బామ్‌సెఫ్ పరిధినుండి బహుజన సమాజంలోని విద్యావంతులనే గాక, నిరక్షరాస్యులు కూడా తప్పించుకోలేని విధంగా దాన్ని నిర్మించారు. ముద్రణ ప్రచురణ విభాగం, పారిశ్రామిక కార్మికుల విభాగం, భూమిలేని రైతుల విభాగం, మహిళ, యువజన, విద్యార్థి విభాగాలు, న్యాయసలహా కేంద్రం, వైద్యసలహా కేంద్రం, సహకార విభాగం (బహుజనుల ఆర్థిక సౌష్టవం పెంచడానికి) సాహిత, జాగృతి, "బుద్ధిస్ట్ రిసెర్చ్ సెంటర్" ఇవన్నీ బామ్‌సెఫ్ విభాగాలు. ఆచరణలో బహుజన సమాజంలోని ఏ తరగతి తప్పిపోలేదు. కులం సృష్టించిన అసమ, అన్యాయ, అసహ్యతల నుండి బహుజన సమాజాన్ని బయట పడవేయగల మహోన్నత లక్ష్యాలను సాధించడానికి ఉపయోగ పడే లక్షణాలు అయిన త్యాగనిరతి, సమర్థత, నిబద్ధతగల నాయకులను వెదకడం దీని కర్తవ్యం. తాము జన్మించిన వర్గాలకు పూర్తిగా దూరమైపోయిన ఉద్యోగులలో ఒక నిబద్ధతను కల్పించడానికి 'నీవు జన్మించిన సమాజానికి బదులుగా కొంత ఇవ్వు' అనే నినాదాన్ని ఇచ్చాడు.

కాన్షీరాం వ్యూహం ఏమిటంటే దాదాపు 4500 (70 శాతం) ఉన్న పేద, నిరక్షరాస్య బాధిత కులాలోని, కులాధారిత అసహ్యతను, హెచ్చు తగ్గుల భావనలను తొలగించగల్గితే ఆ కులాలను ఐక్యపరచవచ్చు. కానీ కాన్షీరాం కులాన్ని రద్దు చేయాలని మాత్రం భావించలేదు. కుల సహోదరత్వాన్ని పెంచి రాజ్యాధికారాన్ని సాధించగల ఒక నిరపాయకర విషయంగా దాన్ని మార్చాలని ఆయన కోరిక. బామ్‌సెఫ్ నిర్మాణం బహుజన సమాజ్ పార్టీ విస్తృతీకరణకు ఉపయోగపడింది. బహుజనులలో చైతన్యం రగిల్చింది.

బహుజన సమాజ్ పార్టీ – కాన్షీరాం

బహుజనులలో రాజకీయ చైతన్యంను తీసుకొని రావాలని కాన్షీరాం 3500 కిలోమీటర్ల సైకిల్ యాత్ర ప్రారంభించి రాజ్యాధికారం బహుజనులకు రావాలని "ఓట్లు మావి, సీట్లు మీవా", ఇకపై చెల్లదు ఇకపై చెల్లదు! "ఓట్లు మావే, సీట్లు మావే" (ఓటు హమారా, రాజ్ తుమ్హారా! నహీ చలేగా! నహీ చలేగా!!) అనే నినాదాన్ని ప్రచారం చేశాడు.

బహుజన సమాజ్‌పార్టీ సామాజిక పునాదుల కోసం కాన్షీరాం 1978 నుండి 1984 వరకురాజకీయేతర కార్యక్రమాలపై దృష్టిపెట్టాడు. అందుకోసం తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేశాడు. బహుజనులకు రాజకీయాధికారం రావాలనే లక్ష్యం కోసం అవివాహితుడిగా మిగిలిపోవాలని నిశ్చయించుకొన్నాడు. బహుజనుల స్థితిగతుల్లో రాజ్యాధికారం ద్వారానే మార్పు వస్తుందని భావించి 1984లో అంబేద్కర్ జన్మదినమైన ఏప్రిల్ 14న 'బనియామాఫ్' 'బ్రాహ్మణ్‌సాఫ్', ఠాకూర్

హోఫ్' (వ్యాపారులయిన వైశ్యులను క్షమించండి, బ్రాహ్మణులను తుదముట్టించండి, ఠాకూరుల ప్రాబల్యాన్ని తగ్గించండి) అనే నినాదంతో బహుజన సమాజ్‌పార్టీ (బిఎస్‌పి) ని స్థాపించడం జరిగింది.

బిఎస్‌పి నిర్మాణ పని విధానం మిగతా రాజకీయ పార్టీలకన్నా భిన్నమైనది. విశిష్టమైంది. ఆచారణాత్మకమైనది. సామాజిక పరివర్తన అంతిమ లక్ష్యంగా బిఎస్‌పి పనిచేస్తోంది. ముఖ్యంగా ఐదురంగాల్లో సామాజిక పరివర్తన జరగాలి. సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ, సాంస్కృతిక, సాహిత్య భావజాల రంగాల్లో వర్ణాధిక్యతను తొలగించడం, బహుజనులు అన్ని రంగాల్లో ఎదగడం బిఎస్‌పి సామాజిక పరివర్తన ప్రధాన లక్ష్యం.

బుద్ధుడు, చార్వాకులు మొదలుకొని బహుజన శ్రేయోభిలాషులైన సంత్‌రవిదాస్, కబీర్‌దాస్, యోగివేమన, నారాయణగురు, మహాత్మా జ్యోతిబా ఫూలే, ఛత్రపతి సాహూజీ మహారాజ్, పెరియార్ రామస్వామి నాయకర్, డా. బి.ఆర్.అంబేద్కర్‌ల చారిత్రక వారసత్వాన్ని సిద్ధాంతాన్ని బహుజన సమాజ్‌పార్టీ తన వారసత్వంగా స్వీకరించింది. దీన్ని ఒకే మాటలో 'అంబేద్కరిజం బిఎస్‌పి ప్రాపంచిక దృక్పథం' అని ప్రకటిస్తుంది.

సామాజిక పునాదుల నుంచి రాజకీయ నిర్మాణం చేయడం కాన్షీరాం గొప్ప ప్రతిభకు నిదర్శనం. తన రాజకీయ భావజాలంతో ఒక దశాబ్దకాలంలోనే ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆ పార్టీని భాగస్వామి అయ్యే స్థాయికి పెంచడం కాన్షీరాం కార్యదీక్షకు నిదర్శనం. రాజకీయ ప్రచారంలో భాగంగా "ఒక ఓటు ఒక నోటు" అనే నినాదం ఇచ్చారు. ముల్లును ముల్లుతోనే తీయాలనేనానుడి మాదిరిగానే కులాన్ని కులంతోనే నిర్మూలించాలనేది కాన్షీరాం మరొక సూత్రీకరణ.

రాజకీయ సాంస్కృతీకరణ - కాన్షీరాం పాత్ర

బహుజన తాత్వికవేత్తలను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలకు అనుగుణంగా కాన్షీరాం తన ఆలోచన విధానాన్ని పదునుపెట్టి అనేక రాజకీయ సంస్కరణలను ఉత్తర్‌ప్రదేశ్‌లో తన శిష్యురాలైన మాయవతి ప్రభుత్వం ద్వారా ఆచరణలో రుజువుచేసి చూపినాడు. కాన్షీరాం బుద్ధుడు, మహాత్మాఫూలే, అంబేద్కర్, పెరియార్, నాయరాయణగురు, సాహు మహారాజ్ మేళాలు, జయంతులు చేసి ప్రత్యామ్నాయ సంస్కృతికి బాటలు వేశారు. ప్రత్యామ్నాయ సంస్కృతిలో భాగంగా స్త్రీని ముఖ్యమంత్రిని చేయడమేగాక, ఒకే సంవత్సరంలో 6 లక్షల మంది ఎస్.సి., ఎస్.టి స్త్రీలకుఉపాధి కల్పింపజేశారు. ఆయన సాధించిన రాజకీయ సాంస్కృతిక ఉద్యమంలో ప్రధానమయినది, పెరియార్‌మేళా. ఉత్తర్‌ప్రదేశ్‌లో 'పెరియార్‌మేళా' జరపడం ఒక సామాజిక చైతన్యానికి నమూనా అయింది. మొత్తం భారతదేశం నుండి ఈ మేళాకు అనేక రైళ్లు వేయించారు. దళితుల కోసం బహుజన సమాజ్ ఫౌండేషన్‌ను రూపొందించారు. కాన్షీరాం లక్నోలో అంతర్జాతీయ బౌద్ధ విమానాశ్రయంను నిర్మించి, బౌద్ధమత దేశాలన్నింటికి లక్నో నుండి విమానయాన మార్గాలను నడిపిస్తామని ముఖ్యంగా థాయ్‌లాండ్, జపాన్, టిబెట్ వంటి దేశాలకు, లక్నోకు తత్సంబంధాలు కల్పిస్తామని ప్రకటించారు.

భారతదేశాన్ని బౌద్ధ భారతంగా నిర్మించడానికి ఆయన పథకం రూపొందించారు. అంతేగాక తాజ్‌మహల్ కంటే అంబేద్కర్ పార్క్‌ను కోట్లాది రూపాయలతో నిర్మించి ప్రపంచం నుండి తరలివస్తున్న ముఖ్యులకు భారతదేశ సంస్కృతి మూలవాసులదేనని బోధించే ఒక వ్యవస్థను ఆయన రూపకల్పన చేశారు. 'తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం సిద్ధిస్తుంది' అనే మావో వ్యాక్యాన్ని పదేపదే ప్రస్తావించేవాడు. అధికారం అంటే రాజ్యాధికారం ఒక్కటే కాదు రాజకీయ, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, ప్రభుత్వ యంత్రాంగ, భూస్వామ్య, సాంస్కృతిక అంశాలతో కూడిన అధికారం అని వాఖ్యానించాడు. మొదట రాజకీయ ప్రచార నిర్మాణం చేశారు. సామాన్య ప్రజలలో బహుజన ఉద్యమం అవసరంను గుర్తుఉండేటట్లు బలోపేతం చేయడం జరిగింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలు, దళితులు, స్త్రీలు అల్పసంఖ్యాకుల్లో బహుజన సమాజ్ పార్టీ సంస్కరణాత్మక ప్రక్రియలను విస్తృతంగా ప్రచారం చేశారు.

ముఖ్యంగా దళితులపై జరిగే హత్య, అత్యాచారాల కేసుల విషయంలో అరవై రోజుల్లోనే విచారణ పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. లాకప్ మరణాలు, మానభంగాల ఘటనలు 24 గంటల్లోగా జాతీయ మానవహక్కుల కమిషన్‌కు, ప్రభుత్వానికి రిపోర్టు చేయాలనే నిర్ణయంను కూడా చేశారు. బహుజనుల్లో కాన్షీరాం తీసుకువచ్చిన రాజకీయ, సంస్కృతీకరణల ఆచరణ వేలాది వెనుకబడిన వర్గ ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలను చూపెట్టగలిగింది.

ముగింపు

భారతదేశంలో దళిత, వెనుకబడినవర్గాల ఆశాజ్యోతిగా వెలుగొంది దేశ రాజకీయాలను శాసించిన కాన్షీరాం బహుజన బాంధవుడుగా చెప్పవచ్చును. నేటి రాజకీయ చిత్రపటంలో ఉత్తర్‌ప్రదేశ్ శాసించగలిగే స్థాయిలో ఉంది. ఈ రాష్ట్రంలో బిఎస్‌పి తన చైతన్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి కాన్షీరాంకు ఎన్నో సంవత్సరాల అకుంఠిత దీక్ష, దృఢసంకల్పం, బహుజనుల దీవెనలున్నాయి. భవిష్యత్ భారత్ మూలవాసులదే అనేది కాన్షీరాం సుస్పష్టం చేశారు.

భారతదేశ వర్ధమాన రాజకీయాలలో ఒక విశిష్టమయిన ప్రాధాన్యతను సంతరించుకున్న ఉద్యమం బిఎస్‌పి ఉద్యమం. ఈ దేశ సంస్కృతి నిర్మాణంలో బహుజనుల పాత్ర అనివార్యమయిందిగా, ఉత్పత్తి కులాలుగా ఉన్న ఈ సమాజానికి రాజ్యాధికారం ఇవ్వాల్సిందేనని దేశం మొత్తం మీద ఒక ప్రబలమయిన రాజకీయ ప్రచారాన్ని, ఉద్యమాన్ని నిర్వహించిన కాన్షీరాం ఆదర్శప్రాయుడు. యమునా నదీ తీరంలోని 'నిగమ్ బోధ్‌ఘాట్'లో కాన్షీరాం భౌతికకాయానికి బౌద్ధమత ఆచారాల ప్రకారం అంత్యక్రియలు జరిగాయి. కాన్షీరాం మరణం దేశంలోని దళిత బహుజన వర్గాలకు తీరనిలోటు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఫూలే, అంబేద్కర్, జగజ్జీవన్‌రాం లాంటివారు కృషిచేస్తే, రాజ్యాధికారానికి మార్గాన్ని నిర్దేశించిన ఘనుడు కాన్షీరాం. ఆయన ఆలోచనా విధానాన్ని, మార్గాన్ని బహుజనులు అనుసరించినట్లయితే అదే ఆ మహానుభావుడికి ఘనమైన నివాళి. ◆

చేనేత రంగానికి పలు ప్రోత్సాహకాలు అందిస్తేగాని ఈ రంగం నిలబడే స్థితి లేదనీ, నిర్బంధంగా చేనేత వస్త్రాల వాడకాన్ని ప్రభుత్వమే ప్రోత్సహించాలని అంటున్నారు **బండారు జ్వాలానరసింహం**

చేనేత రంగం సవాళ్లు - పరిష్కారాలు

చేనేతకు సహజ మరణం లేదు, బలవంతపు చావు తప్ప, ప్రస్తుతం పాలకులు చేస్తున్నదదే. ప్రపంచీకరణ విషకౌగిలిలో చిక్కి చేనేత రంగం విలవిలలాడుతోంది. నూతన ఆర్థిక విధానాలు ఈ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పాలనలో, స్వాతంత్ర్యం తర్వాత ఈ అరవై ఏళ్ల ప్రస్థానంలో ఏ రంగం ఎదుర్కోని పెను సంక్షోభాలను, సవాళ్లను చేనేత రంగం ఎదుర్కొన్నది, ఎదుర్కొంటున్నది.

భారతదేశ సంప్రదాయ గ్రామీణ ఉపాధి రంగం చేనేత. మానవ మేధస్సుతో అభివృద్ధి చెందిన గ్రామీణ ఉపాధి వృత్తులలో చేనేత ప్రథమంగా ఉన్నది. ప్రస్తుత పాలకవర్గాలు అనుసరిస్తున్న పెట్టుబడిదారీ విధానాల వల్ల ఈ రంగం చిక్కి చిధ్రమైపోతున్నది.

'కర్ర ఉన్నోడిదే బర్రె' అన్న చందంగా పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తల గుప్పెట్లోకి ఈ రంగం వెళ్లుతున్నది. కొంతకాలానికి 'చే మగ్గం' షోకేసులో బొమ్మలా చరిత్ర చెప్పుకునేందుకు మాత్రమే మిగిలి ఉంటుందనే భయం కలుగుతున్నది.

ఈ నేపథ్యంలో ఆధునిక సవాళ్లు ఎదుర్కొనేందుకు పాత విధానాలు సమీక్షించుకొని సరికొత్త విధి విధానాలు చేనేతరంగ రక్షణకు రూపొందించుకోవాల్సిన అవసరం మనందరిమీద ఉంది. అందుకు దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో చర్చలు - సదస్సులు - సమావేశాలు జరగాలి. తద్వారా బలమైన ప్రజా ఉద్యమాలు - పోరాటాలు నిర్వహించాలి.

ప్రపంచ వ్యాప్తంగా భారతదేశంలో చేనేత మగ్గాలు 84 శాతంగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా 38.90 లక్షల మగ్గాలపైన 1.24 కోట్ల మందికి ఉపాధి రంగంగా చేనేత ఉంది. వ్యవసాయం తర్వాత అతి పెద్ద గ్రామీణ ఉపాధి రంగం చేనేత.

ఈ రంగంలో 62.4 శాతం మహిళలు, 37.6 శాతం పురుషులు ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థలో 35 శాతం చేనేత ఉపవృత్తుల్లో ఉన్నారు. 68 శాతం వెనుకబడిన కులాలవారు (బి.సి.), 12 శాతం షెడ్యూల్డ్ కులాలు (ఎస్.సి.), 20 శాతం గిరిజనులు (ఎస్.టి.) ఈ వృత్తిలో ఉన్నారు. (కేంద్ర జౌళిశాఖ - 2001 రిపోర్ట్)

భారతదేశ జౌళి ఉత్పత్తిలో చేనేత రంగం వాటా 18.4 శాతం. మొత్తం భారతదేశం ఎగుమతులలో చేనేత వాటా 15 శాతం. భారతదేశ వస్త్రోత్పత్తిలో చేనేత వాటా 22.46 శాతం. భారతదేశంలో మొత్తం వస్త్రోత్పత్తిలో 49,462 మి.చ.మీ. (2006-07). దీనిలో చేనేత వాటా 5,111 మి.చ.మీ. 145 దేశాలకు భారతదేశం చేనేత వస్త్రాలను ఎగుమతి చేస్తోంది.

చేనేత ఎగుమతుల విలువ రు. 4,605 కోట్లు (2006-07). 2011-12 నాటికి రు. 9,623 కోట్లకు పెరగవచ్చునని అంచనా. (పదకొండవ పంచవర్ష ప్రణాళిక లెక్కల ప్రకారం)

జౌళి రంగం నుండి చేనేతకు రావలసిన నిజమైన వాటా 30 శాతం. అయితే ఈ రంగానికి కేటాయిస్తున్న నిధులు మాత్రం కేవలం 6-7 శాతం. దీనిలో ఖర్చు చేస్తున్న నిధులు కేవలం 2 శాతం మాత్రమే.

జాతీయ బడ్జెట్‌లో చేనేతకు కేటాయింపు 0.1 శాతం. ఒక మీటర్ చేనేత వస్త్ర ఉత్పత్తికి చేస్తున్న ఖర్చు 56 పైసలు. ఒక మీటరు చేనేతేతర వస్త్ర ఉత్పత్తికి చేస్తున్న ఖర్చు 89.8 పైసలు. (2006-07 కేంద్ర జౌళి శాఖ లెక్కల ప్రకారం)

గత ఇరవై ఎనిమిది సంవత్సరాల కాలంలో (1972-2000) చేనేత, చేనేత మేడప్స్ ఎగుమతుల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన విదేశీ మారక ద్రవ్యం రు. 18,828.59 కోట్లు. సంవత్సరానికి సగటున రు. 672.44 కోట్ల ఆదాయం ఉంది.

భారతదేశంలోని చేనేత రంగంలో సంవత్సరానికి సుమారుగా 50,000 కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోంది (1998-99 జౌళి మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం). మరో 50,000 వేల కోట్ల రూపాయల వ్యాపారం చేనేత పేరుతో పవర్‌లూమ్ వస్త్రాల అమ్మకం జరుగుతోంది.

ఉపాధి

చేనేత రంగంలో సగటున 426.85 మీటర్ల ఉత్పత్తికి ఒకరికి ఉపాధి ఉంది. కాని పవర్‌లూమ్ రంగంలో 6,940.48 మీటర్ల ఉత్పత్తికి ఒకరికి ఉపాధి ఉంది. ఒక చేనేత మగ్గానికి రు. 50,000 పరపతి సౌకర్యం కల్పిస్తే ఒక కుటుంబం (నలుగురు సభ్యులు) కు ఉపాధి దొరుకుతుంది.

ఒక మరమగ్గంను లక్ష రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేస్తే 1/5 వ వంతు కార్మికునికి మాత్రమే ఉపాధి దొరుకుతుంది. ఒక జెట్‌లూమ్‌ను మూడు లక్షల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేస్తే 1/5 వంతు కార్మికునికి మాత్రమే ఉపాధి దొరుకుతుంది. ఒక ఎయిర్

జెట్‌లూమ్‌ను కోటి ఇరవై లక్షల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేస్తే 1/5 వంతు కార్మికునికి మాత్రమే ఉపాధి దొరుకుతున్నది.

ఇంకా ఈ పవర్‌లూమ్ రంగానికి పన్నుల్లో రాయితీలు, ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, పన్ను నుండి మినహాయింపుల పేరుతో కోటానుకోట్ల రూపాయలు ప్రభుత్వం ఇస్తూ ఉన్నది.

ఒక కార్మికుడు అయిదు మరమగ్గాలు, అయిదు జెట్‌లూమ్‌లను, అయిదు ఎయిర్ జెట్‌లూమ్‌లను నడిపిస్తాడు. (1974 శివరామన్ కమిటీ రిపోర్ట్).

మనదేశంలో 77 శాతం కుటుంబాలు తల ఒక్కింటికి సరాసరి దినఖర్చు రు. 20 లోపు మాత్రమే (అర్జున్‌సేన్ గుప్తా నివేదిక). వీరిలో అత్యధికులు చేనేత రంగానికి చెందినవారు.

ఒక పవర్‌లూమ్ కార్మికునికి ఒక రోజుకు వచ్చే వేతనం రు. 100 ల నుండి రు. 120 ఉంటుంది. ఒక చేనేత కార్మికునికి ఒక రోజుకు వచ్చే వేతనం రు. 120 నుండి రు. 200 ఉంటుంది.

చేనేత రంగ రక్షణకు తీసుకోవాల్సిన చర్యలు

జాతీయ చేనేత విధానం : కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ 'జాతీయ చేనేత విధానం' ముసాయిదా తయారు చేసింది. ప్రస్తుతం ఈ ముసాయిదా కేంద్ర ఆర్థిక శాఖ వారి పరిశీలనలో ఉంది. ఈ పరిశీలన పూర్తి అయిన తర్వాత దీనిని పార్లమెంట్‌కు సమర్పిస్తారు. పార్లమెంట్ దీనిపై ఆమోద ముద్రవేయాలి.

అయితే ఈ ముసాయిదా తయారు చేసేముందు క్షేత్రస్థాయిలో చేనేత కేంద్రాలలో ఈ కమిటీ పర్యటించి అధ్యయనం చేయలేదు. 'చేనేతకు మరణశాసనం' అయిన సత్యం కమిటీ సిఫార్సులనే ఈ ముసాయిదాలో పొందుపరచారు. దీనివల్ల చేనేత మనుగడ శూన్యం.

ఈ ముసాయిదాకు ఆమోదం తెలిపే ముందు అన్ని చేనేత కేంద్రాలలో క్షేత్రస్థాయిలో దేశవ్యాప్తంగా అధ్యయనం జరగాలి. చేనేత రంగంలోని అన్ని వర్గాల వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. చేనేత కార్మిక నాయకులను, చేనేతపై అధ్యయనం చేసే సంస్థలను, ఉపవృత్తుల వారిని, మేధావులను ఈ కమిటీలోకి తీసుకోవాలి. తద్వారా వారి సూచనలు – సలహాలు తీసుకొని ఈ ముసాయిదాను తయారు చేయాలి.

జౌళి నుండి చేనేతను విడదీయాలి : జౌళి రంగం నుండి చేనేతను విడదీయాలి. చేనేతకు ప్రత్యేక మంత్రిత్వశాఖను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలి.

చేనేతకు సరిపడ చిలపల నూలు తయారు చేయాలి : సాలీనా చేనేత రంగానికి 561 మి.కే.ల చిలపల నూలు కావాలి. భారతదేశంలో 1588 నూలు మిల్లులు 500 మి.కే.లకు మించి ఉత్పత్తి చేయడం లేదు. దేశంలో ఉత్పత్తి అయిన చిలపల నూలు 39 శాతం పవర్‌లూమ్ రంగంలో వినియోగించబడుతున్నది (సత్యం కమిటీ నివేదిక 1999).

టెక్స్‌టైల్స్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్స్ ఉత్తర్వులు 2001లోని క్లాజ్ 3, 8, 11 ల ప్రకారం రూపొందిన హ్యాంక్‌యార్న్ ప్యాకేజింగ్ నోటిఫికేషన్ 1.1.2003లో ఉన్నటువంటి ఉత్తర్వులు పార్ట్ 11లోని చట్టం ప్రకారం 50 శాతం నుంచి 40 శాతం చిలపల నూలు తయారీ తగ్గించి అది మూడు నెలల కాలంలో మిల్లులు తయారు చేయవచ్చును అని నిబంధన ఉంది. దీనివలన చేనేత ప్రాణ వాయువులాంటి చిలపల నూలు అందకుండా చేసి బలవంతంగా చేనేతను చంపడమే. ఈ చట్టబద్ధమైన ఉత్తర్వులను తక్షణం రద్దుచేయాలి. చేనేతకు సరిపడ చిలపల నూలు మిల్లులు విధిగా తయారు చేయాలి. చేనేతకు సరిపడ చిలపల నూలు అందించిన తర్వాతనే ఎగుమతి చేయాలి.

నూలు బ్యాంకులు ఏర్పాటు చేయాలి : 1991–2006 మధ్యకాలంలో చిలపల నూలు ధరలు 300 శాతం పెరిగాయి. 18.4.2006న నూలు ధరల నియంత్రణ కమిటీ సమావేశమై దేశంలో 'నూలు కొరతలేదు' అని సిఫార్సు చేసింది. దేశంలో నూలు కొరత లేనప్పుడు నూలు ధరలు ఎందుకు పెరుగుతున్నాయో ఈ కమిటీ కేంద్రానికి నివేదించాల్సిన అవసరం ఉంది. దేశంలో 33 ప్రదేశాలలో కేంద్ర జౌళిశాఖ జనపనార బ్యాంకులు నడుపుతున్నది. హైదరాబాద్‌లో కూడా అదే తరహాలో నూలు బ్యాంకు ఏర్పాటు చెయ్యాలి, చేనేత ప్రధాన కేంద్రాలలో నూలు బ్యాంకులు ఉండాలి.

భారతదేశంలో 434 నూలు బ్యాంకులు నడుస్తున్నాయి. రాష్ట్రాలు నూలు డిపోలు మంజూరు చేస్తున్నవి. వీటిని నూలు బ్యాంకులుగా మార్చాలి.

చిలపల నూలు, రంగు రసాయనాలపై సబ్సిడీ ఇవ్వాలి : చేనేతకు ప్రాణాధారమైన చిలపల నూలు, రంగు రసాయనాలపై 30 శాతం సబ్సిడీ ఇవ్వాలి. నేషనల్ హ్యాండ్‌ల్యూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్.ఎచ్.డి.సి.) ద్వారా నేరుగా నూలు కొనుగోలుదారులకు చిలపల నూలు అందించాలి. ఎప్పటికప్పుడు చిలపల నూలు ధరలను రోజువారి పత్రికలలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

చేనేత రిజర్వేషన్ (ఉత్పత్తి) చట్టం 1985 పుట్టుక : బ్రిటిష్ వలసవాదుల కాలంలోనే భారతదేశంలో చేనేత రంగం నూలు కరువుతో తీవ్ర సంక్షోభం ఎదుర్కొంది. బ్రిటిష్ వారు వేసిన రాయల్ కమిషన్ – 1928 వ్యవసాయరంగం సంక్షోభం మీద వేసింది. కానీ వ్యవసాయ రంగం కంటే చేనేతరంగం తీవ్రమైన సంక్షోభంలో ఉందని ఆ కమిషన్ చెప్పింది. అందుకు ప్రధాన కారణం చేనేత రంగంలో నూలు కొరత చాలా తీవ్రంగా ఉందని ఆ కమిషన్ తేల్చింది.

నూలు కొరత సంక్షోభాన్ని నివారించేందుకు, ఆర్గనైజ్డ్ సెక్టార్ అయిన పెద్ద పెద్ద మిల్లుల పోటీకి చేనేత రంగం తట్టుకునేందుకు సహకార వ్యవస్థలోకి చేనేత కార్మికులను తీసుకురావాలని కమిషన్ సూచించింది. అప్పటి నుండి చరఖా సంఘాలు, చేనేత సహకార సంఘాలు మన దేశంలో ఏర్పడ్డాయి.

చేనేత పరిశ్రమలో సంక్షోభాలు ఇంకా తీవ్రమౌతున్న తరుణంలో ప్రజలు తమ శక్తి కొద్ది అనేక రూపాలలో ఆందోళనలు – పోరాటాలు చేస్తూ ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చారు. ఈ పోరాటాల ఫలితంగా ప్రభుత్వం తలవొగ్గి 1941లో నిజ నిర్ధారణ కమిటీ (ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ) ని నియమించింది. చేనేత కార్మికులకు కావాల్సిన చిలపల నూలు అందించాలని, కొన్నిరకాల ఉత్పత్తులను చేనేతకు మాత్రమే రిజర్వేషన్ చేయాలని ఈ కమిటీ మొట్టమొదటిసారిగా ప్రభుత్వానికి సూచించింది. ఈ సూచన

మేరకు 1945లో ఆల్ ఇండియా హ్యాండలూమ్ బోర్డును, 1949 లో ఆల్ ఇండియా కాటేజ్ ఇండస్ట్రీస్ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

నిరంతర చేనేత సంక్షోభాల నివారణకు ప్రభుత్వాలు వరుసగా ది టెక్స్‌టైల్ ఎంక్వయిరీ కమిటీ - 1954 (కనుంగో అధ్యక్షతన), ది ఇండస్ట్రియల్ పాలసీ రిజర్వేషన్స్ 1948 అండ్ 1956, వర్కింగ్ గ్రూప్ కమిటీ-1958, ది విలేజ్ అండ్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ కమిటీ (రెండవ పంచవర్ష ప్రణాళిక - కార్వే అధ్యక్షతన), పవర్‌లూమ్ ఎంక్వయిరీ కమిటీ 1964, ది హైపవర్ స్టడీ టీమ్ - 1974 (శివరామన్ అధ్యక్షతన), అబిద్ హుస్సేన్ కమిటీ - 1988, రాజ్యసభ పిటిషన్ కమిటీ - 1994 (సుష్మాస్వరాజ్ అధ్యక్షతన), మీరాసేత్ కమిటీ - 1995 (మీరాసేత్ అధ్యక్షతన), 17 నవంబర్ 2005న మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో అడ్వయిజరీ కమిటీ ఇలా అనేక కమిటీలు నియమించారు.

ఈ కమిటీల పూర్తి సారాంశం చేనేతకు చిలపల నూలు సరిపడా అందించాలని, కొన్ని రకాల ఉత్పత్తులను చేనేతకు తప్పనిసరిగా రిజర్వ్ చేసి దాన్ని చట్టం చేయాలని సూచించాయి. వీటి పర్యవసానంగానే 1985 నూతన జౌళి విధానం అనేక లొసుగులతో యాభై శాతం హ్యాంక్‌యార్న్ ఆబ్లిగేషన్, హ్యాండ్‌లూమ్ రిజర్వేషన్ ఆక్ట్ అనే చట్టాలు చేయబడ్డాయి.

1985 నూతన జౌళి విధానం చట్టంలోని సెక్షన్-3,4 లోని అంశాలు పూర్తిగా చేనేతను ధ్వంసం చేసే విధంగా ఉన్నాయి. అయినా అప్పుడు తగినంత ప్రతిఘటన చేనేత వర్గం చేయకపోవటం వలన ది ఎస్సెన్షియల్ కమొడెటీస్ ఆక్ట్ 1955, ది టెక్స్‌టైల్ కంట్రోల్ ఆర్డర్ 1956 ద్వారా చేనేతకు కావలసినంత పత్తి, నూలు దారం, ఉత్పత్తులకు సంబంధించిన నిబంధనలు కోల్పోవటం జరిగింది.

హైపవర్ కమిటీ - 1995 (మీరాసేత్ అధ్యక్షతన) చేనేతకు కేటాయించిన 22 రకాల రిజర్వేషన్‌లను 11 రకాలుగా తగ్గించాలని నిర్ద్వంద్వంగా ప్రభుత్వానికి సూచించింది. దీని పర్యవసానంగానే 1998లో చేనేతకు ధ్వంస రచన చేసిన ఎస్.ఆర్. సత్యం కమిటీ సిఫార్సులనే 2000 జాతీయ జౌళి విధానంలో దొడ్డి దారిన పాలకవర్గాలు ప్రవేశపెట్టటం జరిగింది.

అందువల్ల చేనేతకు సరిపడ చిలపల నూలు అందించాలి, 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలి.

ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం : ప్రతి జిల్లాకు ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేయాలి. రిజర్వేషన్ అడ్వయిజరీ బోర్డులో చేనేత రంగంపై అవగాహన కలిగిన వ్యక్తులు ఉండాలి. చేనేత వస్త్రాలను పవర్‌లూమ్ పై తయారు కాకుండా ఇప్పుడున్న చట్టాలను పూర్తిగా మార్చాలి. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి పూర్తి అధికారాలు ఇవ్వాలి. అమ్మకం జరిగే చోట కూడా నిఘా విభాగం నకిలీ చేనేత వస్త్రాలను పట్టుకొనే విధంగా చట్టాలు సవరణ చేయాలి.

చేనేత పేరుతో : చేనేత సహకార సంఘాలు, ఆప్కో సేల్స్ సెంటర్లు, చేనేత ఎగ్జిబిషన్లు, నేత బజారులు, చేనేత వస్త్రోత్పత్తిదారులు (మాస్టర్‌వీవర్స్) చేనేత పేరుతో పవర్‌లూమ్ వస్త్రాలను విస్తృతంగా అమ్మకాలు చేస్తున్నారు. చట్టాలను పూర్తిగా సవరించి చేనేత రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.

సాంకేతికాభివృద్ధి నిధి (టి.యు.ఎఫ్) : చేనేత రంగ రక్షణకు సాంకేతాభివృద్ధి నిధిని ఏర్పాటు చేయాలి. చేనేత రంగంపై పూర్తిస్థాయి అధ్యయనం జరగాలి. పవర్‌లూమ్ రంగానికి ఏ విధంగానైతే ఈ నిధిని ఏర్పాటు చేసి ఉపయోగిస్తున్నారో అదే విధంగా చేనేతకు కూడా వర్తింపచేయాలి. పవర్‌లూమ్ రంగానికి అందిస్తున్న అన్ని రకాల రాయితీలు, ప్రోత్సాహకాలు చేనేత రంగానికి కూడా అందించాలి.

అసంఘటిత రంగ కార్మిక బిల్లు : అసంఘటిత రంగ కార్మిక బిల్లు ద్వారా చేనేత కార్మికులుకు ఉపాధి, సాంఘిక భద్రతను కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ బిల్లును ఆమోదించాలి. ఇప్పటికే నిర్లక్ష్యానికి, దోపిడీకి గురైన-గురౌతున్న అసంఘటిత చేనేత కార్మికులకు ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మిక సమగ్రశాసనం (చట్టం) ద్వారా న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సులు ఆమోదించి బిల్లులో అందుకు అనుగుణమైన మార్పులు తీసుకురావాలి. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్రశాసనం చేయాలి. నిధులు కేటాయించాలి. నేషనల్ సెక్యూరిటీ ఫండ్, నేషనల్ ఫండ్‌లను ఏర్పాటు చేయాలి. ఆరోగ్య బీమా, సామాజిక సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా బీమా సౌకర్యం కల్పించాలి. అందుకు కేంద్ర ప్రభుత్వమే ఖర్చులు భరించాలి (అర్జున్‌సేన్ గుప్తా సిఫార్సులు - 61వ నేషనల్ శాంపిల్ సర్వే 2004-05 ఆధారంగా). ఈ సిఫార్సులను తక్షణం చేనేత కార్మికులకు అమలు చేయాలి.

చేనేత సహకార సంఘాలు, ఆప్కో : కేవలం 5 శాతం మాత్రమే చేనేత కార్మికులకు పని కల్పిస్తున్న చేనేత సహకార వ్యవస్థ పూర్తిగా అవినీతిలో కూరుకుపోయి ఉంది. ఆప్కో పరిస్థితి కూడా దీనికి భిన్నంగా ఏమీలేదు. కాబట్టి చేనేత సహకార సంఘాలను, ఆప్కోను పూర్తిగా ప్రక్షాళన చేయాలి. అందుకుగాను సహకార చట్టాన్ని సమూలంగా మార్చాలి. అందుకు పశ్చిన బెంగాల్, కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో ఉన్న విధానాన్ని పరిగణనలోనికి తీసుకోవాలి. ఒక స్వతంత్ర కమిషన్‌ను వేయాలి. అందులో అధికారులు, చేనేత కార్మికులు, కార్మిక సంఘ నాయకులు, చేనేత రంగంపై అధ్యయనం చేసే సంస్థల వారు మెజారిటీ సభ్యులుగా ఉండాలి. 50 శాతం మహిళలకు సహకార సంఘ పాలకవర్గంలో రిజర్వేషన్స్, సభ్యత్వం ఉండాలి.

చేనేత ఉత్పత్తి వ్యవస్థను చట్టబద్ధత చేయాలి : చేనేత రంగం 95 శాతం మాస్టర్ వీవర్ వ్యవస్థలోనే ఉంది. వీరికి ఎటువంటి చట్టాలు వర్తించటం లేదు. అటు ప్రభుత్వానికి గానీ, ఇటు కార్మికుల సంక్షేమానికి గానీ వీరు ఏమాత్రం బాధ్యత పడటం లేదు. అందువల్ల ఈ మాస్టర్‌వీవర్ వ్యవస్థను కచ్చితంగా చట్టపరిధిలోకి తీసుకురావాలి. ఈ చట్టబద్ధత వల్ల పవర్‌లూమ్ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు ఈ వ్యవస్థకి కూడా అందుతాయి.

చేనేత ప్రోత్సాహక మండలి (ఎచ్.ఇ.పి.సి.) : చేనేత ప్రోత్సాహక మండలిలో పవర్‌లూమ్ ఎగుమతిదారులు ఉండరాదు. 90-95 శాతం పవర్‌లూమ్ వస్త్రాలు చేనేత పేరుతో ఎగుమతి అవుతున్నాయి. ఈ విధానాన్ని అరికట్టాలి. చేనేత ప్రోత్సాహక మండలిలో చేనేత రంగానికి సంబంధించిన వారు మాత్రమే ఉండాలి.

బడ్జెట్ : జనాభా ప్రాదిపదికన చేనేతకు బడ్జెట్ కేటాయింపులు జరగాలి. బడ్జెట్ నిధులు పూర్తిగా ఖర్చు అయ్యేటట్లు చూడాలి. ప్రస్తుతం చేనేత జనాభా ప్రకారం రు. 15,000 కోట్లు చేనేత బడ్జెట్ అవసరం ఉంది. బడ్జెట్ ముందు పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపినట్లుగా చేనేత రంగంలోని ప్రముఖులతో, కార్మికులతో, కార్మిక నాయకులతో ప్రభుత్వం విధిగా చర్చలు జరిపి బడ్జెట్ రూపొందించాలి.

షెడ్డు కార్మిక వ్యవస్థ : చేనేత రంగంలో అత్యంత దయనీయంగా ఈ షెడ్డు కార్మికులు ఉన్నారు. సమాజం నుండి వెలివేయబడ్డ సంచార జీవులు వీరు. ఆకలి చావులు, ఆత్మహత్యలు ఈ రంగంలోనే జరుగుతున్నాయి. అందువల్ల షెడ్డు కార్మిక వ్యవస్థపై పూర్తిస్థాయి సర్వే జరగాలి. షెడ్డు కార్మికులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. షెడ్డులన్నింటిని గుర్తించి చట్టపరిధిలోకి తేవాలి. ప్రభుత్వం అందిస్తున్న ఏ ఒక్క సంక్షేమ పథకం ఈ షెడ్డు కార్మికులకు చేరటం లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ షెడ్డు కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి షెడ్డు కార్మికుని కుటుంబానికి నాలుగు సెంట్ల స్థలం ఉచితంగా గృహనిర్మాణం చేసి ఇవ్వాలి.

ప్రతి చేనేత కార్మికుని కుటుంబానికి 2.5 ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాల మెట్ట భూమి ఇవ్వాలి. ప్రతి చేనేత కార్మికునికి రు. 2 లక్షలు 50 శాతం సబ్సిడీతో ఆర్థిక సహాయం అందించాలి. చేనేత కార్మికులందరికీ చేనేత గుర్తింపు కార్డులు, క్రెడిట్ కార్డులు ఇవ్వాలి. చేనేత కార్మికులకు వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు రెండు వేల రూపాయలకు పెంచాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత సంక్షోభంపై అధ్యయనం చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలో చేనేత కార్మికులు, కార్మిక నాయకులు, మేధావులు, చేనేత రంగంపై అధ్యయనం చేసే సంస్థల వారు మెజారిటీ సభ్యులుగా ఉండాలి.

సామూహిక క్వాలిటీ డైయింగ్ యూనిట్స్ : సామూహిక క్వాలిటీ డైయింగ్ యూనిట్స్ ప్రతి ప్రధాన చేనేత కేంద్రంలో ఏర్పాటు చేయాలి. చేనేత రంగంలోని వారికి మాత్రమే భాగస్వామ్యం కల్పించాలి.

ఆరోగ్య బీమా పథకం : ఈ పథకంలో చేనేత కార్మికులందర్నీ చేర్చాలి. అన్ని రోగాలకు సంబంధించిన పూర్తి వైద్య సౌకర్యం ప్రభుత్వం ఉచితంగా కల్పించాలి. కార్మికుల ఆరోగ్య రక్షణకు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా బాధ్యత పడాలి. చేనేత కార్మికులందరికి హెల్త్ కార్డులు, ఆరోగ్య బీమా, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలి.

బాల బాలికల సంక్షేమం : వీరి రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఉన్నత విద్య అభ్యసించే వరకు ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలి. చేనేత వృత్తిదారుల పిల్లలందరికి ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలి.

చేనేత మహిళా సంక్షేమం : చేనేత రంగంలో 62.4 శాతం మహిళలు పనిచేస్తున్నారు. వీరికి ఎటువంటి సంక్షేమ పథకాలు అందటం లేదు. బడ్జెట్‌లో వీరికి ప్రత్యక కేటాయింపులు లేవు. చేనేత మహిళల సంక్షేమం కోసం రు. 500 కోట్లతో నిధిని ఏర్పాటు చేయాలి. పూర్తి మహిళా సంక్షేమ కార్యక్రమాలు ఈ నిధి ద్వారా అందించాలి.

ప్రత్యేక సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలి : చేనేత కార్మికులు 85 శాతం వృత్తి పరమైన దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యాధులు సంక్రమించి మరణిస్తున్నారు. వీరికి ప్రత్యేక వైద్య నిపుణులచేత వైద్యం అందించాలి.

చేనేత వృద్ధాశ్రమాలు : అరవై సంవత్సరాలు దాటిన చేనేత కార్మికులకు చేనేత వృద్ధా శరణాలయాలు ఏర్పాటు చేయాలి. వారికి పూర్తిస్థాయి వసతి, పోషకాహారం కల్పించి కాపాడాలి.

కొత్త చేనేత సహకార సంఘాల రిజిస్ట్రేషన్ : చేనేత కార్మికులందరిని పూర్తిగా సహకార సంఘంలోకి తీసుకురావాలి. అందుకు గాను కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేసుకొనేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి.

మరమగ్గాలు మార్కు : మరమగ్గాలు తయారు చేస్తున్న అన్ని రకాల ఉత్పత్తులపై 'మరమగ్గాల మార్కు' వేయాలి.

విద్యుత్ రాయితీ ఇవ్వాలి : రాష్ట్ర మరమగ్గాల కార్మికులకు జి.ఒ. 518 ఐ.ఎల్.సి., 12.10.2001 ద్వారా రు. 1.74 పైసలుగా ఉన్న యూనిట్ ధరను రు. 0.87 పైసలకు అంటే 50 శాతం రాయితీ ప్రకటించింది. అదే పద్ధతిలో చేనేత రంగానికి 50 శాతం విద్యుత్ రాయితీ ఇవ్వాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పవర్‌లూమ్ రంగానికి అందిస్తున్న అన్ని రకాల విద్యుత్ రాయితీలు చేనేత రంగానికి కూడా వర్తింపజేయాలి.

మార్కెటింగ్ సౌకర్యం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో చేనేత వస్త్రాలు వాడే విధంగా కేంద్రం చట్టం చేయాలి. వారానికి ఒకరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేనేత వస్త్రాలు ధరించాలి. ప్రభుత్వం, ప్రైవేట్ పాఠశాలల్లో చేనేత వస్త్రం వాడాలి. అందుకు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జి.ఒ. నెం. 56 ప్రకారం ప్రభుత్వోద్యోగులందరూ చేనేత వస్త్రాలు ధరించాలి.

సంక్షేమ పథకాలు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించే అన్ని సంక్షేమ పథకాలు నేరుగా చేనేత కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలి. అందుకు చేనేత రంగంలో అవగాహన కలిగిన మేధావులను, ప్రజాసంఘాల వారిని, చేనేతలో అధ్యయనం చేస్తున్న సంస్థల వారి సూచనలు, సలహాలు విధిగా తీసుకోవాలి.

చేనేత బ్యాంకు ఏర్పాటు చేయాలి : చేనేత కార్మికులకు, వస్త్రోత్పత్తిదారులకు, స్వంత మగ్గాలపై చేనేత వస్త్రాలు ఉత్పత్తి చేసేవారికి, ఉపవృత్తుల వారికి, స్వంతపూచీకత్తు మీద రుణాలు అందించాలి. బడా పారిశ్రామిక వేత్తలకు పెట్టుబడిదారులకు ప్రభుత్వమే పూర్తిగా పూచీబడి రుణాలు అందిస్తుంది. అదే విధంగా చేనేత రంగంలో ఉన్న అన్ని వర్గాల వారికి ప్రభుత్వమే బాధ్యత పడి రుణ సౌకర్యం విధిగా కల్పించాలి. ప్రతి మగ్గానికి యాభై వేల రూపాయల పరపతి సౌకర్యం కల్పించాలి.

క్లస్టర్ ప్రోగ్రాం : ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమలు జరుగుతున్న చేనేత క్లస్టర్ ప్రోగ్రాంలు ఏమాత్రం చేనేత రంగానికి ఆ రంగంలో ఉన్న చేనేత వర్గాల వారికి ఉపయోగపడటం లేదు. అందువల్ల క్లస్టర్ ప్రోగ్రాం విధానాన్ని సమూలంగా మార్పు చేసి చేనేతలకు ఉపోయగపడేలా రూపకల్పన చేయాలి. ఏ ప్రాంతాలలో అయితే క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నారో ఆ ప్రాంతంలోని కార్మికులతో, కార్మిక నాయకులతో చర్చలు, సమావేశాలు జరిపి వారి సూచనలు, సలహాల మేరకు క్లస్టర్ ప్రోగ్రాం రూపొందించాలి.

చేనేత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి : పార్లమెంట్‌లో చేనేత కార్మికుల కొరకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు చట్టం చేయాలి. వీరికి నివాసస్థలం, స్వంతఇల్లు, స్వంత మగ్గం, పిల్లలకు విద్యాబోధన, మహిళలకు కనీస వసతులు కల్పించే విధంగా చట్టాలు చేయాలి.

చేనేత సలహా మండలి ఏర్పాటు చేయాలి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత సలహా మండలిని ఏర్పాటు చేయాలి. అందులో చేనేత కార్మికులను, కార్మిక సంఘాల నాయకులను, చేనేతపై అధ్యయనం చేసే సంస్థలను, మేధావులను భాగస్వాములు చేయాలి. వారి సూచనలు, సలహాలు మేరకు చేనేత సలహా మండలి విధి విధానాలు ఉండాలి.

ఉపవృత్తులు : చేనేత రంగంలో ఉన్న ఉపవృత్తుల వారికి కూడా కొన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. వీరికి కూడా చేనేత గుర్తింపు కార్డులు ఇవ్వాలి.

ఎక్స్‌గ్రేషియా : ఆకలిచావులు, ఆత్మహత్యలతో మరణించిన చేనేత కార్మిక కుటుంబానికి ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా నగదు రూపంలో అందించాలి. కుటుంబంలో పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించేంత వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి. వారి కుటుంబ బాధ్యతను పూర్తిగా ప్రభుత్వమే భరించాలి.

మినీ స్పిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేయాలి : రాబోయే రోజుల్లో చేనేతకు చిలపల నూలు ఇబ్బందులు రాకుండా ఉండాలంటే కేంద్ర ప్రభుత్వం దేశం మొత్తంలో టఫ్ (టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ ఫండ్) స్కీం కింద విస్తృతంగా 2000 కదుళ్ల నుండి 5000 కదుళ్ల వరకు చిలపనూలు మాత్రమే ఉత్పత్తి చేయాలనే ఆంక్షలతో మినీ స్పిన్నింగ్ మిల్లులు ఏర్పాటు చేయాలి. ఈ మిల్లులు 100 శాతం చిలపల నూలు తయారు చేసి చేనేతకు మాత్రమే అందించే విధంగా చట్టం చేయాలి.

పదకొండవ పంచవర్ష ప్రణాళిక ముసాయిదా : పదకొండవ పంచవర్ష ప్రణాళిక ముసాయిదాలో 40 శాతం చిలపల నూలు తయారీపై పదకొండు రకాల చేనేత రిజర్వేషన్స్ పై సమీక్ష జరపాలని పేర్కొనటం జరిగింది. ఇది చేనేతను సమూలంగా ధ్వంసం చేసే కుట్రలో భాగం. దీన్ని తక్షణం కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలి. క్షేత్ర స్థాయిలో ఉన్న చేనేత కార్మిక వర్గంతో, కార్మిక నాయకులతో చర్చలు జరిపి ముసాయిదా తయారు చేయాలి.

చేనేత పార్కులు ఏర్పాటు చేయాలి : చేనేత రంగాన్ని సంక్షోభానికి గురిచేస్తున్న అపెరల్ అండ్ టెక్స్‌టైల్ పార్కులకు ప్రభుత్వం స్వస్తి చెప్పాలి. చేనేత పార్కులు ఏర్పాటు చేయాలి. అందులో చేనేత కార్మికులకు స్థానం కల్పించాలి. వారి జీవన ప్రమాణాలు మెరుగు పడేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలి.

సహజ రంగులు (నేచురల్ డైస్) : సహజ రంగులను వినియోగం లోకి తెచ్చి స్వదేశీ, విదేశీ మార్కెట్‌లో చేనేత రంగం వాటాను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. అందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలి : కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80పి (2) (ఎ) (II) ద్వారా ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు ఆదాయపు పన్ను నుండి మినహాయింపు ఇస్తోంది. ప్రస్తుతం చేనేత పరిశ్రమలో సహకార రంగంలో 5 శాతం, సహకారేతర రంగంలో 95 శాతం ఉపాధి ఉంది. సహకారేతర రంగం అసంఘటిత రంగంలో ఉంది. అందువల్ల ఈ రంగాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం గుర్తింపు నిచ్చి ఆదాయం పన్ను నుండి మినహాయింపు ఇవ్వాలి.

చేనేతకు ప్రత్యేక వ్యాపార, వాణిజ్య విధానం ఉండాలి : చేనేతకు ప్రత్యేకమైన చేనేత వ్యాపార వాణిజ్య విధానం ఉండాలి. చేనేత కోసం ఛాంబర్ ఆఫ్ హ్యాండ్‌లూం ఇండస్ట్రీ అండ్ కామర్స్ (సి.ఎచ్.ఐ.సి) ను ప్రభుత్వం తక్షణం ఏర్పాటు చేయాలి. చేనేత పై కమిటీలన్నింటిలో చేనేత కార్మికులను, కార్మిక సంఘ నాయకులను, చేనేత పై అధ్యయనం చేసే సంస్థల వారికి విధిగా మెజారిటీ సభ్యత్వం కల్పించాలి. ◆

అక్షరాస్యత పెరిగిన వేల సంవత్సరాల తరవాత కూడా మత గ్రంథాల్లోనూ, పురాణాల్లో ఏముందో చదివి తెలుసుకోలేని పామరులకు విస్సన్న చెప్పిందే వేదం అంటున్నారు **కొడవటిగంటి రోహిణీప్రసాద్**

రాసినది చదవడం

అక్షరాలకు ప్రాణం ఉండదు. అవి శబ్దాలకు కేవలం సూచకాలు మాత్రమే; ఉచ్చారణకు కొంతవరకే తోడ్పడతాయి కాని హావభావాలను పలికించలేవు. అందుకే ప్రతిభావంతులైన నటులు పసలేని నాటక సంభాషణకు కూడా ప్రాణం పోస్తూ ఉంటారు. నిత్య జీవితం మాటకొస్తే "దేవుని ఎదుట ప్రమాణం చేసి అంతా నిజమే చెప్తాను? అబద్ధం చెప్పనూ?" అంటూ కోర్టులో స్వరం మార్చి సాక్ష్యం చెప్పే పాతకాలపు జోక్ ఒకటి వింటూ ఉంటాం. మొత్తం మీద రాయడం, చదవడం మధ్య తేడాలుండవచ్చు. లిఖిత సమాచారం మన మేధస్సుకు సహాయపడే ఊతకర్ర వంటిది. చిన్నప్పటినుంచీ నేర్చుకుంటాం కనక అక్షరాలను చదివి, మనసులోనో, బిగ్గరగానో ఉచ్చరిస్తూ పదాలను అర్థం చేసుకోవడం మనకు అలవాటవుతుంది. ఎందుకంటే ప్రపంచభాషల్లో వేటిలోనైనా అక్షరాల స్వరూపానికి స్వతహాగా అర్థమేమీ ఉండదు. ఎటువంటి వంకరగీతలు ఎటువంటి శబ్దాన్ని సూచిస్తాయో ముందుగా నిబంధించిన సూత్రాలనే అందరూ పాటిస్తారు. ఇదొక షార్ట్‌కట్ పద్ధతి. ఇది ఎన్ని రకాలుగానైనా ఉండవచ్చు. వివిధ ప్రాంతాల్లో, వివిధ యుగాల్లో అనేక పద్ధతులు మొదలై, వ్యాప్తిలోకి వచ్చాయి.

ఇంగ్లిష్ అక్షరాలలాగే కనిపిస్తున్నా వాటి ఉచ్చారణలో ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, స్పానిష్ మొదలైన భాషల్లో తేడాలుంటాయి. ఇవి సరిగ్గా తెలియకపోవడం వల్ల అంధుల లిపిని బ్రెయిల్ అనడానికి బదులుగా మనవాళ్ళు తెలుగులో బ్రెయిలీ అనీ, రాక్‌విల్ మొదలైన ఊళ్ల పేర్లను రాక్‌విల్లీ అనీ రాస్తూ ఉంటారు. స్పానిష్ ఉచ్చారణ మరింత గొడవగా ఉంటుంది కనక శాన్‌హొసే అనే ఊరి పేరును చాలామంది శాన్‌జోస్ అని తప్పుగా పలుకుతారు. విదేశీ పదాలకూ, పేర్లకూ సరైన ఉచ్చారణను తెలిపే సదుపాయాలు ఇంటర్నెట్ ద్వారా పొందవచ్చుని ఈ కాలపు జర్నలిస్టులు కూడా గమనిస్తున్నట్టు కనబడదు. ఇంగ్లిష్‌లోనే వోట్ అనేమాటను ఓటు అని రాయడం, పైలట్ అనే మాటను పైలెట్ అనడం, మైనారిటీ, మ్యునిసిపాలిటీ మొదలైన పదాలను మైనార్టీ, మున్సిపాల్టీ అని రాయడం వగైరా తప్పుడు సాంప్రదాయాలను వారే కొనసాగిస్తూ ఉంటారు.

మనలాగా కాకుండా చైనా భాష వంటివాటిలో ఒకే అక్షరం ఒక పూర్తి పదాన్ని సూచిస్తుందంటే మనకు కొత్తగా అనిపిస్తుంది కాని నిజానికి అంకెల విషయంలో మనకూ అటువంటి ఏర్పాటే ఉంది. 4 అని రాసినప్పటికీ మనం దాన్ని నాలుగు అనే మూడక్షరాల పదంగానే పరిగణిస్తాం. కొన్ని భాషల్లో ఒక్కొక్క సంకేతమూ ఒక్కొక్క ఉచ్చరించదగిన శబ్దంగా పనికొస్తుంది. ఈ సంకేతాలు ఒక్కొక్కటీ చిత్రలిపి కావచ్చు. ఒకరకంగా చెప్పాలంటే ఇది శ్లేష పద్ధతి. దీనికి ఉదాహరణగా ఆరుద్ర తన కవిత ఒకదానికి సరదాగా '6ద్ర7పు' అనే శీర్షిక పెట్టారనేది చెప్పవచ్చు.


తెలుగులో ప్రాచీనకావ్యాల్లో అరసున్నా ఉండేదికాదు. ఎటొచ్చీ పూర్వకాలంలో తెలుగులో దాదాపు ఒకేలాంటి ఉచ్చారణ కలిగిన కొన్ని పదాలలో ఒకదాన్ని మామూలుగానూ, మరొకదాన్ని ముక్కుతో పలికేవారట. సందర్భాన్నిబట్టి ఏది ఎలా పలకాలో అందరికీ తెలిసేది. ఉదాహరణకు వాడు అంటే ఉపయోగించు, లేదా ఎండిపోవు అనే అర్థం ఉంది. మూడో అర్థంలో అతడు అని కూడా అనుకోవచ్చు. కానీ పండితులు మూడో సందర్భంలో మాత్రం వాఁడు అని రాయాలంటారు. ప్రాచీన కాలంలో లేని ఈ ప్రయోగం తరవాతి కాలంలో ఎందుకొచ్చిందో వివరిస్తూ తిరుమల రామచంద్రగారు కొన్ని విషయాలు రాశారు. పాత తెలుగులో వాండు అనే ప్రయోగం ఉండేది. ఇప్పటికీ రాయలసీమ మొదలైన ప్రాంతాల్లో బహువచనంలో వాండ్లు అనే అలవాటు కనబడుతుంది. ఈ వాండు అనే మాటను ఒక్కొక్కప్పుడు పూర్తి సున్నాతో వత్తి పలికే వారట. ఒక్కొక్కప్పుడు తేల్చి ముక్కుతో పలికేవారట. తేల్చి పలుకుతున్నప్పుడు అరసున్నా వాడాలి. ఆధునికయుగంలో భాష నేర్చుకోవడం పూర్తిగా పుస్తకాల మీదనే ఆధారపడుతున్న పరిస్థితుల్లో సరైనఅర్థం తెలియడానికని అరసున్నా చేర్చే నిబంధన పెట్టుకుని ఉంటారు.

ఇలాంటి విషయాల్లో ఒక్కొక్కప్పుడు రాసినదానికి, ఉచ్చారణకూ సంబంధం ఉండేది కాదు. రామచంద్రం గారు 1065 నాటి శాసనంలోని ఈ పద్యాన్ని ఉదహరించారు

'సకల పశుమతీశ మకుటలసద్రత్న
కిరణరుచి విరాజి చరణుణ్డయిన...'

ఇందులో చివరి పదాన్ని చరణుడయిన అనే చదవాలి. లేకపోతే ఆటవెలది నడక చెడిపోతుంది. ఇటువంటి పద్ధతుల కారణంగా మనకు ప్రాచీనకాలపు తెలుగు అక్షరాలు చదవడానికి కష్టంగా అనిపిస్తుంది. ఒకవేళ చదవగలిగినా ఈ అన్నమాచార్య రచనలాగా కొంత గందరగోళంగా అనిపిస్తుంది.

"...అద్దమరాతిరి దాంకా నంద్దు నింద్దు నుండ్డి వచ్చి
వొద్దురవోరా నీకు నింత వలశి నొల్లములు.."



రోసెటా శిల

ఇప్పటి తెలుగు ఉచ్చరించే పద్ధతిలో ఫోనెటిక్‌గా ఉంటుంది కనక మనకు అంత ఇబ్బందిగా ఉండదు. అయినా మామ, చీమ, దోమ వగైరా పదాలను కోస్తా వారిలాగా తక్కిన తెలుగువారు మాఁవ, చీఁవ, దోఁవ అనకపోవడం చూస్తూనే ఉంటాం.

లిపులవల్ల ఈనాడు ఎన్నెన్నో ఉపయోగాలున్నాయి కనకనే వాటి ఉచ్చారణ గురించి ఎంతో చెప్పుకోవడం వీలవుతోంది. కానీ ఆనాడైనా, ఈనాడైనా అక్షరాల ముఖ్యప్రయోజనం ప్రజలకు సమాచారాన్ని అందించడమే. రాసిపెట్టిన సమాచారం ఒకేసారిగా అనేకమందికి కనిపించినప్పుడో, అనేక సమయాల్లో అనేక తరాలకు అందుబాటులోకి వచ్చినప్పుడో సార్థకమవుతుంది.

సామాజిక ప్రయోజనమే రాసినది చదవడంలోని ముఖ్య విషయం. ఎందుకంటే ఎవరైనా ఇద్దరు వ్యక్తులు తమకు మాత్రమే అర్థమయే రహస్య లిపిలో సందేశాలు రాసి పంపుకోవచ్చు. అది ఇతరుల కేమీ ఉపకరించక పోవచ్చు. ప్రపంచంలో వ్యాప్తి చెందినవన్నీ అందరికీ ఉపయోగపడే రచనా పద్ధతులే. నాగరికత పెరిగి విస్తరించడానికి ఇవి చాలా తోడ్పడ్డాయి కానీ ఈనాటి సమాచార వ్యవస్థలోని అతి ముఖ్య అంశమైనవిగా పరిణమించిన లిపులు గతంలో విదేశీయులు ప్రవేశ పెట్టిన దాకా ప్రపంచంలో చాలా ప్రాంతాల్లో తలెత్తనే లేదు. వీటిలో ఆస్ట్రేలియా, పసిఫిక్ దీవులూ, ఆఫ్రికాలో భూమధ్యరేఖకు దక్షిణాన ఉన్న ప్రదేశమూ, (మధ్య అమెరికా ప్రాంతం మినహాగా) మొత్తం రెండు అమెరికా ఖండాలూ మొదలైనవి ఉన్నాయి. ఇతర నాగరికతలకు చెందిన అన్వేషకులూ, ఆక్రమణదారులూ ఈ ప్రాంతాలకు వచ్చినప్పుడు వారికి బోలేడంత లిఖితపూర్వకమైన సమాచారం సహాయపడింది. ఇందులో వారు స్థానికులపట్ల అవలంబించవలసిన వైఖరిని గురించిన అధికారిక సూచనలూ, పనికొచ్చే చరిత్ర వివరాలూ, యుద్ధ ప్రణాళికలూ మొదలైన వివరాలెన్నో ఉండేవి. వీటి సహాయంతో వ్యక్తిగతంగా గొప్ప తెలివితేటల అవసరం లేకుండా నిరక్షరాస్య సమాజాలను ఇతరులు సులువుగా లోబరుచుకోగలిగారు. అప్పటికే కొన్ని వేల ఏళ్ళుగా పెంపొంది ఉన్న వారి నాగరికత వారికి పరోక్షంగా తోడ్పడిందనుకోవచ్చు.

కానీ చరిత్రలో జరిగిన విచిత్ర పరిణామాల కారణంగా నాగరికతలన్నిటికీ పుట్టినిల్లయిన ఇరాక్ ప్రాంతంలో ఈనాడు ఎక్కువ మంది నిరక్షరాస్యులుండగా జపాన్‌లోనూ, స్వీడన్ మొదలైన దేశాల్లోనూ ఎక్కువ అక్షరాస్యత కనబడుతోంది. చదవడం, రాయడం పుట్టుకతో వచ్చే విద్యలుకావు కనక వీటికి శిక్షణ అవసరం. 2000లో జరిపిన సర్వే ప్రకారం మనదేశంలో కనీస స్థాయి అక్షరాస్యత పురుషుల్లో దాదాపు 68 శాతం, మహిళల్లో 42 శాతం ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ సంఖ్యలు మన పొరుగుదేశాలైన పాకిస్తాన్‌లో 58, 28 కాగా, బంగ్లాదేశ్‌లో 52, 30 అనీ, శ్రీలంకలో 95, 89 అనీ తేలింది. ఈనాడు సిటీ బస్సు నంబర్ల దగ్గర్నుంచీ ప్రతిదీ అక్షరాల రూపంలోనే కనిపిస్తుంది కనక చదువు రాకపోతే లాభం లేదు.

యునెస్కో జరిపిన పరిశీలనలను బట్టి చూస్తే నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ పేదరికమూ, తక్కువ ఆయుః ప్రమాణమూ, వెనకబాటుతనమూ, రాజకీయ నిరంకుశత్వమూ కనిపిస్తాయి. ఎటొచ్చీ అక్షరాస్యత అనేది వ్యక్తిగత సుఖ సంతోషాలకు గాని, సమాజంలో ఆర్థిక ప్రగతికాని, ప్రజాస్వామిక వ్యవస్థకుగాని కారణం అవుతందని చెప్పలేం. ప్రపంచజనాభా పెరుగుతున్న కొద్దీ నిరక్షరాస్యుల సంఖ్య కూడా పెరుగుతోంది. క్యూబా, చైనా, టాంజానియా, నికరాగువా మొదలైన దేశాలు చేపట్టిన కార్యక్రమాలు నిరక్షరాస్యతను తగ్గించడంలో మంచి ఫలితాలు సాధించినట్టు తెలుస్తోంది.

మన దేశంలో లిపి చరిత్ర ప్రాచీనమైనది. అది మొదటగా తలెత్తిన నాగరికత సింధునది ప్రాంతంలో మొదలైనట్టుగా వింటాం. దాదాపు రెండు లక్షల సంవత్సరాల క్రితం పుట్టుకొచ్చిన ఆధునిక మానవజాతి ప్రజలు కనీసం లక్ష సంవత్సరాల క్రితమే ఆఫ్రికానుంచి ఆసియా, మొదలైన తక్కిన ప్రాంతాలకు వలసవెళ్ళినట్టుగా తెలుస్తోంది. వీరంతా సింధునది సమీపంలోనే కాక మన దేశమంతటా స్థిరపడ్డారు. అయిన ప్పటికీ సింధునాగరికత ఎంతో విశిష్టమైనది. అక్కడ నిర్మించబడ్డ గొప్ప నగరాలూ, వీథుల రూపకల్పనా, తాగునీటికీ, మురుగునీటికీ అద్భుతమైన ఏర్పాట్లూ వగైరాలకు సాటిరాగల సమకాలీన నాగరికత లేవీ కనబడవు. నేటి పాకిస్తాన్‌లో 1920లలో జరిపిన మొహెంజోదడో, హడప్పా ప్రాంతాల్లో తొలి తవ్వకాలలో బైటపడ్డ అపూర్వమైన విశేషాలు సంచలనం కలిగించాయి. క్రీ.పూ. 2600–1900 మధ్య ఉచ్చదశకు చేరుకున్న ఈ నాగరికతలో లిపిని గురించిన ఆధారాలు కూడా దొరికాయి.

వేల సంవత్సరాల క్రితపు రచనా విశేషాలు చరిత్రకారులకు చిక్కు సమస్యలుగా తయారవడం మామూలే. ఎందుకంటే ప్రాచీన నాగరికతలన్నీ నేటిదాకా కొనసాగకుండా మధ్యలో ఎప్పుడో కాలగర్భంలో కలిసిపోయినవే. అప్పటి లిపులూ, భాషలూ అన్నీ ఎటువంటి సజీవసాక్ష్యాలనీ మిగల్చకుండా మరుగున పడిపోయినవే. ఉదాహరణకు క్రీ.పూ. 3300 ప్రాంతాల మొదలై, మూడు వేల ఏళ్లు అవిచ్ఛిన్నంగా కొనసాగిన ఈజిప్ట్ నాగరికత ప్రాచీన గ్రీక్ పర్యాటకుల నుంచీ అనేకమందిని అద్భుతపరిచింది. అప్పటివారు నిర్మించిన బ్రహ్మాండమైన పిరమిడ్లనూ, దేవాలయాలనూ, ఇతర నిర్మాణాలనూ ఎందరో ఎంతో ఆసక్తితోనూ, ఆశ్చర్యంతోనూ పరిశీలించారు. కానీ వారి భాష గురించి తరవాతి యుగాల్లో ఎవరికీ తెలియలేదు. వారి చిత్రలిపిని గురించి ఎందరో పరిశోధనలు జరిపినప్పటికీ నెపోలియన్ కాలందాకా అది చిక్కుముడిగానే మిగిలిపోయింది.



సింధు నాగరికతలో దొరికిన ముద్ర

ఎందరో విఫలయత్నాలు చేశాక 1821లో షాంపోలియోఁ అనే ఫ్రెంచ్ పరిశోధకుడి బృందానికి మూడు విభిన్న లిపులలో శాసనాలు చెక్కిన రోసెటా శిల ద్వారా సమాధానం లభించింది. అందులో ఒకే సమాచారాన్ని ప్రాచీన ఈజిప్ట్ చిత్రలిపిలోనూ, తరవాతి కాలపు డెమోటిక్

లిపిలోనూ, గ్రీక్ లిపిలోనూ రాసి ఉంచారు కనక ఎలాగో అలా తంటాలుపడి ఈజిప్ట్ చిత్రలిపి చదవగలిగారు. అలాగే మెసపొటేమియా వారి కీలలిపి (క్యూనీఫాం నమూనాలు యూరప్ నుంచి వెళ్ళిన అన్వేషకులకు పదిహేడో శతాబ్దంలోనే లభించాయి. కాని వాటిలో ఒకటి మూడు విభిన్న లిపులు కలిగినది కావడంతో కొన్ని దశాబ్దాల పాటు పరిశీలనలు జరిపిన మీదట సమస్య పరిష్కారమయింది. మన దేశానికి మాత్రం అటువంటి అవకాశమేదీ లభించలేదు.

సింధు నాగరికత గురించి మొదటి నుంచీ అనేక వివాదాస్పద సమస్యలుంటూనే ఉన్నాయి. మనవాళ్ళకు మొదటినుంచీ చారిత్రక దృష్టికన్నా సంప్రదాయబద్ధమైన వీరావేశాలు ఎక్కువ. హిందువులకు వేల సంవత్సరాలుగా వేదాలమీద అపారమైన విశ్వాసమూ, భక్తి శ్రద్ధలూ ఉన్నాయి. లోకాయతవాదమూ, బౌద్ధ జైనాలు తప్ప తక్కిన భారతీయ తత్త్వధోరణులన్నీ వేదాలను ప్రామాణికమైనవిగా భావిస్తాయి. అందుచేత అవి ఎవరూ రాయనటువంటి అపౌరుషేయాలనీ, బ్రహ్మ ముఖం నుంచి పుట్టుకొచ్చాయనీ నిజంగా నమ్మేవాళ్ళు ఈనాటికీ చాలామంది కనిపిస్తారు. ఇటువంటి నమ్మకాలేవీ లేని చరిత్రకారులు మాత్రం క్రీ.పూ. 1500 ప్రాంతాల రచించబడ్డట్టుగా వేదాలకు కాలనిర్ణయం చేశారు. సింధు నాగరికత మాత్రం అంతకు వెయ్యేళ్ల ముందు నుంచీ ఉన్నట్టుగా నిర్ధారణ అయింది.

అక్కణ్నించీ చిక్కులు మొదలయ్యాయి. ఆర్యులనబడేవారు మధ్య ఆసియా నుంచి మనదేశానికి వలసవచ్చారనీ, సింధు నాగరికత అప్పటికే వర్ధిల్లుతూ ఉందనీ చరిత్రకారులు అన్నారు. దీనర్థం ఏమిటంటే స్థానికులది ద్రావిడ సంస్కృతి అని. దీనికి సనాతన హిందూ మతాభిమానులు అంగీకరించరు. వేదాలు రచించిన ఆర్య సంస్కారం ఈ 'పుణ్యభూమి'కి చెందినదేననీ, అంత గొప్ప ఆర్యజాతి మనకు విదేశీయం కాజాలదనీ ముఖ్యంగా ఉత్తరాదివారు వాదిస్తారు. ద్రావిడ సంస్కృతి అనేది ఏమైనప్పటికీ అది ఆర్య సంస్కృతి కన్నా నీచమైనదని వారు స్పష్టంగా అనకపోయినా వారి ఉద్దేశం అదే అనిపిస్తుంది.

ఇంతకీ వేదాలది సంస్కృతభాష. (ఇది మనం అనుకునే సంస్కృతం కాదనీ, మరేదో దేవభాష అనీ చెప్పే మేధావులూ ఉన్నారు). దీనికీ సింధు లిపికీ ఏ సంబంధమూ కనబడదు.

సింధు నాగరికతలో దొరికిన లిపి ఆనవాళ్ళన్నీ ముద్రికల రూపంలో ఉన్న అచ్చులు, సుమారు రెండు వేలకు పైగా దొరికిన ఈ ముద్రికలను బంకమట్టి ముద్దలవంటి వాటిమీద గుర్తులు వెయ్యటానికి ఉపయోగించి ఉంటారు. అక్కడివారికి అప్పటికే మెసపొటేమియా ప్రాంతం ప్రజలతో వర్తక వాణిజ్యాలు జోరుగా సాగుతూ ఉండేవి. సరుకుల బంగీలమీద ముద్రలు వేసి ఎగుమతి చేసేవారని మెసొపొటేమియాలోని సాక్ష్యాలవల్ల తెలుస్తోంది. అతి ప్రాచీనమైన సింధు నాగరికత ఎంత సువిశాలమైనదో ఆధునికులకు తెలియాలంటే అందులో ఈనాటి పాకిస్తాన్ పూర్తిగానూ, భారత, అఫ్ఘానిస్తాన్ దేశాల్లోని అనేక భాగాలూ ఉండేవనేది చెప్పాలి. యాభై లక్షల జనాభాతో విలసిల్లిన ఈ నాగరికతకు చెందిన ఎనిమిది వందల కేంద్రాల అచూకీ ఇప్పటివరకూ తెలిసింది. వీటిలో సింధునదీ తీరాన ఉన్నవి వందకులోపే. ఇంత పెద్ద స్థాయిలో వర్ధిల్లిన నాగరికతలో లిపి ఉపయోగం జరిగే ఉండాలి.

దురదృష్టవశాత్తూ మనకు దొరికిన ముద్రికల్లో ఏది చూసిన ఐదు నుంచి ఇరవై ఆరు గుర్తులే కనిపిస్తున్నాయి. ఇవన్నీ అక్షరాలా, పదాలా, శబ్దాలకు సంకేతాలా అనే విషయం 70 ఏళ్ల దాకా తెలియనేలేదు. ఆ తరవాత సోవియట్ యూనియన్, ఫిన్లండ్ మొదలైన దేశాలకు చెందిన పరిశోధకులూ, భారత, పాకిస్తాన్ శాస్త్రవేత్తలూ కూడా పరిశీలనలు జరిపి ఈ లిపిని చదవగలిగే స్థాయికి చేరుకున్నారు. ఎటొచ్చీ వీరిలో తీవ్రమైన అభిప్రాయ భేదాలున్నాయి.



విస్తృతంగా పరిశీలనలు జరిపిన పార్పోలా (ఫిన్లండ్), అతనితో అంగీకరించిన ఐరావతం మహాదేవన్ తదితరులు ఈ భాష తమిళాన్ని పోలిన ద్రావిడ భాష అని భావిస్తున్నారు. ఉత్తరభారతీయ పరిశోధకులైన మధుసూదన్ మిశ్రా వంటివారు మాత్రం అది తప్పనీ, ఆ గుర్తులన్నీ సంస్కృతాన్ని పోలిన అక్షరాలకు సంకేతాలనీ అంటున్నారు. కెనడాలోని పరిశోధకులు కొందరు మరికొన్ని ప్రతిపాదనలు చేస్తున్నారు.

సింధులిపికీ తెలుగు, తదితర ద్రావిడ భాషలకూ సంబంధం ఉండవచ్చని కొందరంటే, సింధులిపిని ఈనాటికీ వాడుతున్న ఆదివాసీ తెగలు బిహార్‌లో కనబడుతున్నాయని మరికొందరంటున్నారు. ఈ ప్రతిపాదనలకు కొంత ప్రాధాన్యత కనిపిస్తుంది. ఎందుకంటే సింధు నాగరికత ద్రావిడులకు సంబంధించినదని అంటున్నవారు ముఖ్యంగా పేర్కొనే కారణం సింధునది ప్రాంతంలో తరవాతి కాలంలో ద్రావిడ సంస్కృతి కనబడటం లేదన్నదే. తరవాతి యుగాల్లో ఇండో ఇరానియన్ సంస్కృతికి చెందిన ప్రజలు చేసిన అనేక దాడుల కారణంగా ద్రావిడ సంస్కృతి తూర్పు దిక్కుకూ, దక్షిణాదికీ తరలి ఉండవచ్చని అంటున్నారు. ప్రస్తుతానికి ఇవన్నీ ప్రతిపాదనలే. వీటి నిరూపణకై ఎన్నో సాక్ష్యాలు సేకరించవలసి ఉంది. వ్యక్తిగత భావాలూ, ఆవేశాలూ ఎటువంటివైనా, వీటి గురించి చదివి తెలుసుకుంటూ ఉండడమే మనవంటి సామాన్యుల పని. వాదోపవాదాలూ, చర్చలూ నిపుణులైన పరిశోధకులు మాత్రమే చెయ్యాలి.

ఇవన్నీ అలా ఉంచితే అసలు లిపుల్లో అత్యంత ప్రాచీనమైనది సుమేరియన్ కీలలిపి కాదనీ, సింధునాగరికతకు చెందినదేననీ 1999లో బిబిసి ప్రకటించింది. అయిదున్నర వేల ఏళ్లనాటి కుండపెంకుల మీద గీసిన గుర్తులే ప్రపంచంలో అన్నిటికన్నా మొదటి లిపికి నమూనా అని పరిశోధకులు చెపుతున్నారు.

హడప్పా ప్రాంతంలో దొరికిన ఈ పెంకు మీది గుర్తులు కుండను ఆవంలో కాల్చక ముందూ, తరవాతా కూడా గిసినట్టుగా కనిపిస్తున్నాయని వారు చెప్పారు. ఈ గుర్తులకు కుండలోని పదార్థంతోనో, దేవతలతోనో సంబంధం ఉండవచ్చనీ ఊహిస్తున్నారు. ఈ లిపి గురించీ, తక్కిన నమూనాల గురించీ మనకేమీ తెలియకపోవడానికి కారణం ఈ భాషకు తరవాత వారసత్వమేదీ మిగలకపోవడమే. వేదకాలంలో లిపికి ప్రాధాన్యత ఉన్నట్టు కనబడదు. భారతదేశపు లిపులన్నిటికీ మూలమైన బ్రాహ్మీ లిపి క్రీ.పూ. నాలుగో శతాబ్దం తరవాత ప్రాచుర్యంలోకి వచ్చినట్టుగా భావిస్తున్నారు. ◆

స్వాతంత్ర్యానంతర కాలంలో సంక్షేమ దృష్టితో వచ్చిన ప్రజా పంపిణీ వ్యవస్థ, ఆ తర్వాత కాలంలో పాలకులు అనుసరిస్తున్న విధానాల వలన క్రమంగా బలహీనపడుతూ వచ్చిందని అంటున్నారు **రేండ్ల రాజేశం**

బలహీనపడుతున్న ప్రజాపంపిణీ వ్యవస్థ

ఆకలితో అలమటిస్తున్నన్న పేద ప్రజలకు ఇంత అన్నం పెట్టి ఆదుకోవలసిన ప్రజాపంపిణీ వ్యవస్థ (పి.డి.ఎస్.) అనేక అరిష్టాలతో ఈడ్చుకుంటూ సాగుతోంది. విధి విధానాల రూపకల్పన, నిర్వహణ, సమన్వయ లోపంతో పంపిణీ వ్యవస్థ పేదల కడుపు నింపాల్సిందిపోయి వారి కడుపుకొట్టే అవ్యవస్థగా తయారైంది. ఎన్నికల ప్రచారాస్త్రంగా, నాలుగు మెతుకులు విదిల్చే కార్యక్రమంగా పాలకులచే ఈసడింపబడుతూ తన ప్రాధాన్యతను కోల్పోతోంది. ప్రపంచంలో ఒక దేశం చేపడుతున్న అతి పెద్ద ప్రజా సంక్షేమ కార్యక్రమంగా వ్యవస్థలో ఒకటిగా మన్ననలందు కున్న పి.డి.ఎస్. నిర్వహణ భవిష్యత్ ప్రశ్నార్థకం అయింది. సబ్సిడీ ఆహారం, రేషన్‌కార్డులు, పంపిణీ రాజకీయమైనాయి. ప్రతి ఏటా ప్రభుత్వం కేటాయించే నామమాత్రపు నిధులు కోట్లాది అర్ధాకలి బాధితులకు ఒరగబెట్టింది తక్కువని ఇంకా అందుకోసం జరగాల్సింది ఎంతో ఉందని తెలుస్తోంది. పేద ప్రజలపైనున్న చిన్నచూపు, చులకన భావం వారికి వెన్నుముక అయినటువంటి పి.డి.ఎస్. పథకంపై చూపుతున్న కపట ప్రేమతో తేటతెల్లమౌతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యపు నీడలో ప్రజల బతుకులు మాడిపోతున్నాయని అనడానికి పి.డి.ఎస్. నిర్వహణ ఒక సజీవ సాక్ష్యం. కరువు కాటకాలకు కారణం కొరత కాదని, పంపిణీలో లోపమే అసలైన కారణమని సంక్షేమ ఆర్థికవేత్త అమర్త్యసేన్ అభిప్రాయం. ఇది ప్రజాపంపిణీ వ్యవస్థ గొప్పతనాన్ని అవసరాన్ని సూచిస్తుంది.

ఆకలి భారతం

1996లో రోమ్‌లో 'ఆహార భద్రత'పై జరిగిన అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశంలో 'ఆహారం అనేది అందరికీ అన్ని వేళలా వారి శారీరక, పౌష్టిక అవసరాలను తీర్చుతూ, ఆ ఆహారం వారికి ఆరోగ్యవంత మైన, చైతన్యవంతమైన జీవితాన్ని ఇచ్చేదిగాను, ఆర్థిక పటుత్వాన్ని పెంపొందించేదిగా ఉండాలని' వివరణ ఇచ్చింది. మన దేశం ఘనంగా చేపడుతున్న ప్రజాపంపిణీ వ్యవస్థ అటువంటి ఆహార భద్రతను ఉద్దేశించి నదే కాని ఈ వివరణ పై అంశాలందరికి చేర్చే పథకంగా లేదనేది జగమెరిగిన సత్యం. 'గ్రామీణ భారతంలో ఆహార కొరతకు వీడ్కోలు' అనే పథకాన్ని ప్రారంభిస్తూ 2001లో అప్పటి ప్రధానమంత్రి ఎ.బి. వాజ్‌పాయి 'మనదేశం 2007 ఆగస్ట్ 15 నాటికి ఆకలి శృంఖలాల నుంచి విముక్తి చెందుతుందని' ఘనంగా ప్రకటించారు. ఆరోజు గడిచిపోయింది. వజ్రోత్సవ భారత సంబరాలు జరుపుకున్నాం. కాని ఆకలిలేని భారతమేనా ఇది? మనది ఆకలి భారతం అయ్యింది. 2001లోనే 'ఆకలి లేని స్వేచ్ఛా భారతం' అనే పేరుతో జరిగిన సదస్సు ఇందుకోసం పది అంశాల కార్యాచరణ ఎజెండాను సిఫారసు చేసింది. అందులో ఆకలితో, పోషకాహారలేమితో అలమటిస్తున్న వారిని గుర్తించడం, సహాయ కార్యక్రమాల వివరాలను ప్రచారం చేయడం, ప్రోటీన్లు, కాలరీలు వంటి పోషకాహార లేమిని పూర్తిగా తొలగించడం, సంతులిత ఆహారం అందేలా చర్యలు తీసుకోవడం, శుభ్రమైన తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, స్థానిక స్థాయి ఆహారం అందించడం వంటివి ఇందులోని ముఖ్యాంశాలు. కాని ఈ సిఫారసులో ఒక్కటి కూడా ఆచరణకు నోచుకోలేదు. దేశం మొత్తం మీద ప్రజాపంపిణీ కార్యక్రమం వల్ల దేశవ్యాప్తంగా 6.52 కోట్ల కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయి. అయినప్పటికీ దేశంలో 26.1 శాతం ఉన్న పేద ప్రజలందరికీ పి.డి.ఎస్. దరిచేరడం అసాధ్యమౌతోంది. ప్రజాపంపిణీ వ్యవస్థ అందించే సేవలకు అర్హులైన వారిలో 57 శాతం మంది దూరంగా ఉన్నట్లుగా పదకొండవ పంచవర్ష ప్రణాళికా ముసాయిదా పత్రంలోనే ప్రణాళికా సంఘం పేర్కొంది. దానికి అనేక కారణాలున్నాయి.

లబ్ధిదారుల ఎంపికలో లోపాలు

దేశంలోని వివిధ స్థాయిల్లో అభివృద్ధి చెందిన రాజకీయవర్గం, వారికి తా అంటే తందానా అనే బ్యూరోక్రాట్లు, కింది స్థాయి ఉద్యోగుల వల్ల సామాజిక ఆర్థిక ఛిద్రాలు ఏర్పడి అసమానత విస్ఫోటనం అవుతోంది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధి పొందే కుటుంబాలను ఎంపిక చేయడంలోనే లోపం ఉంది. పెరిగిన జీవన వ్యయం ఆధారంగా పేద ప్రజలకు జీవన సౌకర్యాలు పెరగటం లేదు. దానివల్ల ఆకలికి సంబంధంలేని అనేక అంశాలను దృష్టిలో ఉంచుకొని పేదరిక దిగువ రేఖను (బి.పి.ఎల్.) నిర్ణయిస్తున్నారు. ఇంట్లో టి.వి.గాని, రేడియోగాని, సెల్‌ఫోన్‌గాని ఉంటే వారిని పేదరిక రేఖకు ఎగువన ఉన్నవారుగా గుర్తిస్తున్నారు. మార్కెట్ మాయాజాలం వల్ల ఇటీవలి కాలంలో ఇలాంటివి అందుబాటులోకి వచ్చాయే తప్ప వారి కొనుగోలు శక్తి వల్ల కాదు. దీంతో అనేక కుటుంబాలు కృత్రిమ ధనవంతమైన సబ్సిడీ బియ్యానికి

నోచుకోవడం లేదు. దీనివల్ల ఇంకా వారు అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి దూరంగా ఉండాల్సి వస్తోంది కూడా. తెల్లరేషన్ కార్డు కలిగి ఉంటే అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందడానికి అనువుగా ఉండటంతో స్థానిక రాజకీయ నాయకులు, పాలకవర్గ అనుచరులు చెప్పిందే వేదంగా రేషన్‌కార్డులు జారీ సమయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి తమ కుటుంబాల వారికి, అనుయాయులకు, కార్యకర్తలకు, బోగస్ పేర్లతో మంజూరు చేయించు కుంటున్నారు. రేషన్ సరుకుల్ని పంపిణీ చేసే కీలకమైన డీలర్ల ఎంపికలో కూడా స్థానిక నేతల మాటే చెల్లుబాటు అవుతుండటంతో ఇక పంపిణీలో అవినీతికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.

ప్రజల పథకం ప్రభుత్వాలకు భారమట

లబ్ధిదారులను ఎంపిక చేసే, పంపిణీ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలది. కాగా ఆ మేరకు ఆహార ధాన్యాలను కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు అందిస్తుంది. ఈ బాధ్యతల నుంచి కేంద్రం తప్పుకొని, చేతులు దులుపుకోవాలని భావిస్తోంది. 2001లో కేంద్రం రాష్ట్రాలే ఈ బాధ్యతను స్వీకరించాలని ప్రతిపాదించింది. కాని రాష్ట్రాలు ససేమిరా అన్నాయి. కేంద్ర సబ్సిడీల్లో అత్యధికం ఆహార సబ్సిడీలే కావడంతో సబ్సిడీలను తగ్గించాలంటూ ఈ పథకం పట్ల ఉన్న అసహనాన్ని అప్పుడప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రివర్యులు, ప్రధానమంత్రి వ్యక్తపరుస్తూనే ఉన్నారు. ఆహారధాన్యాల విధానం పై సలహా ఇవ్వడానికి 2002లో ఏర్పాటు చేసిన అభిజిత్ సేన్ కమిటీ కూడా పి.డి.ఎస్. ను వికేంద్రీకరించాలని ప్రతిపాదించింది. కాని కేంద్రం 'ప్రోత్సాహం' పై సందేహిస్తున్న రాష్ట్రాలు ముందుకు రావడం లేదు.

అమలులో శక్తి లేకా, ఉత్సాహం లేకా?

మరోవైపు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహణ, పంపిణీ వ్యయం కూడా భరించే స్థితిలో లేక తమకు కేటాయించిన ఆహార ధాన్యాల్ని కేంద్రం నుంచి స్వీకరించడానికి విముఖత వ్యక్తం చేస్తున్నాయి. ఇలా స్వీకరించని ఆహార ధాన్యాలు మొత్తంలో 30 శాతం వరకు ఉంటున్నాయి. ఈ విధంగా నిర్వహణ, పంపిణీ, రవాణా ఖర్చులు భరించే శక్తి ఉత్సాహం లేక అవి పేద ప్రజలకు దరిచేరకపోవడం శోచనీయం, పంటలు బాగా పండినప్పుడు గోదాముల నిండా పాత ముక్కిపోయిన బియ్యంను విదిలించుకోవడానికి పి.డి.ఎస్.ను వాడుకోవడంలో ఉత్సాహం కనబరుస్తూ, గోదాముల్లో బియ్యం నిండుకున్నప్పుడు వెనుకడుగెయ్యటం ఎంత వరకు సబబు.

దారి మళ్లుతున్న ఆహారం

బి.పి.ఎల్. కుటుంబాలకు కేటాయించిన ఆహార ధాన్యాల్ని తమ సబ్సిడీ లోటును, నిర్వహణ ఖర్చులను పూడ్చుకోవటానికి కొంచెం ఎక్కువ ధరకు ఎ.పి.ఎల్. (దారిద్ర్యరేఖకు ఎగువనున్న) కుటుంబాలకు అమ్ము కుంటున్నట్లు ఇటీవలి కాలంలో వార్తలు వస్తున్నాయి. ఒక్కో రేషన్ కార్డుకు గరిష్టంగా కేంద్రం ఇరవై కిలోల చొప్పున బియ్యం విడుదల చేస్తుండంగా రాష్ట్రాలు కుటుంబానికి ఎనిమిది లేదా పన్నెండు లేదా పదహారు కిలోల చొప్పున సర్దుతూ, మిగిలిన వాటిని ఎక్కువ ధరకు ఎ.పి.ఎల్. కుటుంబాలకు అమ్మినట్లు మన రాష్ట్రంలో ఆ మధ్యకాలంలో వెల్లడైంది.

పి.డి.ఎస్.లో పోషక విలువలేవి?

ప్రభుత్వం కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి నెలసరి నాలుగు కిలోల చొప్పున ఆహార పదార్థాలు (సాధారణంగా బియ్యం లేదా గోధుమలు) పి.డి.ఎస్. ద్వారా అందిస్తోంది. ఈ నాలుగు కిలోల బియ్యం ఒక వ్యక్తికి నిజంగా నెలంతా ఏ మేరకు సరిపోతాయి అనే విషయం ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఈ లెక్కన ఒక వ్యక్తికి ఒకరోజు పి.డి.ఎస్. ద్వారా అందిస్తున్న బియ్యం కేవలం 133 గ్రాములు. దీంతో వారు కడుపు నింపుకొని కాయకాష్టం చేసుకోవాలట. ఇది వారి ఆర్థిక పరిస్థితి నుంచి మెరుగుపరచలేదు, బయటపడేయలేదు. ప్రభుత్వం నిర్వహించిన ప్రకారం రోజువారీ తలసరి ఆహార వినియోగం కాలరీల్లో అయితే గ్రామీణులకు 2400 కాలరీలు, పట్టణప్రాంత వాసులకైతే 2100 కాలరీలు. ఈ నిర్వచనం కాయకష్టం చేసుకొని బతికేవారికి అనుకూలంగా లేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇబ్బడిముబ్బడి సబ్సిడీలతో పశువుల్ని వాటి శరీరం వాటికే బరువయ్యేలా పెంచుతుంటే మనదేశంలో మాత్రం నాలుగు మెతుకులను విదిల్చినట్లు సబ్సిడీ బియ్యం విదిల్చు తున్నారు. కాయకష్టం చేసే కూలీలకు ఈ ఆహారం నిజమైన పౌష్టికాహారంగా పనిచేస్తోందా? అది వారిని శారీరకంగా, ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా నిలదొక్కుకోవడానికి ఏ మూలకూ సరిపోదనేది జగమెరిగిన వాస్తవం. పోషకాహార విలువల్ని పెంచే ఆహార పదార్థాలు ప్రస్తుతం అమలవుతున్న పి.డి.ఎస్.లో శూన్యం. విటమిన్లు, ప్రొటీన్లు పొందని తల్లిదండ్రులు, వారి పిల్లలు పోషకాహారం లేకుండా ఆరోగ్యంగా ఎలా ఉంటారు? ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే 2007 వరకే కాదు 2050 వరకైనా ఈ దేశంలో అర్థాకలి నిద్రల్ని రూపుమాపడం అసాధ్యం.

నెరవేరని యు.పి.ఎ. హామీలు

ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తామని కాంగ్రెస్ నేతృత్వం లోని యు.పి.ఎ. ప్రభుత్వం తన కనీస ఉమ్మడి కార్యక్రమం (సి.ఎం.పి.)లో స్పష్టంగా పేర్కొంది. కాని ఇంతవరకు ఆ దిశలో తీసుకున్న చర్యలు శూన్యం. పైగా జి.డి.పి.లో సబ్సిడీల శాతం బాగా పెరిగిపోతోందని పదకొండవ పంచవర్ష ప్రణాళిక కాలంలో దీన్ని తగ్గించాలని తుది ఆమోదంలో పేర్కొన్నారు. దీనికి తగినట్లే మన ఆర్థికవేత్త అయిన ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, ఆర్థిక మంత్రి చిదంబరంలు సబ్సిడీలపై అసహనం వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. ఈ మహోన్నత కార్యక్రమం అమలులో ఎదురవుతున్న సమస్యలను, లోటుపాట్లను సరిదిద్దే చర్యలేవీ ముందున్న కాలంలో యు.పి.ఎ. ప్రభుత్వం చేపట్టే అవకాశం కనిపించడం లేదు. గ్రామాల్లోకి, మురికివాడల్లోకి వెళ్లిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వచ్చే వ్యక్తిగత సమస్యల వినతి పత్రాల్లో ఇప్పటికీ

రేషన్‌కార్డుల కొరకు అభ్యర్థనలే అధికం. అర్ధాకలి బతుకులకు, ఆకలిచావులకు ఇవి ముందుస్తు హెచ్చరికలుగా సూచిస్తాయి. మరోవైపు ధనవంతులు, వడ్డీ వ్యాపారులు బోగస్‌కార్డుల వ్యాపారంతో అప్పు కింద పూచీకత్తుగా రేషన్‌కార్డులన్ని తమ దగ్గర ఉంచుకోవడం, అస్మదీయులకు, అనుచరులకు రేషన్ కార్డులందించడంలో ప్రజాప్రతినిధుల అత్యుత్సాహం పి.డి.ఎస్.ను ప్రశ్నిస్తోంది. ప్రజలకు అందుబాటులో ఉన్న వనరులు ఏమిటన్నది గాక, ఆ వనరుల నుంచి వారు పొందుతున్నది ఏమిటన్న దానిపైనే వారి సంక్షేమం ఆధారపడి ఉంటుందని అమర్త్యసేన్ అభిప్రాయం. అలా అందుబాటులో ఉన్న పి.డి.ఎస్. నుంచి ప్రజలు మాత్రం ఏమి పొందడంలేదు. ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేసినప్పుడు ఆర్థికవ్యవస్థ అభిలషణీయంగా అభివృద్ధి చెందగలదన్న సేన్ మాటల ప్రకారం పి.డి.ఎస్. ప్రాధాన్యం ఎంత ఉందో చెప్పనవసరంలేదు.

పి.డి.ఎస్.లో ఉన్న లోపాలను 'కెరీర్ పారిక్' ఆధ్వర్యంలో నివేదిక స్పష్టం చేస్తూ దేశవ్యాప్తంగా పేదవారి కోసం కేటాయించిన ప్రతి రూపాయిలో కేవలం 22 పైసలు మాత్రమే పేదవారికి అందుతున్నాయనీ, అంతేగాక రేషన్‌కార్డులు రిజిస్టర్ చేయబడిన గృహాల్లో నివసిస్తున్న వారికి మాత్రమే జారీ చేస్తుండడంతో అనేక మంది గృహవసతి లేని పేదవారు ఈ పథకానికి దూరంగా ఉంటున్నారని పేర్కొంది. అంటే గూడులేని కోట్లాది కుటుంబాల వారు 'కూడు'కూ దూరమయ్యారని దీనర్థం.

రేషన్ దుకాణాల నిర్లక్ష్యపు నిర్వహణ

ఆహార పదార్థాల పంపిణీలో అత్యంత కీలకమైన దశ రేషన్ షాపులు. వీటిలో జరుగుతున్న అవినీతి అంతా ఇంతా కాదు. అమర్త్యసేన్ అభిప్రాయాలకు విరుద్ధంగా పంపిణీలో లోపాలను రేషన్ షాపుల ద్వారా సజీవ సాక్ష్యాలుగా బట్టబయలవుతున్నాయి. అనేక చౌకధరల దుకాణాల్లో పి.డి.ఎస్. ద్వారా పంపిణీ చేసే సరుకుల ధరలు నిరక్షరాస్యులైన పేద ప్రజలకు తెలియవు. రేషన్ డీలర్లు తక్కువ తూకంతో, ఎక్కువ ధరతో పేదల్ని దోచుకుంటుండగా, ప్రజా ప్రతినిధులు, అధికారులు సరుకులను బ్లాక్ మార్కెట్‌లోకి తరలించడం వంటివి ఎంత కాలం నుంచో చోటు చేసుకుంటున్నాయి. షాప్‌లోకి స్టాక్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పూర్తవతుందో తెలియదు. నెలనెలా పంపిణీ తేదీలను సరిగా పాటించక పోవడం, పంపిణీ వేళల్లో గందరగోళం మరో సమస్య. మంచి ఆదాయ మార్గంగా ఉండటంతో డీలర్ల ఎంపికలో ప్రతిభకు, రిజర్వేషన్లకు పాతర పెట్టి అవినీతితో, లంచంతో తమ అనుయాయుల సహకారంతో, కండ బలం, అండబలం ప్రదర్శించి సొంతం చేసుకోవడం సర్వసాధారణం అయిపోయింది. రేషన్ దుకాణాలు దూరంగా ఉండటం వల్ల అనేక నివాస ప్రాంతాల ప్రజలు మైళ్ల కొద్ది దూరం ప్రయాణించి పొందవలసి వస్తోంది. దీనిని పరిష్కరించేందుకు ప్రతి నివాస ప్రాంతానికి ఒక రేషన్‌షాప్‌ను ఏర్పరచాలి. కాని మన ప్రభుత్వాలు వీధికో బెల్టు షాపును ఏర్పాటు చేస్తూ రేషన్ షాపుల్ని మాత్రం కాలరాయడానికి నడుం బిగించాయి. మన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే డీలర్లకు ఇచ్చే మార్జిన్‌ను క్వింటాల్ ఇరవై అయిదు రూపాయల వరకు పెంచటం మాత్రం కొంత వరకు డీలర్లలో అవినీతిని అరికట్టడానికి ఉపయుక్తమౌతుంది.

కావాల్సింది 'ఆహార పెట్టుబడి'

తొమ్మిది నుంచి పది శాతం వృద్ధిరేటు, వేలకోట్లలో ఫారెక్స్ నిల్వలు, పైపైకి ఎదుగుతున్న సెన్సెక్స్ మ్యాజిక్ సంఖ్యలు, లక్షల టన్నుల గోదాముల్లో నిల్వలు ఇవి వృద్ధికి, అభివృద్ధికి చిహ్నాలని చంకలెగరేస్తే సరిపోదు. ఆకలిగొన్న కోట్లాది ప్రజలు ఎంత మంది సంతృప్తిగా భోజనం చేసి ప్రతిరోజు రాత్రి నిద్రిస్తున్నారనేది కావాలి. గోదాముల్లో లక్షల టన్నుల్లో ముక్కి ముక్కి ఉన్న ఆహార గింజల్ని ఇక విదిలించుకోక తప్పదనే దృష్టితో కాకుండా లబ్దిదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారి ఆరోగ్య, ఆర్థిక, సామాజిక స్థితిని మరింత మెరుగుపరిచేవిగా ఉండేటట్లు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఏ వ్యక్తి కూడా ప్రభుత్వం ఇచ్చే ముక్కిపోయిన, పాడయిపోయిన, నాసిరకం బియ్యం తిని శాశ్వతంగా కాలక్షేపం కోసం జీవించాలని కోరుకోడు. తనస్థాయి ఎంతో కొంత మెరుగుపడాలనే కోరుకుంటాడు. కాబట్టి ప్రభుత్వాలు దీర్ఘకాలం సబ్సిడీలను భరించవలసి వస్తుందేమోనన్న భయంతో కాకుండా వారిని ఆ దీనస్థితి నుండి వీలయినంత తొందరగా బయటికిలాగే చర్యగా భావించాలి. ఏ పూటకు ఆ పూట గడిస్తే చాలనుకొంటూ ఆశావాహ దృక్పథంతో బతుకు వెళ్లదీస్తూ ఏదైనా అవకాశం రాకపోతుందా అని వేచిచూసే అమాయకుల జీవితాల్లో వెలుగులు నింపాల్సి ఉంది. ముందుగా వారికి కడుపునిండా ఇంత తిండి పెట్టదరే, వారిపై చిన్నచూపు మాని వారిపై ఆహార పెట్టుబడి పెట్టడం, ఆ పెట్టుబడి ద్వారా పౌష్టికాహారం, ఆరోగ్యం, ఆర్థిక స్వయం స్వావలంబన అనే లాభాలు అందివస్తాయి. అది వారికి కొత్తశక్తినిచ్చి ఆర్థిక వ్యవస్థకు నిజమైన మానవ శక్తిగా ఉపయోగపడుతుంది. ఈ విధంగా వారిని అభిలషణీయమైన శ్రామిక పెట్టుబడిగా తీర్చిదిద్దితే మనదేశం తప్పక పురోగమిస్తుంది. ◆

వచ్చే సంచికలలో...

- **ఫోకస్ - జూలై 2008 : ప్రత్యేక ఆర్థిక మండలాలు**
- **ప్రాచీన లిపుల సమస్యలు - కొడవటిగంటి రోహిణీప్రసాద్**
- **ప్రభుత్వ విధానం - ఛిద్రమౌతున్న ఆదివాసుల జీవనం - ఎం. నాగరత్నం**

ఆహార భద్రత ఏది?

ఒక పక్క ఆహార కొరత ఎదుర్కొంటుంటే మరోపక్క మొక్కజొన్నను జీవఇంధనం తయారీకి వినియోగించడం శోచనీయం. దీని వలన మొక్క జొన్న బదులు గోధుమలను పశువుల దాణాగా వినియోగించాల్సి వస్తోంది. 2008లో అంతర్జాతీయ మార్కెట్‌లో గోధుమ ధర గత ఏడాది కంటే 83 శాతం పెరిగింది. మనిషి ఆహారానికి, కారు నడపడానికి (బయో ఫ్యుయల్‌తో) మధ్య పోటీ వచ్చేసింది. దేశంలో వ్యవసాయ రంగంలో పెట్టుబడులు తగ్గిపోవడం, చిన్న, సన్నకారు రైతాంగానికి ప్రోత్సాహం లేకపోవడం క్రమంగా ధరలు పెరగడానికి దారి తీస్తోంది.

మహిళా రిజర్వేషన్ బిల్లు

పార్లమెంట్ శాసనసభలో మూడింట ఒక వంతు (33 శాతం) మహిళల రిజర్వేషన్ కోసం ఉద్దేశించిన బిల్లును (108వ సవరణ బిల్లు – 2008) యు.పి.ఎ. ప్రభుత్వం మే 6న రాజ్యసభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లును ఎస్.పి., ఆర్.జె.డి., జె.డి.(యు) పార్టీలు వ్యతిరేకించాయి. గతంలో ఈ బిల్లును లోక్‌సభలో 1996, 98, 99 లలో మూడుసార్లు ప్రవేశపెట్టినప్పటికీ దళితులు, ఒ.బి.సి., మైనారిటీ స్త్రీల సబ్‌కోటా విషయంలో ఏకాభిప్రాయం కుదరక వీగిపోయింది.

భోపాల్ బాధితుల కడగండ్లు తీరేనా?

మే 5న నలభై మందికి పైగా భోపాల్ గ్యాస్ బాధిత పిల్లలు వారి తల్లిదండ్రులతో ప్రధాని మన్మోహన్ సింగ్ ఇంటి ముందు అకస్మాత్తుగా ప్రదర్శన చేపట్టారు. 'మేం కూడా ప్రధాని మనుమల వయస్సు వారమే. ఆయన వారి మనుమలు కలుషిత నీళ్ళు తాగడానికి, రోజుల తరబడి రోడ్లపైన కొట్లాడడానికి విడిచిపెట్టగలరా' అని ప్రశ్నించారు. తమకోసం ఒక ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి ఆర్థిక, వైద్య పునరావాసం కల్పించాలనీ, పర్యావరణ పరిశుభ్రతకు కృషిచేయాలనీ ఇలా పలు డిమాండ్లతో ప్రధానిని కలవడానికి వెళ్లారు. రెండున్నర దశాబ్దాలు కావస్తున్నా బాధితుల సమస్యలలానే ఉన్నాయి.

జన్యుమార్పిడి పంటలను నిషేధించాలి

మే 6న వందలాది రైతులు, సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, భారత్ కిసాన్ యూనియన్, ప్రముఖ వ్యక్తులు జెనిటికల్లీ మొడిఫైడ్ (జన్యుమార్పిడి) పంటలను నిషేధించాలని కోరుతు ఢిల్లీలో ప్రదర్శన నిర్వహించారు. 'జన్యుమార్పిడి పంటల రహిత భారత్ సంఘటన్'గా ఏర్పడి వీరంతా మనుషులకు, పశువులకు, భూమి, పర్యావరణాలకు నష్టం కలిగించే జన్యుమార్పిడి పంటలను నిషేధించాలని కోరారు. జన్యుమార్పిడి పంటలు అవసరంలేనివిగా, పరిణామాలు వెనక్కు మరల్చలేనివిగా, అవాంఛనీయ సాంకేతికతగా పేర్కొన్నారు. రాబోతున్న ఎన్నికల దృష్ట్యా రాజకీయ పార్టీలన్నీ జన్యు మార్పిడి పంటలపై తమ వైఖరిని తెలియజేయాలని డిమాండ్ చేశారు.

విజ్ఞానం అంతరిక్షంలో, ఆచారం పాతాళంలోకి

రాజస్థాన్‌లోని బారన్ జిల్లాలో హదౌటీ ప్రాంతంలో 'అక్షయ తృతీయ' సందర్భంగా వివాహ మేళాలు నిర్వహించారు. వీటిలో యాభై ఐదు బాల్యవివాహాలుగా గుర్తించి అధికారులు నిలిపివేశారు. బాలల అభివృద్ధి శాఖ అధికారులు, పోలీసులు వారి వయస్సు ధృవీకరణ పత్రాలు పరిశీలించి సరిగా లేనందున ఈ పెళ్లిల్లు ఆపేశారు. ఈ విధంగా హదౌటిలో పదిహేను పెళ్లిల్లు, ఖాదిల్ గ్రామంలో నలభై పెళ్లిలను ఆపేశారు. ఒకపక్క శాస్త్ర సాంకేతిక రంగంలో అగ్ని–3 గా అంతరిక్షం లోకి దూసుకుపోతుంటే (?) సామాజిక రంగంలో ఉన్న తీవ్ర వెనుక బాటుకు ఇలాంటి సంఘటనలు అద్దం పడతాయి.

బినాయక్ సేన్ విడుదల కోసం

పిల్లల డాక్టర్, పి.యు.సి.ఎల్. (పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్) నాయకుడు బినాయక్ సేన్‌ను అరెస్ట్ చేసి ఈ నెల 14కు సంవత్సరమైన సందర్భంగా పలు హక్కుల సంఘాలు, మేధావులు, ప్రజాస్వామిక వాదుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అంతర్జాతీయంగా కూడా పలు హక్కుల సంఘాలు, డాక్టర్లు, మేధావులు బినాయక్ సేన్‌ను విడుదల చేయాలని కోరారు. మానవహక్కులపై గౌరవం ఉంటే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని జస్టిస్ సచార్ అన్నారు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణతో చత్తీస్‌గఢ్ పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్ 2005, అన్‌లాఫుల్ ఆక్టివిటీస్ (ప్రివెన్షన్) ఆక్ట్ 1967 కింద బినాయక్ సేన్ అరెస్ట్ అయ్యారు. అమెరికా దేశపు గ్లోబల్ హెల్త్ కౌన్సిల్ వైద్యరంగంలోని సేవలకుగాను డాక్టర్ బినాయక్ సేన్‌కు 'జొనాథన్ మన్' అవార్డును ప్రకటించింది. అంతర్జాతీయంగా పలువురు నోబుల్ బహుమతి గ్రహీతలు కూడా బినాయక్ సేన్‌ను విడుదల చేయాల్సిందిగా భారత ప్రభుత్వాన్ని కోరారు.

జైపూర్‌లో బాంబు పేలుళ్లు

మే 13న అత్యంత జనసమ్మర్దం కలిగిన జైపూర్ పాతనగరంలో రద్దీగా ఉండే సమయంలో దాదాపు సాయంత్రం ఏడున్నర గంటలకు కేవలం పన్నెండు నిమిషాల వ్యవధిలో ఏడు చోట్ల బాంబు పేలుళ్లు సంభవించాయి. ఆ పేలుళ్ల వల్ల మొత్తం 64 మంది ప్రాణాలు కోల్పోయారు. 150 మందికి పైగా గాయాలపాలయ్యారు. గత మూడు సంవత్సరాల్లో కాశ్మీర్ కాక దేశంలోని వివిధ నగరాలు, పట్టణాలలో ఇరవై ఒకటి సార్లు బాంబు పేలుళ్లు సంభవించాయి. ఇలాంటి లక్ష్యశుద్ధి లేని పనులు చేస్తూ సామాన్యుల ప్రాణాలు తీస్తూ ఏ లక్ష్యాలు సాధించగలరు.

ఎం.ఎఫ్. హుస్సేన్ పై కేసులు కొట్టివేత

'భారతమాత'ను నగ్నంగా చిత్రీకరించి ఎం.ఎఫ్. హుస్సేన్ జాతి మనోభావాలను గాయపరచారంటూ ఆయనపై దాఖలైన మూడు కేసులు ఆధార రహిత ఆరోపణలేనంటూ మే 8న ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. పేయింటింగ్స్ అనేవి దృక్పథాన్ని చిత్రీకరిస్తాయని వాటిపై చట్టరీత్యా నేర సంబంధ చర్యలు చేపట్టలేమని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ తీర్పునిచ్చారు. ఇలాంటి తుచ్ఛమైన, చికాకు కలిగించే, వ్యక్తి మౌలిక స్వేచ్ఛను హరించే అభియోగాలను మెజిస్ట్రేట్ స్థాయిలోనే నిశితంగా పరిశీలించి తేల్చివేయడం మంచిదని అన్నారు. ◆

అసహజ మరణాల సూచి

సంకలనం : **రాంకి, వై. రామచంద్రం**

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనె మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైనపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 ఏప్రిల్ 2008 నుండి 20 మే 2008 వరకు)

జిల్లా	ఆత్మహత్యలు			హత్యలు				గుర్తు తెలియని	ఆకలి	ప్రమాదాలు			చికిత్స అందక, అనారోగ్యం	పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
	వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు	ఫ్యాక్షన్	కులం	మతం	తగాదాలు			పనిచేసే స్థలంలో	రహదారి	ఇతరాలు		ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)
హైదరాబాద్	–	–	28	–	–	–	13	13	–	–	42	37	–	–	–	–	15	5
రంగారెడ్డి	8	–	34		–	–	10	16	–	–	35	10	10	–	–	–	–	7
మహబూబ్‌నగర్	5	–	25	4	–	–	6	1	–	4	45	9	3	–	–	–	–	22
ఆదిలాబాద్	6	–	46	–	–	–	5	1	–	3	28	29	8	–	–	–	2	38
వరంగల్	2	30	–	–	–	–	15	–	–	14	49	37	12	–	–	–	2	67
కరీంనగర్	9	–	68	–	–	–	14	8	1	2	36	41	35	–	–	–	5	82
మెదక్	12	–	–	–	–	–	–	–	–	–	30	–	–	1	–	–	–	34
శ్రీకాకుళం	2	–	12	–	–	–	9	–	–	–	24	21	12	–	–	–	–	–
విజయనగరం	–	–	8	–	–	–	5	9	–	–	14	16	–	1	–	–	–	5
విశాఖపట్నం	–																	
తూర్పు గోదావరి	2	–	21	–	–	–	9	4	–	5	47	18	17	–	–	–	3	100
కృష్ణా	–	–	13	–	–	–	8	5	–	–	32	21	–	–	–	1	–	38
గుంటూరు	4	1	12	–	–	–	11	8	–	6	58	12	–	–	–	–	–	51
ప్రకాశం	–	–	13	–	–	–	3	15	–	5	37	29	–	–	–	–	–	13
చిత్తూరు	6	–	17	–	–	–	8	3	–	23	30	3	15	–	–	–	–	–
*ఇతర జిల్లాలు	–	–	–	9	–	–	–	–	–	–	–	–	–	–	–	–	–	182
మొత్తం	**56**	**1**	**327**	**13**	**–**	**–**	**116**	**83**	**1**	**62**	**507**	**283**	**112**	**2**	**–**	**1**	**27**	**644**

ఈ శీర్షికకు సహకారం అందిస్తున్న వారు :

హైదరాబాద్ – డి. విజయభాస్కర్; రంగారెడ్డి – వి. శంకరయ్య; మహబూబ్‌నగర్ – ఏసురత్నం; ఆదిలాబాద్ – శ్రీమన్నారాయణ మూర్తి; వరంగల్ – కె. శ్యాంరావు; కరీంనగర్ – ఎల్. సంతోష్; మెదక్ – పి. రాజు; శ్రీకాకుళం – జి. సుధీర్; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – రమణ; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్; కృష్ణా – బి. రమేష్‌బాబు; గుంటూరు – బి. అంజమ్మ ; ప్రకాశం – ఎన్. రవికుమార్; చిత్తూరు – పలమనేరు బాలాజి; * ఇతర జిల్లాల సమాచారం

With best compliments from

Maytas Hill County Residencies Private Limited

Bachupally, Ranga Reddy Dist.

RNI Regn.No.APTEL/2003/11482 Published 01/06/2008 PRINTED BOOK

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao